



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 126 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ బుధవారం 28 జనవరి 2026 పేజీలు : 12 వెల : 2/-




## 43ఏళ్ల తేదేపాను

# 48 ఏళ్ల యువగళం లీడ్ చేస్తోంది

### టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంట్ కమిటీల వర్క్ షాప్‌లోముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 43 ఏళ్ల తెలుగుదేశం పార్టీని 48 ఏళ్ల యువగళం లీడ్ చేస్తోందని.. పార్టీలో ఉన్న ఎక్కువ మంది నేతల సగటు వయసు ఇప్పుడు 48 ఏళ్లు అని సీఎం చంద్రబాబు అన్నారు. తెదేపా పార్లమెంట్ కమిటీలతో సమావేశం సందర్భంగా సీఎం మాట్లాడారు. "వచ్చే ఎన్నికల్లో ప్రతీ బూత్‌లో ఓట్లు పెరగాలే కానీ తగ్గ కూడదు. అభివృద్ధి కార్యక్రమాల గురించి పార్లమెంట్ అధ్యక్షులు ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలంగా తీసుకెళ్లాలి. ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టడంలో కీలకపాత్ర పోషించాలి. గుజరాత్‌లా వరుసగా ఎన్నికల్లో గెలవడం అలవాటు చేసుకోవాలి. 2004, 2009లో తెదేపా గెలిచి ఉంటే అభివృద్ధిలో రాష్ట్రం మరోలా ఉండేది. పవిత్రమైన శ్రీవారి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారు. కుప్పానికి హంద్రీనీవా నీరు తెస్తున్నామని డ్రామాలు ఆడారు. పూర్తి చేయకుండానే వెలిగొండను జాతికి అంకితం చేశారు. తప్పుడు ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టడం చాలా ముఖ్యం. మీడియాలోనే కాదు..మౌత్ టు మౌత్ చెప్పాలి. అప్పుడే క్లారిటీ వస్తుంది" అని నేతలకు దిశానిర్దేశం చేశారు.పార్టీ రోజురోజుకూ మరింత సమర్థవంతంగా పని చేసేలా బలోపేతం కావాలి. అందుకే పార్టీలో యువరక్తానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎనభై శాతం మంది కొత్తవారికి, చదువుకున్న వారికి ఎంపీ, ఎమ్మెల్యేలుగా అవకాశం కల్పించాం. దేశంలోనే యంగ్ పార్లమెంట్‌గా టీడీపీ ఉంది. సమర్థులకు పెద్ద పీట వేశాం. అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించాం. పార్లమెంట్ నియోజకవర్గాల్లో జరిగే కార్యక్రమాలకు పార్టీ అధ్యక్షులు, సెక్రటరీలు సమన్వయం మిగతా .. 2లో..

# అందరికీ అన్నీ తెలియవు..

### ప్రధాని మోదీ పరీక్షాపే చర్చ షార్ట్ వీడియో



**విశ్వం వాయిస్ న్యూస్ :** పరీక్షల సమయంలో విద్యార్థుల్లో భయాందోళన, ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చ'ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఈ కార్యక్రమానికి సంబంధించిన షార్ట్ వీడియోను మోదీ తన అధికారిక యూట్యూబ్ ఛానెల్‌లో విడుదల చేశారు. ఇందులో పాల్గొనేందుకు 4.5కోట్లకు మందికిపైగా రిజిస్టర్ చేసుకున్నారు. ఈ వీడియోలో మోదీ మాట్లాడుతూ.. 'మీ పద్ధతిని మీరు నమ్మండి. అందరికీ అన్నీ తెలియవు. కానీ ప్రతిఒక్కరికీ ఏదో ఒక విషయంపై అవగాహన ఉంటుంది. పరీక్షలు రాయడం అనేది తప్పనిసరి.' అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మోదీని కొన్ని ప్రశ్నలు అడిగారు. 'లక్ష్యానికి చేరువయ్యేందుకు.. మనం ఎలాంటి వాటిని అలవాటుగా చేసుకోవాలి'. 'ఇందుకు మనకి ప్రేరణ అవసరమా లేక క్రమశిక్షణ'. 'ఆత్మవిశ్వాసం పెరిగేందుకు మీరు ఎలాంటి సలహాలు ఇస్తారు' అని విద్యార్థులు మోదీని ప్రశ్నించారు. ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో వీటికి సమాధానం ఇవ్వనున్నారు.

## 'వీబీ జీ రామ్ జీ'పై

# రివర్స్ గేర్ వేయలేం

**విశ్వం వాయిస్ న్యూస్ :** బడ్జెట్ సమావేశాల్లో 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై చర్చ జరగాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రివర్స్ గేర్ వేసి.. గతంలోకి వెళ్లలేమని, అది అసాధ్యమని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఏదైనా ఒక్కసారి చట్టరూపం దాల్చాక దానిని పాటించాల్సిందేనన్నారు. ఈ నెల 28 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రం మిగతా .. 2లో..

## అమరావతికి చట్టబద్ధత కల్పించే

# బిల్లు తేవాలని కోరాం

### లావు శ్రీకృష్ణదేవరాయలు



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీకి చెందిన వివిధ అంశాలపై పార్లమెంట్‌లో చర్చించాలని కేంద్రాన్ని కోరామని తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవ రాయలు అన్నారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో నిర్వహించిన అఖిలపక్ష భేటీ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "ప్రాధాన్యం కలిగిన మిగతా .. 2లో..

## బీసీల రక్షణ చట్టం అమలుతోనే

# బీసీలకు భద్రత, న్యాయం

- ఆదరణ-3 పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంపై కసరత్తు
- రాష్ట్రవ్యాప్తంగా బీసీ భవనాల నిర్మాణం చేస్తాం
- డీఎస్సీ అభ్యర్థుల కోసం జిల్లాల వారీగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు
- రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ ల మంత్రి ఎస్.సవిత



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** బీసీల రక్షణ చట్టంతోనే బీసీలకు భద్రత, ఆత్మరక్షణ సాధ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. స్థానిక గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ కార్పొరేషన్ చైర్మన్ల తో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిగతా .. 2లో..

## సీఎం రేవంత్‌కు

# ఆయన గూఢచారి

### మాజీ ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది మాజీ ఎంపీ సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్సైజ్ మిగతా .. 2లో..

## ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై

# అమెరికాలో అసంతృప్తి




**విశ్వం వాయిస్ న్యూస్ :** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశంలో ట్రంప్ నిర్ణయాలకు ప్రజల మద్దతు భారీగా తగ్గింది. రాయిటర్స్-ఇప్సాస్ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం మిగతా .. 2లో..

## దేశ రాజకీయాల్లో

# 'యువగళం' పాదయాత్ర పెను సంచలనం : ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గతంలో చేపట్టిన 'యువగళం' పాదయాత్ర దేశ రాజకీయాల్లో పెను సంచలనమని ఆ పార్టీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. లోకేశ్ పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లూరులో 'యువగళం- ప్రజాగళం' పేరిట భారీ ర్యాలీ మిగతా .. 2లో..

## మేము సూపర్‌పవర్‌గా మారాలంటే


# భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే..

### కెనడా ఇంధన మంత్రి టిమ్ హడ్గ్‌సన్

**విశ్వం వాయిస్ న్యూస్ :** వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించే దిశగా భారత్-కెనడా అడుగులు వేస్తున్నాయి. ఇందులోభాగంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న కెనడా ఇంధన మంత్రి టిమ్ హడ్గ్‌సన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభివృద్ధి చెందుతోందన్నారు. ఇంధన రంగంలో మిగతా .. 2లో..

## హృద్రోగి ప్రాణాలు కాపాడిన

# భారత కోస్ట్‌గార్డ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** లక్షద్వీప్‌లోని అగాట్టీ ద్వీపంలో ప్రాణాలతో పోరాడుతున్న ఓ వ్యక్తిని భారత తీర రక్షకదళం రక్షించింది. అగాట్టీ ద్వీపంలోని 55 ఏళ్ల వ్యక్తికి గుండెపోటు రావడంతో లక్షద్వీప్ అడ్మినిస్ట్రేషన్ ఎస్‌వోఎస్ ద్వారా భారత కోస్ట్‌గార్డ్‌కు సమాచారం ఇచ్చింది. వెంటనే స్పందించిన తీర రక్షకదళం ఆ వ్యక్తిని ఆఘమేఘాల మీద కొచ్చికి తరలించింది. హృద్రోగిని అగాట్టీ ద్వీపం నుంచి తరలిస్తున్న సమయంలో విమానంలోనే మొబైల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వైద్య బృందం ప్రథమ చికిత్స అందించినట్లు తెలిపారు. అనంతరం అతడిని కొచ్చిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించామని కోస్ట్‌గార్డ్ అధికారులు మిగతా .. 2లో..

## ఆటోలో శిశువు..

# రక్షించిన ఆర్పీఎఫ్ సిబ్బంది



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద ఆటోలో వదిలి వెళ్లిన శిశువును ఆర్పీఎఫ్ సిబ్బంది రక్షించారు. గేట్ నంబర్ 5 వద్ద ఓ ఆటోలో శిశువు ఏడుస్తున్నట్లు గుర్తించిన అక్కడి డ్రైవర్.. పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో ఆర్పీఎఫ్ ఎస్సై వి.కీర్తిరెడ్డి తన బృందంతో అక్కడికి వెళ్లి శిశువును రక్షించారు. అనంతరం సమీపంలోని సీసీ టీవీ ఫుటేజ్‌లను గమనించగా.. సోమవారం రాత్రి 9.56కి ప్లాట్‌ఫామ్ 3పై ఓ మహిళ శిశువుతో కనిపించినట్లు మిగతా .. 2లో..

## సోషల్ మీడియాలో వైరల్‌గా

# గూగుల్ ఉద్యోగి పోస్ట్.. నెటిజన్ల ప్రశంసలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** టైర్-3 కళాశాల (మారుమూల ప్రాంతంలోని కాలేజీ)లో ఎన్నో సమస్యల మధ్య చదువుకున్న తాను పట్టుదలతో ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్‌లో ఉద్యోగం సంపాదించినట్లు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చేసిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన వృత్తిపరమైన ప్రయాణాన్ని వివరిస్తూ.. మధ్యప్రదేశ్ భోపాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆర్చీ గుప్తా ఇన్‌స్టాలో పలు ఫొటోలు షేర్ చేసింది. అందులో ఆమె మారుమూల ప్రాంతంలోని సాధారణ కాలేజీలో చదివిన తనకు.. వృత్తి జీవితంలో ఎదురైన సవాళ్లు, తిరస్కరణలను వివరించింది. మనం పుట్టిన స్థానం, పెరిగిన వాతావరణం వంటివి మన అభివృద్ధిని ఆపలేవని పేర్కొంది. కఠిన పరిస్థితుల్లోనూ పట్టుదలతో ప్రయత్నిస్తే మిగతా .. 2లో..

# తెలంగాణలో మోగిన పురపోరు నగారా..

### ఫిబ్రవరి 11న పోలింగ్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహిం చారు. అనంతరం ఎస్ఈసీ రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# 48 ఏళ్ల యువగళం లీడ్ చేస్తోంది

చేసుకోవాలి. పార్టీ కార్యక్రమాలు ఎవరు బాగా నిర్వహిస్తున్నారో నివేదికలు తెప్పిస్తాం. పొలిటికల్ గవర్నెన్స్ లో పార్లమెంట్ కమిటీ కీలకం. పార్లమెంట్ పరిధిలో చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పార్లమెంట్ అధ్యక్షులతో ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి సమన్వయం చేసుకోవాలి. పార్టీలో ఎవరికి ఏ పదవిచ్చినా కార్యకర్తల అభిప్రాయం తీసుకుంటున్నాం. మీరు సమర్థవంతమైన నాయకులుగా తయారవ్వడానికి ఇదొక వేదిక. పార్లమెంట్ అధ్యక్షులకు పార్టీలో మంచి ప్రాధాన్యత ఉంటుంది. మంత్రులు కూడా పార్లమెంట్ పార్టీ అధ్యక్షులతో సమన్వయం కావాలి. జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహించుకోవాలి. 2024లో ఎన్నికల్లో కూటమికి ఎన్ని ఓట్లు వచ్చాయో అంతకు పదిఓట్లు అదనంగా రావాలి. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో 2024 ఎన్నికలకంటే కూటమి మరింత బలోపేతమైంది. ఎన్నికలప్పుడే ప్రజల వద్దకు వెళ్లడం కాదు... ప్రభుత్వం చేసే కార్యక్రమాలను వివరిచేందుకు వారితో మమేకం కావాలి. పార్టీ కంటే ఏదీ ముఖ్యంకాదు..ఎవరు నిర్లక్ష్యం వహించినా పక్కనబెడితా. పార్టీ సిద్ధాంతానికి అందరూ కట్టుబడి పని చేయాలి. వచ్చిన అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకునే బాధ్యత నాయకత్వం, శ్రేణులపై ఉంది. పార్టీలో కార్యకర్తే...అధినేత. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగినప్పుడే నాయకులుగా మీరు, పార్టీ శాశ్వతంగా ఉంటుంది. టీడీపీ ఒక కుటుంబం. గత ప్రభుత్వంలో కార్యకర్తలు కష్టాలు పడ్డారు..ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పసుపు జెండా కోసం రక్తం చిందించారు. అనేక త్యాగాలు చేశారు. ఏ పని జరిగినా కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి...కార్యకర్తల ద్వారానే జరగాలి. సూపర్ 6ను సూపర్ హిట్ చేశాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి మాట నిలబెట్టుకున్నాం. నాయకులెవరూ కేడర్‌ను విస్మరించవద్దు. ఎమ్మెల్యేలు, ఎంపీలు కార్యకర్తలతో అనుసంధానం కావాలి. ఎవరికి కేటాయించిన స్థానాల్లో వారే పని చేయాలి. కావాలని ఎక్కడైనా వివాదాలు సృష్టిస్తే పక్కనబెడతాం. ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ విధానాలకు అనుగుణంగా పని చేయాలి. ఆర్థికేతర సమస్యల్లో రెవెన్యూ పెద్ద సమస్య. ఎన్నికల ముందు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే రద్దు చేశాం. లోపభూయిష్టమైన చట్టాన్ని గత ప్రభుత్వంలో తెచ్చారు. ఎవరికైనా అన్యాయం జరిగితే ఎక్కడా చెప్పకుండా హైకోర్టుకు మాత్రమే వెళ్లాలని చెప్పారు..ఇది సామాన్యులకు సాధ్యమేనా.? అని ప్రశ్నించారు. ప్రభుత్వంలోని వ్యక్తులకు కాకుండా ఎనీ పర్సన్?కు అధికారాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. అంటే ప్రజల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. పట్టాదారు పాసుపుస్తకాలపై వారి ఫోటోలు ముద్రించుకున్నారు. పొలం సరిహద్దు రాళ్లపై వాళ్లు ఫోటోలు, పేర్లు ముద్రించుకున్నారు. ఎప్పుడైనా ఇలా జరిగిందా.? వాళ్లు అడిగిన భూములు ఇవ్వకపోతే 22 ఏలో పెట్టారు. కక్ష తీర్చుకోవడానికి అన్ని ఆయుధాలు ఉపయోగించారు.అందుకే మళ్లీ సర్వేలు చేసి సమస్యలు లేకుండా ఏడాదిలో పట్టాదారు పుస్తకాలు ఇస్తాం. మనం చేసింది చెప్పుకోవాలిమాట్లాడితే క్రెడిట్ చోరీ అంటూ అసత్యాలు వల్లిస్తున్నారు. భోగాపురం విమానాశ్రయానికి 2,500 ఎకరాలు కేటాయిస్తే అందులో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారు.మనం వచ్చాక మళ్లీ విమానాశ్రయం పనులు పరుగున పెట్టిస్తూ జూన్ కు పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నాం. పవిత్రమైన తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారు. పాలు లేకుండానే నెయ్యి తెచ్చారు. దాన్ని కూడా సమర్థించుకుంటున్నారంటే ఏం చేయాలి...? అమరావతి రాజధానిగా అభ్యంతరం లేదని హైదరాబాద్?లో అసెంబ్లీలో చెప్పారు. తర్వాత అడుగడుగునా అడ్డం పడ్డారు. 2019లో అధికారంలోకి వచ్చాక 3 రాజధానులు అన్నారు..3 ముక్కలాటాడారు. ఇప్పుడు మళ్లీ మనం రాజధానికి జీవం పోశాం. అమరావతే మనకు రాజధాని. అన్ని ప్రాంతాల అభివృద్ధి ధ్యేయం. కర్నూలులో హైకోర్టు బెంచ్ కూడా ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు మళ్లీ ఎక్కడ ముఖ్యమంత్రి ఉంటే అదే రాజధాని అంట. రాజకీయాల్లో ఉండేవారికి స్టెబిలిటీ, స్థిరత్వం ఉండాలి. వెలిగొండ ప్రాజెక్టుకు నాడు నేనే శంకుస్థాపన చేశాను. కానీ తర్వాత వచ్చిన పాలకులు నిర్లక్ష్యం చేశారు. ఈ ప్రాజెక్టును కూడా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తా. కుప్పంలో హంద్రీనీవా నీరు తెస్తున్నామని డ్రామా ఆడారు. మరుసటి రోజు గేటు ఎత్తుకుపోయారు. వెలిగొండను కూడా పూర్తి చేయకుండా జాతికి అంకితం చేశారు. మనం చేసే పనులు ఎంత ముఖ్యమో తప్పుడు ప్రచారాన్ని ఎక్కడిక్కడ తిప్పి కొట్టడం అంతే ముఖ్యం. సోషల్ మీడియా, మీడియాలోనే కాదు...మౌత్ టు మౌత్ కూడా చెప్పాలి. అప్పుడే అందరిలో క్లారిటీ వస్తుంది. టీడీపీకి సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర ఉంది. ఏ ఊర్లో ఏం చూసినా మన అభివృద్ధే కనబడుతంది. మనం చేసిన సంక్షేమాన్ని చెప్తారు. ప్రతి కుటుంబానికి న్యాయం చేస్తున్నాం. తల్లికి వందనం ఎంతమంది పిల్లలున్నా అందిస్తున్నాం. స్త్రీ శక్తి ద్వారా ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తున్నాం. దీపం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులను ఆదుకుంటుంటున్నాం. సీమను హార్టికల్చర్ హబ్ గా మార్చుతున్నాం. మోదీ కూడా అనంతపురం ఆదర్శవంతమైన జిల్లా అని చెప్పారు. డబ్బులతోనే రాజకీయం చేయలేం... నమ్మకం ఉండాలి. డబ్బుతోనే అన్నీ నడుస్తాయనుకుంటే డబ్బులున్న వాళ్లే రాజకీయం చేస్తారు.. మన లాంటి వాళ్లు చేయలేరు. ఏ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం జరిగినా కార్యకర్తలు ఓనర్షిప్ తీసుకోవాలి. డీఎస్సీ నిర్వహణలో ఎన్ని ఇబ్బందులు పెట్టినా అనుకున్న సమయానికే ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చాం. 6 వేల పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేశాం. స్టైఫండ్ కూడా రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచాం. విద్యుత్ భారం తగ్గించాం... మరింతగా తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం. కూటమి వచ్చే నాటికి రాష్ట్రంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. పాత్ హోల్ ఫ్రీ రోడ్లు చేస్తున్నాం. పదవులు తీసుకున్న వారి పనితీరు 3 నెలలకు ఒకసారి చూస్తా... సరిగా చేయకపోతే పక్కనబెట్టి మరొకరికి అవకాశం కల్పిస్తాం. పార్టీలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నేతలు, కార్యకర్తల్లో కూడా మార్పులు రావాలి. రాబోయే రోజుల్లో అన్ని ఎన్నికల్లో గెలిచేలా సంకల్పం తీసుకోవాలని టీడీపీ శ్రేణులకు సీఎం తెలిపారు.

### 'వీబీ జీ రామ్ జీ'పై
## రివర్స్ గేర్ వేయలేం

మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ భేటీకి అధ్యక్షత వహించారు. ఆయా అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సమావేశం అనంతరం కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. అయితే, బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో.. సంబంధిత అంశాలపై చర్చలు జరపడమనేది నియమమని చెప్పారు. మోదీ ప్రభుత్వం ఎప్పుడూ నియమాలు, నిబంధనలను ఉల్లంఘించలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం నడచుకుంటామని చెప్పారు. ఎంపీలంతా ప్రజాసమస్యలను లేవనెత్తేందుకే ఎన్నికయ్యారని, వారికి భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని, కానీ.. ఇతర సభ్యులు చెప్పేది వినడం కూడా బాధ్యతేనని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సమావేశాల అజెండా పంచుకుంటామని చెప్పారు.

### బీసీల రక్షణ చట్టం అమలుతోనే
## బీసీలకు భద్రత, న్యాయం

రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ.. బీసీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీసీ కార్పొరేషన్ చైర్మన్లతో భేటీలో మంత్రి స్పష్టం చేశారు. బీసీల రక్షణ చట్టం అమలుపై చర్చించడంతోపాటు, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం బీసీలకు అండగా నిలవడం, గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఆదరణ 1,2 పథకాల తరహాలోనే, ఇప్పుడు 'ఆదరణ-3'ను ఏ విధంగా సమర్థవంతంగా అమలు చేయాలనే అంశంపై 39 మంది కార్పొరేషన్ చైర్మన్లతో చర్చించామన్నారు. బీసీలకు 34% రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్ల కల్పనపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా బీసీ భవన్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద బీసీలకు 20,000 రూపాయల అదనపు సబ్సిడీ అందించడ జరుగుతుందన్నారు. ప్రతి బీసీ బిడ్డను ఎంట్రప్రెన్యూర్‌గా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రతి జిల్లాలో కోచింగ్ సెంటర్ల ఏర్పాటు, ఇప్పటికే 300 మంది విద్యార్థులు దీని ద్వారా ఎంపిక కావడం విశేషమన్నారు. 'లా ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమీ' ద్వారా బీసీ విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో అత్యుత్తమ శిక్షణ సివిల్స్ లో అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అంటేనే బీసీల ప్రభుత్వం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ నాయకత్వంలో బీసీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి సవిత పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లిఖార్జున్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అనంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్‌కు
## ఆయన గూఢచారి

పోలీసులంటే గంజాయి సరఫరాదారులు, స్మగ్లర్లకు భయం లేదని కవిత అన్నారు. ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉంటేనే భయం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందన్నారు. "సీఎం రేవంత్‌రెడ్డికి సంతోష్‌రావు గూఢచారి. నేను ముందునుంచి చెబుతున్న దెయ్యం ఆయనే. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంతోష్‌కు ఎలాంటి శిక్ష విధిస్తుందనేది వేచి చూడాలి. ఆయనకు శిక్ష పడుతుందన్న నమ్మకం నాకు లేదు" అని కవిత వ్యాఖ్యానించారు.

### ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై
## అమెరికాలో అసంతృప్తి

వెల్లడైంది. వలసలపై ఆయన తీసుకుంటున్న కఠినచర్యలు చాలాదూరం వెళ్లాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వలసదారుల్ని అడ్డుకోవడానికి అమెరికాలోని పలు ప్రాంతాల్లో ట్రంప్ యంత్రాంగం ఇమిగ్రేషన్ ఏజెంట్లను మోహరించింది. దీనికి నిరసనగా జరిగిన ఘర్షణల్లో ఆ ఏజెంట్ల చేతిలో శనివారం మినియాపొలిస్‌లో మరో అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు ముందు, తర్వాత అంటే శుక్రవారం నుంచి ఆదివారం మధ్య ఈ పోల్ చేపట్టగా.. ట్రంప్ నిర్ణయాలను ఆమోదించేవారి సంఖ్య తగ్గిపోయింది. తాజాగా 39 శాతం మంది ఆమోదించగా.. అంతకుముందు ఆ రేటు 41 శాతంగా ఉంది. 53 శాతం మంది ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేశారు. ఈ విషయంలో తొలుత ఆయనకు ప్రజల నుంచి భారీ ఆమోదం లభించింది. గత ఫిబ్రవరిలో 50 శాతం మంది ఆయన విధానాలకు అనుకూలంగా స్పందించడం గమనార్హం.

### దేశ రాజకీయాల్లో
## 'యువగళం' పాదయాత్ర పెను సంచలనం : ఎంపీ వేమిరెడ్డి

నిర్వహించారు. దీంతో నగరంలోని ప్రధాన మార్గాలు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అత్యాధునిక విద్య అందించేందుకు మంత్రిగా లోకేశ్? అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. బీద రవిచంద్ర మాట్లాడుతూ.. లోకేశ్ పాదయాత్ర ఏపీ రాజకీయాలకు గేమ్ ఛేంజర్ అని చెప్పారు. 97 నియోజకవర్గాల్లో 'యువగళం' కొనసాగిందని.. అందులో 90 చోట్ల కూటమి ఎమ్మెల్యేలు గెలుపొందారని తెదేపా నేత కోటంరెడ్డి గిరిధర్?రెడ్డి అన్నారు.

### హృద్రోగి ప్రాణాలు కాపాడిన
## భారత కోస్ట్‌గార్డ్

వెల్లడించారు. ప్రస్తుతం అతడు చికిత్స పొందుతున్నాడు. లక్షద్వీప్‌లో మెడికల్ ఎమర్జెన్సీ సంభవించినప్పుడు వెంటనే స్పందించేందుకు వీలుగా భారత తీర రక్షకదళం మెడికల్ ఎవాక్యుయేషన్ ఆపరేషన్‌లను చేపడుతుందని.. ఈ నెలలో ఇద్దరు వ్యక్తులను వైద్యం కోసం ఎయిర్ లిఫ్ట్ చేసిందని అధికారులు తెలిపారు.

### అమరావతికి చట్టబద్ధత కల్పించే
## బిల్లు తేవాలని కోరాం

మూడు జాతీయ అంశాలతో పాటు రాష్ట్రానికి చెందిన అంశాలపై చర్చించాలని కోరాం. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు, పదహారేళ్ల పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై చర్చించాలని విజ్ఞప్తి చేశాం. ప్రధాని, ముఖ్యమంత్రి సహా కీలక నేతలు 30 రోజులపాటు జైల్లో ఉంటే పదవిని కోల్పోయే బిల్లుపైనా చర్చించాలని కోరాం. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా నిర్ణయించారు. కానీ.. వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా చేసింది. ఏపీ రాజధానిగా అమరాతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఈ సమావేశాల్లోనే తీసుకురావాలని కోరాం. పూర్వోదయ పథకం కింద వీలైనన్ని ఎక్కువ నిధులు రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు ఇవ్వాలని.. నదుల అనుసంధానానికి సహకరించాలని విజ్ఞప్తి చేశాం. పొగాకు కొనుగోళ్ల సమస్యను పరిష్కరించాలని అఖిలపక్ష భేటీలో ప్రస్తావించాం" అని లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు.

### మేము సూపర్‌పవర్‌గా మారాలంటే
## భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే..

కెనడా సూపర్ పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను, ఎనర్జీ ట్రేడ్‌ను మరింత ముందుకుతీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నామన్నారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడానికి ఒట్టావా నుంచి భారత్‌కు ముడి చమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సిద్ధంగా ఉందని టిమ్ హడ్గ్‌సన్ పేర్కొన్నారు. కెనడా మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు కొనసాగుతోన్నట్లు తెలిపారు. హైడ్రోజన్, బయో ఇంధనాలు, బ్యాటరీ నిల్వ, కీలకమైన ఖనిజాలు, విద్యుత్ వ్యవస్థలు, ఇంధన పరిశ్రమలో కృత్రిమ మేధస్సు వాడకం వంటి విషయాలపై దృష్టిపెట్టామన్నారు. 2050 నాటికి ప్రపంచ ఇంధన డిమాండ్‌లో మన వాటా 30 నుంచి 35 శాతం పెరుగుతుందని.. భారత్ మూడో అతిపెద్ద ఇంధన మార్కెట్‌గా నిలుస్తుందన్నారు.

### ఆటోలో శిశువు..
## రక్షించిన ఆర్పీఎఫ్ సిబ్బంది

గుర్తించారు. అనంతరం ఆమె 8వ నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి బయటకు వెళ్లినట్లు నిర్ధారించారు. శిశువుతో ఉన్న బ్యాగులో తల్లి వివరాలు, బ్యాంక్ పాస్‌బుక్ లభ్యమైంది. వివరాలు నమోదు చేసిన తర్వాత శిశువును చైల్డ్‌లైన్ సిబ్బందికి అప్పగించారు.

### సోషల్ మీడియాలో వైరల్‌గా
## గూగుల్ ఉద్యోగి పోస్ట్.. నెటిజన్ల ప్రశంసలు

విజయాన్ని సాధించగలమని తెలిపింది. భోపాల్‌లోని ఓ మారుమూల ప్రాంతంలో ఉన్న టైర్-3 కళాశాలలో ఆర్చీ గుప్తా 2017లో డిగ్రీ పట్టా పొందింది. చిన్న కాలేజీ కావడంతో సాధారణ టెక్ కంపెనీలు ప్లేస్‌మెంట్లను నిర్వహించాయి. గూగుల్?లో ఉద్యోగం సంపాదించడం తన కల అయినప్పటికీ ఆమె మొదట ఓ చిన్న సంస్థలో ఉద్యోగంలో చేరింది. అక్కడ ప్రోగ్రామింగ్, కోడింగ్ వంటి వాటిలో నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. అనంతరం మరో టెక్ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసింది. 2019లో గూగుల్ ఇంటర్వ్యూలో రిజక్ట్ అయ్యింది. తిరస్కరణకు గురైనందుకు నిరుత్సాహపడకుండా తన నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంది. 2022లో గూగుల్‌లో ఉద్యోగం వచ్చింది. ఆ సంస్థలో ఉద్యోగానికి ఎంపిక అయినట్లు మెయిల్ చూడగానే అన్ని రోజులు పడిన ఇబ్బందులు మర్చిపోయానని ఆమె పేర్కొంది. వృత్తి జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను సమస్యలుగా చూడకుండా..వాటిని అధిగమించడానికి నిరంతరం పట్టుదలతో ప్రయత్నించాలని యువతకు సూచించింది. ప్రముఖ కాలేజీలు, ఐఐటీల్లో చదవకపోయినా కచ్చితమైన లక్ష్యంతో ముందుకు వెళ్తే... కచ్చితంగా విజయం సాధించగలమని తెలిపింది. ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆమెను అభినందిస్తున్నారు.

## తెలంగాణలో మోగిన పురపోరు నగారా..

చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.
మున్సిపల్ ఎన్నికల ముఖ్య తేదీలు...
జనవరి 28 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
జనవరి 30తో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ గడవు
జనవరి 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన
ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు
ఫిబ్రవరి 11న పోలింగ్
రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు
ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు
ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక
ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక
మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న 53 లక్షల మందికి పైగా ఓటర్లు

### పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం...
## పడగొట్టినవి నిలబెడదాం..

**- 10 జిల్లాల్లో 20కు పైగా ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి ప్రతిపాదనలు**
**- పూర్వోదయ నిధులతో సమగ్రాభివృద్ధి**
**- రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యానరంగ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్లోబల్ మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యాన ఉత్పత్తులు పండించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. దానికి అనుగుణంగా అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పతులను పండించడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం సూచించారు. 10 జిల్లాలను ఉద్యాన రంగానికి కేంద్ర బిందువుగా చేపట్టే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. పూర్వోదయ, సాస్కీ, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఇదే సమయంలో సీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని... చాలా వరకు ప్రాజెక్టులను పెండింగులో పెట్టేసిందని మంత్రులు నిమ్మల, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని... అలాగే తక్కువ నిధులను కేటాయిస్తే త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులను తొలుత చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరు-నగరి ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ దిశగా సుమారు 20కు పైగా ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అధికారులు వివరించారు. మొత్తంగా ఈ ప్రాజెక్టుల ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టు, అలాగే 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీళ్లు అందించవచ్చని అధికారులు సీఎంకు తెలిపారు. సీమ ప్రాజెక్టులతో పాటు... ఉత్తరాంధ్ర జిల్లాల్లో కూడా ప్రాజెక్టులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలవరం కుడి కాల్వ పనులు పూర్తి అయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్లవచ్చన్నారు. అప్పుడు పోలవరం-వంశధార నదుల అనుసంధానం ప్రాజెక్టు చేపట్టవచ్చని సూచించారు. ఈలోగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని ప్రాధాన్యతల వారీగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ప్రపంచంలో అతిపెద్ద ఉద్యాన క్లస్టర్‌గా రాయలసీమ**

ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు అపారంగా పెరిగే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. మొత్తం 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటలను అభివృద్ధి చేసేలా ప్రతిపాదించినట్టు మంత్రి అచ్చెన్నాయుడు సీఎంకు తెలిపారు. అలాగే ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని మూడేళ్లల్లో 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు విస్తరించేలా ప్రణాళికలు చేపట్టినట్టు వివరించారు. రాయలసీమ ప్రాంతం ఉద్యాన ఉత్పత్తుల విషయంలో దేశంలోనే అగ్ర స్థానంలో ఉందని... ప్రపంచంలోనే అతిపెద్ద క్లస్టర్ గా రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాలను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. దుబాయికి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి సమావేశంలో వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో రాయలసీమ ప్రాంతం ఉద్యాన రంగంలో అభివృద్ధి చెందడానికి ఆస్కారం మెండుగా కన్పిస్తోందని.. దీనికి అనుగుణంగా ఎకో సిస్టం డెవలప్ అభివృద్ధి చేయాలని సీఎం స్పష్టం చేశారు. దీంట్లో భాగంగా అంతర్జాతీయ విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు.

## ఎడిటర్ వాయిస్

# అమరావతికి రాజముద్రతో బిగ్ ఇష్యూ క్లోజ్

ఏపీని 2014లో రాజధాని లేని పరిస్థితిలో విభజించారు. ఒక విధంగా అదే అతి పెద్ద సెంటిమెంట్ గా మారింది. 2014 ఎన్నికలకు ముందు అదే కీలకమైన అంశంగా పనిచేసింది. బీజేపీతో టీడీపీకి పొత్తు కుదరడంతో పాటు సీనియర్ అప్పటికి రెండు సార్లు ఉమ్మడి ఏపీకి సీఎం గా పనిచేసిన చంద్రబాబు వల్లనే కొత్త రాజధాని సాధ్యపడుతుంది అని జనాలు భావించి టీడీపీ బీజేపీని గెలిపించారు. అలా వైసీపీ వెనక్కి నెట్టబడింది. పైగా టీడీపీ బీజేపీ జనసేన బంధం బలంగా ఉంది. ఆ మూడు పార్టీలు ఎన్నికల్లో చెప్పిన మాట బ్రహ్మాండమైన రాజధానిని నిర్మిస్తామని. దాంతో కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీ వల్ల అది సులువుగా జరుగుతుందని జనాలు భావించి విలక్షణమైన తీర్పు చెప్పారు. దాంతో మోడీ ప్రధానిగా బాబు సీఎం గా అయ్యారు. అలా 2014 ఎన్నికలో టీడీపీ విజయానికి రాజధాని ఇష్యూ కీలకంగా మారింది.

**అదే అంశంతో :**

ఇక 2019 ఎన్నికల్లో కూడా అదే అంశం మీదనే ఎన్నికలు జరిగాయని చెప్పాలి. అమరావతి రాజధాని పేరుతో అభివృద్ధి కేంద్రీకృతం అవుతోంది అన్న వైసీపీ విమర్శలు ప్రచారం ఒక వైపు ఉంటే అమరావతిలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని అక్కడి వారు టీడీపీ మీద వ్యతిరేకత పెంచుకున్న వైనం ఉంది. అలా అన్నీ కలసి వచ్చి వైసీపీ బంపర్ మెజారిటీతో ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈ ప్రజా తీర్పుని జగన్ అండ్ కో వేరే విధంగా అర్థం చేసుకున్నారు. అమరావతి రాజధాని వద్దు అని మూడు రాజధానులు అన్నట్లుగా వైసీపీ సరికొత్త నినాదాన్ని అందుకుంది. అయితే అయిదేళ్లలో ఏమీ చేయలేకపోయింది. చివరికి 2024 ఎన్నికలలో మూడు రాజధానులు బూమరాంగ్ అయి వైసీపీ కేవలం 11 సీట్లకే చతికిలపడిపోయింది.

**కూటమిని గెలిపించారు :** అదే సమయంలో అమరావతి ఏపీకి రాజధానిగా ఉండాలని ముక్తకంఠంతో మూకుమ్మడిగా మూడు ప్రాంతాల ప్రజలు ఓటేసి మరీ టీడీపీ కూటమిని గెలిపించారు. కనీ వినీ ఎరగని తీరులో టీడీపీ కూటమి భారీ విక్టరీ కొట్టడానికి అమరావతి రాజధాని సెంటిమెంట్ బ్రహ్మాస్త్రంగా పనిచేసింది అని చెప్పాల్సి ఉంది. అలా అమరావతి రాజధాని అన్నది గత మూడు ఎన్నికలలో ఏపీ ప్రజలను వారి తీర్పుని విశేషంగా ప్రభావితం చేతోంది. కానీ ఈసారి అలా జరిగే సీన్ అయితే లేదని అంటున్నారు.

**చట్టబద్ధత ఖాయం :** ఈ నెల 28 నుంచి మొదలయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలోనే అమరావతి రాజధానికి సంబంధించి చట్టబద్ధత కల్పించే విధంగా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదిస్తారు అని అంటున్నారు. దాంతో ఇక మీదట అమరావతి ఏపీకి శాశ్వత రాజధాని అవుతుంది. అభివృద్ధి ప్రక్రియ అన్నది అక్కడ నిరంతరాయంగా సాగుతూ ఉంటుంది. దాంతో 2029 ఎన్నికలలో అమరావతి రాజధాని సెంటిమెంట్ అన్నది ఎక్కడా బిగ్ ఇష్యూగా మారే సీన్ లేదని అంటున్నారు. వైసీపీ సైతం అమరావతి ఊసు కానీ మాట కానీ మాట్లాడే సాహసం చేయకపోవచ్చు అని అంటున్నారు. అదే విధంగా టీడీపీ కూడా జగన్ వస్తే అమరావతిని మార్చేస్తారు అన్న విమర్శలు చేసేందుకు కూడా ఆస్కారం ఏ విధంగానూ ఉండదు. దాంతో గత పదిహేనేళ్ళుగా ఎన్నికలను ప్రభావితం చేస్తూ వచ్చిన అమరావతి రాజధాని ఇష్యూ క్లోజ్ అయినట్లే అని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




# వరంగల్‌లో విషాదం..

### రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న వైద్యురాలి మృతి



**మట్టెవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** వరంగల్‌లో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న వైద్యురాలు మృతిచెందారు. మట్టెవాడ ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చించోలి మండలం బత్తంపల్లికి చెందిన ఎస్.మమతారాణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. నగరంలోని హంటర్‌రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది నారా యణపేట జిల్లాకు చెందిన డాక్టర్ రాఘవేంద్రతో ఆమెకు వివాహం జరిగింది. సోమవారం రాత్రి విధులు ముగించుకొని భర్తతో కలిసి హంటర్ రోడ్డు మీదుగా బైక్‌పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో ఏడు మోరీల కూడలి వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన టిప్పర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు కింద పడిపోయారు. 9 నెలల గర్భిణిగా ఉన్న మమతా రాణి తీవ్రంగా గాయపడటంతో స్థానికుల సహాయంతో భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. టిప్పర్ డ్రైవర్ అన్సారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బావిలో ఏడేళ్ల బాలుడి మృతదేహం.. అనుమానాస్పద మృతిగా కేసు

**బాపట్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** బాపట్లలోని ధరివాడ కొత్తపాలెంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిట్టు సాయి (7) మృతదేహం బావిలో లభ్యమైంది. సోమవారం సాయంత్రం పిల్లలతో కలిసి ఆడుకున్న చిన్నారి.. తర్వాత కనిపించకుండా పోయాడు. కుటుంబసభ్యులు సాయి కోసం చుట్టుపక్కల ప్రాంతంలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో సాయి తండ్రి శంకర్‌రెడ్డి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం ఉదయం గ్రామంలో ఉపయోగంలో లేని బావిలో చిన్నారి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సాయి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పారిశ్రామిక వేత్త కుమారుడి కిడ్నాప్..

### రెండు వారాలకు దొరికిన ఆచూకీ

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఝార్ఖండ్‌లో రెండువారాల క్రితం అపహరణకు గురైన పారిశ్రామిక వేత్త కుమారుడిని సురక్షితంగా రక్షించారు. టాటానగర్‌లోని అదిత్యపుర్ చిన్న పరిశ్రమల సంఘం ఉపాధ్యక్షుడు దేవాంగ్ గాంధీ కుమారుడు కైరవ్ (24). అతడిని అపహరించాలని కిడ్నాపర్లు కుట్ర పన్నారు. జవనరి 13న కారులో వెళ్తున్న అతడిని దుండగులు వెంబడించి కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత కైరవ్‌ను కిడ్నాప్ చేశామని విదేశీ ఫోన్ నంబరుతో అతడి తండ్రికి వాట్సాప్‌లో సందేశాలు పంపారు. రూ.5 కోట్లు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేశారు. దేవాంగ్ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. కైరవ్ కోసం 7 బృందాలుగా ఝార్ఖండ్, బిహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. దీంతో భయపడిన కిడ్నాపర్లు కైరవ్‌ను హజరీబాగ్‌లో వదిలేసి పారిపోయారు. అతడి ఆచూకీని గుర్తించిన పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపులు చేపట్టారు.

## చైనా మాంజాకు ఐదేళ్ల చిన్నారి బలి



**మూసాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** చైనా మాంజాకు ఐదేళ్ల చిన్నారి బలైంది. తల్లిదండ్రుల ద్విచక్ర వాహనంపై ముందు కూర్చున్న బాలిక మెడకు దారం చుట్టుకోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. హైదరాబాద్ కూకట్‌పల్లి జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను కలిచివేసింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేటకు చెందిన డి.రాంసాగర్, పద్మావతిలు కొన్నాళ్ల క్రితం నగరానికి వచ్చారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. చిన్న కుమార్తె నిశ్వికాదిత్య (5) ఎల్‌కేజీ చదువుతోంది. కాగా ఈ కుటుంబం ఈమధ్యే ఇల్లు కొనుగోలు చేసింది. దాని ఇంటీరియర్ పనుల నిమిత్తం భార్యాభర్తలు కుమార్తెను వెంటబెట్టుకొని బయటికొచ్చారు. సోమవారం మధ్యాహ్నం తిరిగి వచ్చే క్రమంలో కూకట్‌పల్లిలోని ఓ జ్యువెల్లరీ షాపునకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆ సమయంలో నిశ్వికాదిత్య బైక్ ముందు కూర్చుంది. సుమిత్రానగర్‌లోని మెట్రో పిల్లరు నం.781 వద్దకు రాగానే అకస్మాత్తుగా కేకలు వినిపించాయి. దీంతో తండ్రి బైక్‌ను ఆపి చూడగా చిన్నారి మెడకు చైనా మాంజా చుట్టుకుని రక్తం కారుతోంది. హుటాహుటిన పక్కనున్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. బాలిక చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. చిన్నారిని ఆసుపత్రికి తీసుకొచ్చేసరికి తీవ్రంగా రక్తస్రావమైందని, మెడ రెండున్నర అంగుళాల మేర తెగిందని వైద్యులు తెలిపారు. ఘటనకు ఎవరు బాధ్యులు అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కూకట్‌పల్లి సీఐ కె.వెంకట సుబ్బారావు తెలిపారు.

## కూలిన విద్యుత్ స్తంభం..

### త్రుటిలో తప్పించుకున్న విద్యార్థి

**విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలులో ఓ విద్యార్థి త్రుటిలో పెనుప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అశోక్‌నగర్‌లో మంగళవారం ఉదయం రోడ్డుపై విద్యార్థి నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా విద్యుత్ స్తంభం కూలిపోయింది. స్తంభం కూలడాన్ని గమనించిన స్థానికులు గట్టిగా అరిచారు. అప్రమత్తమైన విద్యార్థి వెంటనే అక్కడ నుంచి పరుగు తీశాడు. దీంతో అతడికి ప్రాణాపాయం తప్పింది. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీకెమెరాల్లో నమోదయ్యాయి. అశోక్‌నగర్‌లో మురుగు కాలువల మరమ్మతుల కోసం గోతులు తీయగా స్తంభం బలహీనపడినట్లు స్థానికులు తెలిపారు.

## గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ సమీపంలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ సమీపంలో అగ్నిప్రమాదం జరిగింది. ఐఎస్‌బీ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేస్తున్నారు.

### ఇంటి ముందు ఆడుకుంటున్న

## చిన్నారిపై వీధి కుక్క దాడి.. తీవ్రగాయాలు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖైరతాబాద్‌లోని శ్రీనివాస్‌నగర్‌లో దారుణ ఘటన జరిగింది. మంగళవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై వీధికుక్క దాడి చేసింది. ఈ ఘటనలో మల్లికార్జున్, రేవతిల కుమార్తె పాక శార్వి (4) ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చిన్నారిని రెయిన్‌బో ఆసుపత్రికి తరలించారు. చిన్నారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని, శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీకెమెరాల్లో నమోదయ్యాయి.

### రూ.కోటి విలువైన

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత



పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు పరిశీలిస్తున్న ఎస్పీ డా.వినీత్, డీఏవో జాన్ సుధాకర్ తదితరులు

**నారాయణపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నారాయణపేట జిల్లాలో రైతులను మోసం చేస్తూ నకిలీ హెచ్‌టీ పత్తి విత్తనాలు అక్రమంగా విక్రయిస్తున్న వారిపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.కోటి విలువైన విత్తనాలను పట్టుకున్నారు. సోమవారం జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. నారాయణపేట మండలం బండగొండ, కొత్తపల్లి మండలం భూనీడ్ గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలు అక్రమంగా నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. జిల్లా పోలీసులు, టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఆదివారం సాయంత్రం ఆయా గ్రామాల్లో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. భూనీడ్‌కు చెందిన తండ్రీకొడుకులు బాలకృష్ణనాయుడు, శశివర్ధన్ నాయుడు ఇళ్ల నుంచి రూ.కోటి విలువైన 10 టన్నుల (100 క్వింటాళ్లు) నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలను సరఫరా చేసినా, అమ్మినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కేసును ఛేదించిన డీఎస్పీ లింగయ్య, సీఐలు శివశంకర్, సైదులు, ఎస్సైలు రాముడు, విజయ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ బృందం, వ్యవసాయశాఖ అధికారులను అభినందించారు.

### పాడి రైతులకు హెచ్చరిక..

# పశువుల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స తప్పనిసరి.!


వనపర్తి వెటర్నరీ డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి పాడి పరిశ్రమలో సమస్యలు, గర్భకోశ వ్యాధులు, ఆడదూడల ఉత్పత్తి పథకం, సరైన ఆహారం, ఖనిజలవణాల ప్రాముఖ్యతను వివరించారు. పాడి పరిశ్రమలో లాభాలు తగ్గిపోతున్నాయంటూ చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్న వేళ, అసలు సమస్యను గుర్తించకుండా ముందుకు వెళ్లడం మరింత నష్టానికి దారి తీస్తోందని వనపర్తి ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. పశువుల్లో సంభవించే గర్భకోశ సంబంధిత వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సంతానోత్పత్తికి ఉపయోగపడని పాడి పశువులను నిర్లక్ష్యం చేయకుండా, పశువైద్యుల సలహాలతో సరైన చికిత్స చేయిస్తే మళ్లీ అవి సంతానానికి ఉపయోగపడే అవకాశముందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆడదూడల ఉత్పత్తి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇది భవిష్యత్?లో పాడి పరిశ్రమకు ఎంతో మేలు చేస్తుందన్నారు. అపరిశుభ్రమైన పరిసరాల్లో పశువులు ఈనినప్పుడు, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, మాయ సకాలంలో పడకపోవడం వల్ల గర్భాశయ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి వివరించారు. ఈ వ్యాధుల కారణంగా చూలు నిలవకపోవడం, పశువులు ఆలస్యంగా ఎదకు రావడం, ఈనిన తర్వాత కూడా సకాలంలో కట్టకపోవడం వంటి సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. కొన్ని పశువుల్లో ఎద లక్షణాలు స్పష్టంగా కనిపించకపోవడం




మరో పెద్ద సమస్యగా మారిందన్నారు. ముఖ్యంగా ఎక్కువ పాలు ఇచ్చే గేదెల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సరైన ఆహారం అందకపోవడం వల్ల అండాశయ వృద్ధి సరిగా జరగక, పశువులు సకాలంలో ఎదకు రాకపోతాయని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులు, విటమిన్-ఎ లోపం, ఖనిజలవణాల కొరత కూడా దీనికి కారణమవుతాయన్నారు. పశువులు సకాలంలో ఎదకు రావాలంటే పది నెలల వయస్సు నుంచే రోజుకు 50 గ్రాముల ఖనిజలవణాల మిశ్రమాన్ని ఇవ్వాలని సూచించారు. సంపూర్ణ సమీకృత ఆహారం అందించడం ద్వారా ఈ సమస్యలను చాలా వరకు నివారించవచ్చన్నారు. కొన్నిపశువులు ఎదకు వచ్చినా పలుమార్లు గర్భధారణ చేసినప్పటికీ చూలు కట్టకపోవడాన్ని 'రిపీట్ బ్రీడింగ్'గా పేర్కొన్నారు. గర్భాశయంలో సూక్ష్మజీవులు ప్రవేశించడం, వీర్యం నాణ్యత లోపించడం, సకాలంలో గర్భాధారణ చేయించకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. రెండు సంవత్సరాలు దాటిన సంకరజాతి పెయ్యలు, మూడు సంవత్సరాలు దాటిన దేశవాళీ పడ్డలు చూలు కట్టకుండా ఉంటే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎద లక్షణాలను గమనించి సకాలంలో గర్భధారణ చేయించటం చాలా ముఖ్యమన్నారు. పుష్టికరమైన పచ్చిమేత, సరిపడా దాణా, పరిశుభ్రమైన వాతావరణం, వేసవిలో చల్లదనం కల్పిస్తే పశువులు త్వరగా ఎదకు వచ్చి మంచి ఫలితాలు ఇస్తాయని వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...


కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 28 జనవరి 2026




www.viswamvoice.com

### కంబాల చెరువు, దండి మార్చ్ విగ్రహాల వద్ద

# మాజీ ఎంపీ భరత్ బైఠాయింపు

- స్వాతంత్ర సమరయోధుల చేతిలో మద్యం బాటిల్, - ఇదీ రాజమండ్రి సిటీ నడిబొడ్డున తాగుబోతుల తతంగం
- చోద్యం చూస్తున్న పోలీస్ యంత్రాంగం..
- గణతంత్ర దినోత్సవ మరుసటి రోజున జరిగిన దారుణం చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వ నిర్వాకం.
- ఇరవైనాలుగు గంటల మద్యం అమ్మకం కు నిలువెత్తు నిదర్శనం..




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి సిటీ,స్థానిక కంబాల చెరువు, దండి మార్చ్ స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల వద్ద వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ పార్టీ శ్రేణులతో బైఠాయించారు. గణతంత్ర దినోత్సవం నాడు మహనీయుడు డాక్టర్ అంబేద్కర్ని విస్మరించిన ప్రభుత్వం, మరుసటి రోజు ఇవాళ కంబాల చెరువు, దండి మార్చ్ స్వాతంత్ర సమరయోధుల చేతిలో మద్యం బాటిల్ పెట్టిన ఘటన, ఇదీ కూటమి ప్రభుత్వం మరియు యంత్రాంగం నిర్వాకం.. తూర్పు గోదావరి జిల్లా హెడ్ క్వార్టర్స్ రాజమండ్రి నగరంలో మద్యం ఏరులై పారుతుంది తాగిన మత్తులో ఏమి చేస్తున్నామో కూడా తెలియని మైకంలో మహనీయుల చేతిలో మద్యం సీసాను పెట్టి మన దేశ కీర్తిని అగౌరవ పరుస్తుంటే చోద్యం చూస్తున్న యంత్రాంగం... ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ విషయం తెలిసి ఇక్కడకు వచ్చి గంటన్నర కావస్తున్నా పోలీస్ యంత్రాంగం చోద్యం చూస్తున్నారు తప్ప కనీసం ఆ మహనీయులు చేతిలో ఉన్న మద్యం సీసాను తొలగించని పరిస్థితి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఆరుగురు ప్రజాప్రతినిధులు ఇక్కడ ఉన్నా ఈ తరహా అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు అంటే ఎంత సిగ్గు చేటు, అక్కడ సి సి ఫుటేజ్ ద్వారా నిందితున్ని పట్టుకోవాలని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది అని లేని పక్షంలో నిరసన ఉధృతం చేస్తామని భరత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రేణులు పాల్గొన్నారు.

### నేడే రాజమహేంద్రవరంలో

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ పర్యటన

**ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆర్ అండ్ బిలో ఫిర్యాదుల స్వీకరణ మధ్యాహ్నం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం: ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహర్ జనవరి 28న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యటించనున్నట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన ప్రజల నుంచి స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో అర్జీల స్వీకరణ, అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. చట్టంలోని సెక్షన్-12 ప్రకారం గత ఐదు సంవత్సరాలుగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి అమలవుతున్న చట్టపరమైన నిబంధనలు, సంక్షేమ పథకాల అమలు స్థితిగతులపై కమిషన్ సమీక్ష చేయనుంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్ నివారణ) చట్టం-1989, పౌర హక్కుల పరిరక్షణ చట్టం-1955 అమలు, ఎస్సీలకు సంబంధించిన భూ సమస్యలు, రిజర్వేషన్ అమలు, పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదుల పరిష్కారం, కమిషన్‌కు ఏటీఆర్‌ల సమర్పణ, జిల్లా, డివిజనల్ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనవరి 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు రాజమహేంద్రవరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయం, బొమ్మూరు లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ఓఆర్, పీజీఆర్ఎస్, బ్యాక్‌లాగ్ ఖాళీలు, వివిధ శాఖల్లో అమలవుతున్న ఎస్సీ సంక్షేమ పథకాల పురోగతి వంటి అంశాలపై చర్చ జరగనుందని మేఘా స్వరూప్ తెలిపారు. ఈ సమావేశానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టి, సంబంధిత రికార్డులు, గణాంకాలతో జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆదేశించారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శించుకున్న గోరంట్ల రవికిరణ్



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రూరల్ బొమ్మూరు వేంకటగిరి కొండపైన కొలువైవున్న శ్రీ శ్రీ శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 26వ కళ్యాణ మహోత్సవ వార్షికోత్సవ వేడుకలో టీడీపీ యువ నాయకులు ఆరోగ్య విభగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్ కిరణ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణం లో పాల్గొనడం జరిగింది అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పురోహితులు రవిరామ్ కిరణ్, గన్ని కృష్ణ లను శాలువతో సత్కరించి తీర్ధ ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ వెంకట గిరి కొండపై కొలువైవున్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారిని నేడు దర్శించుకోవడం జరిగింది. అని గత 26 సంవత్సరాలుగా కామిని ప్రసాద్ గారు కుటుంబం చేతులు మీదుగా పూజలు అందుకుంటు ప్రతీ ఏటా కళ్యాణం జరిపించుకుంటున్న స్వామి వారి దివ్య ఆసిస్సులు ఎప్పటికి వారి కుటుంబం పై మరియు ప్రజలందరిపై స్వామి వారి కరుణ కటాక్షాలు ఉండలని ప్రతి కుటుంబంలోనూ కష్టాలు తీరి సంతోషాలతో, ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని కోరుకుంటాన్నని రవిరామ్ కిరణ్ తెలియజేసారు. ఈ వేడుకలో లిరూరల్ మండల అధ్యక్షులు మత్సెటి శివ ప్రసాద్, గ్రామ అధ్యక్షులు బీమారశెట్టి రమేష్, కామిని భాస్కరరావు,కామిని ప్రసాద్,పలివెల సత్యనారాయణ, పేట లక్ష్మి, పిసిని రమణ, సాంబారి సతీష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# కన్నులపండువగా శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ శ్రీ వరాహాలక్ష్మి నృసింహస్వామి క్షేత్రంలో శ్రీ మదుభయ వేదాన్తా చార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి మంగళాశాసనాలతో చందన యాత్ర మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం నిశా చూర్ణోత్సవం (పసుపు కొట్టుట), నవకలశ స్నపనం జరిగాయి. అర్చకులు అవసరాల శ్రీకిరణ్ స్వామి ఆధ్వర్యంలో సాయంత్రం ఎదురు సన్నాహం సన్నాహం అనంతరం శ్రీ వరాహాలక్ష్మి నృసింహస్వామి ట్రస్ట్, ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం దంపతులు, కాలెపు నాగేశ్వరరావు దంపతులు తదితరులు తిరుకల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. కలశారాధన జరిపించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండల సమాఖ్య నందు ఎన్.ఆర్.ఎల్.ఎంలో భాగంగా వ్యాపార అభివృద్ధి ప్రణాళికలపై మండల సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యనిర్వాహక సభ్యులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణలో గ్రామ సంఘాలు మండల సమాఖ్యలు వ్యాపారాలు ఏ విధంగా చేయాలి ఎలా అభివృద్ధి చేయాలి నిధులు మూలం ఎక్కడ నుండి సమకూర్చాలి అనేది శిక్షణలో తెలియజేశారు.ఏపిఎం సూరమ్మ మాట్లాడుతూ అందరూ పారదర్శకంగా పనిచేసి గ్రామాల్లో శిక్షణ ఇవ్వాలని శిక్షణ ప్రధాన ఉద్దేశం వ్యాపార అభివృద్ధి యొక్క పటిష్టత అభివృద్ధి ఎలా చేయాలి అనేది తెలియజేశారు .మండల శిక్షణ శిక్షకులు హరిబాబు మాట్లాడుతూ సభ్యత్వం, పొదుపు,రుణాలు,మూల నిధులు,రుణ వాయిదాలు, వడ్డీ రేట్ల పట్ల చర్చించి చార్ట్ రూపాలతో గ్రూపులుగా చర్చలు జరిపి వినిపించారు. వ్యాపారంలో అభివృద్ధి పొందాలంటే వ్యూహం,లక్ష్యం, మూల నిధి, వ్యాపారానికి ఉన్న డిమాండ్ మొదలుగు అంశాలపై పట్టు సాధించాలన్నారు. గ్రామ సంఘం స్థాయిలో మండల స్థాయిలో పర్యవేక్షణ చాలా అవసరం అన్నారు.ఈ శిక్షణలో సిసి హరిబాబు, వెంకటలక్ష్మి, ధార లక్ష్మీ, మండల సమైక్య ఈసీ సభ్యులు మరియు గ్రామ సంఘం సహాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఆర్ఓగా మాచిరాజు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపల్ ఆర్ఓగా మచిరాజు రవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్వోగా పనిచేసిన శాస్త్రి గత నెల లో పదవీవిరమణ చేశారు. 2014 నుండి 2019 వరకు ఇదే మున్సిపాల్టీ లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. భీమవరంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఆరోఓగా పదోన్నతి పొందారు. అక్కడి నుండి మండపేట బదిలీ అయ్యారు. కమీషనర్ టీవీ రంగారావును కలిసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను గతంలో మండపేటలో పనిచేశానని చెప్పారు. రెవెన్యూ విభాగంలో ఆస్తి పన్నులు వసూలుపై దృష్టి సారిస్తామని చెప్పారు. కాగా ఇక్కడ ఆర్ఐగా పనిచేస్తున్న అందే శ్రీనివాస్‌కు రామచంద్రాపురం పురపాలక సంఘంలో ఆర్ఓగా పదోన్నతి లభించింది. ఆయన బుధవారం అక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా మండపేట ఆర్ఐ పోస్టు కోసం ఆశావాహులలో ఎప్పుడు లేని విధంగా ఒక మహిళ కూడా ఉండటం గమనార్హం.

# దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు : సునీత

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారిచే జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రికార్డ్ అసిస్టెంట్ (నోటిఫికేషన్ నెం.1/2026), డేటా ఎంట్రీ ఆపరేటర్ (నోటిఫికేషన్ నెం.2/2026), ఫ్రంట్ ఆఫీస్ కో-ఆర్డినేటర్ (నోటిఫికేషన్ నెం.3/2026) పోస్టులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీని 30.01.2026 సాయంత్రం 5.00 గంటల వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### సీతానగరంలో బాబు జగజీవన్ రామ్

# వాలీబాల్ పోటీలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో బాబు జగజీవన్ రామ్ వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా జరిగింది.ఈ పోటీలకు సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ముఖ్యఅతిథిగా, స్థానిక ఎస్సై డి.రామ్ కుమార్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ ఐక్యతను పెంపొందిస్తాయని వీరబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోవటములను సమానంగా స్వీకరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు.

# కోరుకొండలో 17వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక

**ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమల్లేశ్వరరావు - ప్రజా వేదికలో భాగస్వామ్యం కానీ ప్రజలు**





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ వివరాలను వెల్లడించారు.1 ఏప్రియల్ 2024 నుండి 31 మార్చి 2025 వరకు సుమారు1.066 పనులు జరిగినట్టుగా తెలిపారు. ఈ పనులకు సంబంధించి వేతనాల రూపంలో 10.36 కోట్ల రూపాయలు, మెటీరియల్ రూపంలో 7.60 కోట్ల రూపాయలు వెరసి 17.97 కోట్ల రూపాయలు పనులు జరిగినట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ నాగమల్లేశ్వరరావు తెలిపారు. రికవరీ రూపంలో 1,24,724 రూపాయలు చేసామన్నారు. పలుచోట్ల మొక్కలు ఎక్కువగా చనిపోయినట్లు గుర్తించామని, వాటి స్థానంలో మరల మొక్కలను నాటే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో సంబంధిత అధికారులు తప్ప, పట్టుమని పదిమంది ప్రజలు కూడా లేకపోవడం గగనార్హం. ఈ కార్యక్రమంలో ఏపీడి బి రాంప్రసాద్, డీవీవో కే రత్న కుమారి, హెచ్ ఆర్ నరేష్, షేక్ ఖాదర్ బాషా, ఏపీవోలు భ్రమరాంబ, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జిల్లా పెద్దాయనకు రెండు సీట్లు కావాలట!

ఎన్నికలకు ఇంకా మూడేళ్ళు పై దాటి సమయం ఉంది. కానీ ఆశావహులకు మాత్రం ఆరాటాలు ఎక్కువ అవుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్న వారు అయితే ఎన్నికలు రేపే అనేలా హడావుడి చేయవచ్చు కానీ అధికారంలో ఉన్న వారు మరో ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్లాన్ చేయడమేంటి అన్నదే అసలైన హాట్ డిస్కషన్ గా ఉంది. విషయానికి వస్తే కాకినాడ జిల్లా జగ్గంపేట సిట్టింగ్ ఎమ్మెల్యే టీడీపీకి చెందిన ముఖ్య నాయకుడు అయిన జ్యోతుల నెహ్రూ వచ్చే ఎన్నికల గురించి అపుడే మాస్టర్ ప్లాన్స్ వేస్తున్నారుట.

**షిఫ్ట్ అవుతాను అంటూ :**

వచ్చే ఎన్నికల్లో తాను జగ్గంపేట నుంచి పోటీ చేయనని వేరే సీటుకు షిఫ్ట్ అవుతాను అని తాజాగా జ్యోతుల నెహ్రూ సంచలన వ్యాఖ్యలు చేశారు అని అంటున్నారు. తన కుమారుడు జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ జ్యోతుల నవీన్ జగ్గంపేట నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారు అని ఆయన చెబుతున్నారు. అంటే 2029 ఎన్నికల్లో రెండు టికెట్లు తమ కుటుంబానికి కావాలని ఇప్పటి నుంచే జ్యోతుల వారు టెండర్ పెట్టారు అని అంటున్నారు. మంత్రి పదవి కోసమేనా :

**మంత్రి పదవి కోసమేనా :**

ఇదిలా ఉంటే జగ్గంపేట నుంచి ఇప్పటికి ఆరు సార్లు పోటీ చేసి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు జ్యోతుల నెహ్రూ. అది కూడా మూడు పార్టీల నుంచి గెలిచారు. ఇక ఆయన మొత్తం రాజకీయ జీవితం మూడున్నర దశాబ్దాలు దాటినా ఇప్పటిదాకా మంత్రి అయితే కాలేదు, దానికి కారణం పొలిటికల్ జంపింగ్స్ అని అంటున్నారు. ఆయన 2014లో టీడీపీ గెలిచిన నాటికి వైసీపీలో ఉన్నారు. ఇక 2019లో వైసీపీ గెలిచిన నాటికి టీడీపీలో ఉన్నారు. అంతకు ముందు కూడా అలాగే జరిగింది. తీరా 2024లో ఆయన గెలిచారు, టీడీపీ అధికారంలో ఉంది. కానీ కూటమి పార్టీలతో పొత్తులతో సామాజిక సమీకరణలతో ఆయనకు మంత్రి పదవి అయితే దక్కలేదు అని అంటున్నారు. మంత్రి కావాలన్నది ఆయన జీవితాశయంగా చెబుతున్నారు. రాజకీయంగా రిటైర్ కావాలీ అంటే మాజీ మంత్రిని అనిపించుకోవాలని ఆయన ఉబలాటపడుతున్నారుట. ఆ రెండో సీటు ఎక్కడో : సరే ఆయన మంత్రి పదవి ఆశలు బాగానే ఉన్నా రెండవ సీటు ఎక్కడ అన్నది పార్టీలో చర్చగా ఉంది. జగ్గంపేటలోనే మిత్రుల నుంచి ఈసారి పోటీ ఉంటుందని చెబుతున్నారు. అయితే జ్యోతుల ఫ్యామిలీ మీద అభిమానంతో ఆ సీటు వదిలేస్తారు కానీ మరో సీటు కాకినాడ జిల్లాలో జ్యోతుల కుటుంబానికే ఇవ్వాలీ అంటే కుదిరే పనేనా అన్న చర్చ సాగుతోంది. అంతే కాదు పొత్తులు అపుడు కూడా ఉంటాయి. ఇంకా ఎక్కువ డిమాండ్లు ఉంటాయి. దాంతో ఒక్కో సీటు మీద గట్టిగా పీట ముడి బిగుసుకుంటుందని అటువంటి సమయంలో జ్యోతుల నెహ్రూ కుటుంబానికే రెండవ సీటు ఇవ్వడం అంటే జరిగే పనేనా అన్న చర్చ సాగుతోంది. అయితే జ్యోతుల నెహ్రూ మాత్రం తన మనసులో మాటను బయట పెట్టేశారు అని అంటున్నారు. ఇక జిల్లాలో మిగిలిన నేతలు ఎక్కడ తమ సీటుకు ఎసరు వస్తుందో అని చూసుకోవాల్సిందే అని అంటున్నారు. రెండవ సీటు సేఫ్ జోన్ లో చూసుకోకుండా జ్యోతుల నెహ్రూ ఈ మాటలు అనరని అంటున్నారు. సో అదన్న మాట సంగతి.

# ప్రజారోగ్యానికి ప్రత్యేక శ్రద్ధ

## దోమల నివారణకు చర్యలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘ కమీషనరు టి.వి.రంగారావు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఆధ్వర్యంలో దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో గల 1, 3, 4, 13, 14, 17, 18, 20, 22, 23, 24, 29 వార్డులలోని డ్రైనేజీలలో టీమోపాస్ మందును పిచికారీ చేశారు. మేజర్ డ్రైన్లలో ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 28,29 తేదీల్లో మిగిలిన అన్ని వార్డులలో గల డ్రైనేజీలలో టీమోపాస్ మందును పిచికారీ చేస్తామని తెలిపారు.



# అంతర్వేది కళ్యాణ మహోత్సవాలకు కట్టుదిట్టమైన బందోబస్తు

## క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించిన ఏలూరు రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అంతర్వేదిలో జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాలకు సంబంధించి భక్తుల భద్రతకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, ఐపీఎస్., జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్., తెలిపారు. కళ్యాణ మహోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఐజీ, ఎస్పీ అంతర్వేది క్షేత్రాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలు, క్యూ లైన్లు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ మాట్లాడుతూ, రేపు జరగనున్న కళ్యాణోత్సవం ఈ నెల 29న నిర్వహించే రథోత్సవం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా ఆలయ పరిసరాలు, క్యూ లైన్లు, ప్రధాన వీధుల్లో విస్తృతంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేయగా, వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాలపై డ్రోన్ కెమెరాల ద్వారా గగనతల నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా బందోబస్తు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, ప్రతి పోలీస్ సిబ్బంది



క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్ల వద్ద ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, రథోత్సవ సమయంలో తోపులాటలు జరగకుండా క్రౌడ్ మేనేజ్మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ.వి.ఆర్. పి.బి. ప్రసాద్, కొత్తపేట డి.ఎస్.పి. మురళీకృష్ణ, రాజోలు సి.ఐ. నరేష్ కుమార్, ఎస్బీ సి.ఐ. పుల్లారావు తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పశు సంరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి

## ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం

**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతుల ఆర్థిక పరిపుష్టికి పశుసంపదే పునాది అని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పశు సంపద పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కె. గంగవరం మండలం ఎర్ర పోతవరం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరంలో ఆయన పశుసంవర్ధక శాఖ ఏడి రామకృష్ణ, కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ధ్యేయమని స్పష్టం చేశారు. పశువుల ఆరోగ్యం కాపాడితేనే రైతు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, పశు వ్యాధుల నివారణకు ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సకాలంలో వైద్య సేవలు అందకపోవడం వల్ల రైతులు



ఆర్థికంగా నష్టపోతున్నారని, ఆ సమస్యకు పరిష్కారంగా కూటమి ప్రభుత్వం ఈ ఈనెల 19 నుంచి 31 వరకు పశు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ శిబిరాల ద్వారా పశువులకు ఉచిత వైద్య పరీక్షలు, టీకాలు, మందుల పంపిణీ, పోషకాహారంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాల వల్ల పశువుల మరణాలు తగ్గి, పాల ఉత్పత్తి పెరిగి, రైతుల ఆదాయం గణనీయంగా వృద్ధి చెందుతుందని నాయకులు వివరించారు. భవిష్యత్తులో కూడా ప్రతి గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తూ రైతులకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తామని, గ్రామీణాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సత్యం ఈ సందర్భంగా పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడి రామకృష్ణ మాట్లాడుతూ పశు సంరక్షణ కోసం ప్రభుత్వం ఈ ఉచిత శిబిరాలు నిర్వహిస్తోందని పాడి సంపద కలిగి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్ కూటమి పార్టీ నాయకులు, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పి.రాంబాబు, సాటిపాటి దొరబాబు, సెక్రటరీ నరాల సూరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు విశ్వేశ్వర సీతారామయ్య, బాబు, పశు వైద్యులు, పిహెచ్‌సీ హాస్పిటల్ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

# భూ పరిపాలనలో పురోగతి సాధించి సుపరిపాలన అందించాలి

## రెవెన్యూ సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఆదేశాలు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ప్రాధాన్యత అంశమైన భూ పరిపాలనలో ఆశించిన స్థాయి పురోగతి సాధించి ప్రజలకు సుపరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి, ఇతర విభాగాల ఉన్నత కార్యదర్శులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ క్లినిక్లు, ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణ, మ్యూటేషన్?లు, రీ-సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రెవెన్యూ క్లినిక్ల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపాలన్నారు. క్లినిక్ల ద్వారా అర్జీల పునరావృతాన్ని తగ్గిస్తూ, రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో



విశ్వసనీయత పెంచాలని సూచించారు. ఐవీఆర్ఎస్ సర్వేలలో జిల్లావ్యాప్తంగా ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచాలని, రెవెన్యూ సేవల్లో మెరుగైన స్పందన తీసుకురావడానికి రెవెన్యూ క్లినిక్లు కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు. రెవెన్యూ అంశాలపై ప్రజా ఫీడ్‌బ్యాక్ నాణ్యతను మరింత పెంచాలని ఆదేశించారు. భూమార్పిడి, మ్యూటేషన్‌ల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రజా గ్రీవాన్స్ రెడ్రసల్ సిస్టమ్ (పిజీఆర్ఎస్) ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులో పరిష్కరించాలని సూచించారు. రీ-సర్వే పూర్తైన గ్రామాల్లో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతి నెల మొదటి వారంలో గ్రామసభల ద్వారా పంపిణీ చేయాలన్నారు. తప్పులు సరిచేసి, పారదర్శకతతో కూడిన కచ్చితమైన పాస్ పుస్తకాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కుల ధ్రువీకరణ పత్రాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆరు దశల విచారణ అనంతరం జారీ చేయాలని, ఇతర కులాలకు కూడా ఇంటింటి సర్వే ద్వారా కుల విచారణ చేపట్టాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రెవెన్యూ పిజిఆర్ఎస్, ప్రజా సంతృప్తి స్థాయిలు, కుల విచారణ, అందరికీ ఇళ్లు, రీ-సర్వే, భూ సేకరణ, నీటి తీరువా వసూలు, పౌర సరఫరాలు వంటి అంశాల్లో భూ పరిపాలనలో సమగ్ర పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

# ‘అమరావతి’పై కేంద్రం బిల్లు.. వైసీపీ స్టాండ్ ఇదే..

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టబోయే చట్టంపై ఎలా స్పందించాలనే విషయమై వైసీపీ ఓ క్లారిటీకి వచ్చింది. మూడు రాజధానుల అజెండాతో ఇన్నాళ్లు అమరావతిని నిర్లక్ష్యం చేసిందని వైసీపీ విమర్శలు ఎదుర్కొంటోంది. అమరావతిపై తరచూ మాటలు మార్చడం వల్ల రాజకీయంగా ఆ పార్టీ తీవ్రంగా నష్టపోయిందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పట్టుదలతో రాజధాని అమరావతి బిల్లును పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో ఈ అంశంపై ఇన్నాళ్లు జరిగిన ఉగిసలాటకు ముగింపు పలకడం వైసీపీకి సవాలుగా మారిందని అంటున్నారు. అయితే తాజాగా వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజధానిపై ఆ పార్టీ ఎదుర్కొంటున్న గందరగోళం నుంచి బయటపడేసేవిగా ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. రాజధాని అమరావతి విషయంలో వైసీపీకి చాలా క్లారిటీ ఉందని రాజంపేట ఎంపీ, వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. తమ పార్టీ ఎప్పుడూ కూడా అమరావతిని వ్యతిరేకించలేదని వ్యాఖ్యానించారు మిథున్ రెడ్డి. పార్లమెంటులో అమరావతి బిల్లు వస్తే రైతులకు న్యాయం చేయాలని తాము గట్టిగా మాట్లాడతామని తెలిపారు. రాష్ట్రానికి మేలు జరిగే విధంగా పోరాడమని తమ నేత జగన్మోహనరెడ్డి సూచించారని, ఆయన సూచనల మేరకే పార్లమెంటులో పనిచేస్తామన్నారు. గత సమావేశాల్లో కూడా తాము మాట్లాడటం వల్లే రాష్ట్రానికి ఉపాధి హామీ పథకంలో రూ.30 వేల కోట్లు విడుదలయ్యాయని గుర్తు చేశారు. రాజధానిపై మిథున్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీస్తున్నాయి. రాజధానిపై వైసీపీ భవిష్యత్తు ప్రణాళికలను ఆయన మాటల్లో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. అయితే మిథున్ రెడ్డి వ్యాఖ్యలను లోతుగా పరిశీలిస్తే ఇంకా వైసీపీ అమరావతిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేని గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటులో అమరావతి బిల్లు ప్రవేశపెడితే తాము రైతుల తరఫున పోరాడతామని, రైతు సమస్యలు ముందుగా పరిష్కరించమని అడుగుతామని మిథున్ రెడ్డి చెబుతున్నారు. ఈ మాటలను బట్టి రాష్ట్రానికి అమరావతి ఒక్కటే రాజధానిగా తాము ఆమోదిస్తున్నట్లు ఆయన ఎక్కడా చెప్పలేదని అంటున్నారు. 2019 నుంచి రాజధాని అమరావతిపై వైసీపీ వ్యతిరేకత చూపుతూనే ఉందని అంటున్నారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈ వైఖరిలో మార్పు వస్తుందని ఆశించినా, ఆ దిశగా ఆ పార్టీ మార్పు కనిపించలేదని అంటున్నారు. అయితే ఈ విషయంలో వైసీపీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ప్రకటనలు వస్తుండటం కొంత గందరగోళానికి కారణమవుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీ అధినేత జగన్ రాజధాని అమరావతిలో లక్షల కోట్ల రూపాయలతో నిర్మాణాలను చేపట్టడాన్ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారు. ఐదేళ్లు సీఎంగా ఉండగా, ఒక్కసారి కూడా రాష్ట్ర సచివాలయానికి వెళ్లని జగన్.. విశాఖను పరిపాలన రాజధానిగా చేసుకుని పాలన కొనసాగించాలని ఆకాంక్షించారు. అయితే ఆయన ఆలోచనలకు కార్యరూపం ఇవ్వలేకపోయారని విమర్శలు ఎదుర్కొన్నారు. ఇక ఎన్నికల్లో ఓటమి తర్వాత విజయవాడ-గుంటూరు మధ్య నాగార్జున యూనివర్సిటీలో 500 ఎకరాల్లో పరిపాలన భవనాలు నిర్మించి రాజధానిగా ప్రకటిస్తే సరిపోతుంది కదా? అంటూ ప్రశ్నించారు. దీనికి కొనసాగింపుగా సీఎం ఎక్కడ ఉంటే అదే రాజధానిగా ఇటీవల ప్రకటించారు. రాజ్యాంగంలో రాజధాని అన్న పదమే లేదని చెప్పడం ద్వారా అమరావతికి ప్రాధాన్యం లేదన్నట్లు ఇటీవల జగన్ వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. అయితే ఆయన ప్రకటనపై వ్యతిరేకత వచ్చిందన్న కారణంతో పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామచంద్రారెడ్డి కల్పించుకుని తాము రాజధాని అమరావతికి వ్యతిరేకం కాదని క్లారిటీ ఇచ్చారు. ఇక ఇప్పుడు మిథున్ రెడ్డి సైతం ఇదే అర్థం వచ్చేలా మాట్లాడి పార్టీకి నష్టం జరగకుండా చూస్తున్నారని అంటున్నారు. రాజధాని అమరావతిపై చట్టం చేస్తే ఇక భవిష్యత్తులో రాజధాని నగరాన్ని మరో చోటుకు తరలించడం సాధ్యం కాదని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీ రాజధాని చట్టాన్ని అడ్డుకునే స్థితిలో లేకపోవడంతో అంగీకరించడం ఒక్కటే మార్గంగా తుది నిర్ణయానికి వచ్చినట్లు ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే వైసీపీ వైఖరిపై ఇంకా స్పష్టత రావాల్సివుందని, రాజధానిగా అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ అధికారికంగా ప్రకటన చేయాలని టీడీపీ సోషల్ మీడియా డిమాండ్ చేస్తోంది.

కొత్తపేట డిఎస్పీ సుంకర మురళి మోహన్‌కు

# ఉత్తమ సేవ పురస్కారం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసు శాఖలో ఉత్తమ సేవలు కు కొత్తపేట సబ్ డివిజినల్ పోలీస్ ఆఫీసర్ సుంకర మురళి మోహన్ ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందించే వారికి ఇచ్చే పురస్కారాన్ని సుంకర మురళి మోహన్ అందుకున్నారు. అమలాపురంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా అయన ఈ అవార్డును అందుకున్నారు. లా అండ్ ఆర్డర్ నేరాలను నియంత్రించటంలో, ఎటువంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతతను నెలకొల్పుతూ, అటు మోంత తుఫాన్ సమయంలో ఇటు ఇరుసుమండ బ్లో ఔట్ సమయంలో అలసత్వం లేకుండా అహర్నిశలు కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు.

# అంతర్వేది వైపు అఖండ భక్తి ప్రవాహం

## 16వ మహా గజమాలయాత్రకు ఘన ఆహ్వానం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

హిందూ ధర్మ పరిరక్షణకు, భక్తి ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మహా గజమాలయాత్ర జనవరి 28, 2026 (బుధవారం) ఘనంగా నిర్వహించబడనుంది. అంతర్వేది క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి అలాగే ఆలయ నిర్మాత, ధర్మనిష్ఠ గల భక్త శ్రేష్ఠులు సికామని కోపనాతి కృష్ణమ్మ వర్మ కి అంకితంగా ఈ 16వ మహా గజమాలయాత్రను నిర్వహిస్తున్నట్లు మహా గజమాల కమిటీ ప్రకటించింది. ఈ మహా యాత్రకు యావత్ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అగ్నికుల క్షత్రియ పెద్దలు, సోదరులు, నాయకులు మాత్రమే కాకుండా హిందూ ధర్మాన్ని ప్రేమించే భక్తులు వేల సంఖ్యలో తరలిరానున్నారు. ఉదయం 7:00 గంటలకు ఓడలరేవు నుంచి ప్రారంభమయ్యే యాత్ర, పేరూరుపేట మీదుగా సాగుతూ పవిత్ర అంతర్వేది క్షేత్రాన్ని చేరుకుంటుంది. భక్తుల నినాదాలు, శంఖారావాలు, గజమాలల వైభవంతో ఈ యాత్ర ఒక మహా సంకల్పయాత్రగా నిలవనుంది. ఈ సందర్భంగా మహా గజమాల వ్యవస్థాపకులు చింతామహా నాగరాజు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ మహా యాత్ర కేవలం ఒక ఊరేగింపు మాత్రమే కాదని, ఇది అగ్నికుల క్షత్రియుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం 7 గంటల లోపు ఓడలరేవు చేరుకొని, యాత్రను నిర్విరామంగా, శాంతియుతంగా కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే యాత్ర సమయంలో పోలీసు శాఖ వారు ఇచ్చిన సూచనలు తప్పనిసరిగా పాటించాలని, క్రమశిక్షణతో వ్యవహరించడం ద్వారా భక్తి పరంపరను మరింత ఉజ్వలంగా చూపించాలని కోరారు. ఈ మహా గజమాలయాత్ర ద్వారా అగ్నికుల క్షత్రియుల ఖ్యాతి రాష్ట్ర స్థాయిలోనే కాక జాతీయ స్థాయిలోనూ మరింత వెలుగొందుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. భక్తి, శ్రద్ధ, సమర్పణలతో సాగనున్న ఈ 16వ మహా గజమాలయాత్ర హిందూ సమాజానికి ఐక్యత సందేశాన్ని అందిస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనుగ్రహంతో ఈ యాత్ర విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, యావత్ భక్తులు, హిందూ సోదరులు పెద్ద ఎత్తున హాజరై ఈ మహా యాత్రను ఘనంగా విజయవంతం చేయాలని కమిటీ తరఫున మరోసారి పిలుపునిచ్చారు.

వేదిరేశ్వరం శివారు ములగూడెం గ్రామంలో

# ఘనంగా గజ్జల పూజ

## అలరించిన కోలాట ప్రదర్శనలు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా కోనసీమ జిల్లా రావులపాలెం మండలం వేదిరేశ్వరం శివారు ములగూడెం గ్రామంలోనీ శ్రీ సీతారామ ఆలయ ప్రాంగణంలో "గజ్జల పూజ" కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. తిరుమల తిరుపతి దేవస్థానం (ఋణ) దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో, గురువు చెల్లా శ్రీనివాస్ వద్ద గత మూడు నెలలుగా సుమారు 17 మంది మహిళలు, బాలబాలికలు కోలాట నృత్యంలో శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు చల్లా శ్రీనివాసరావు గురువుగారు ఆధ్వర్యంలో ఈ గజ్జల పూజను నిర్వహించారు. శ్రీ లక్ష్మగణపతి రామ కోలాటం బృందం ఆధ్వర్యంలో చల్ల శ్రీనివాసరావు గురువు, సతీష్, బృందం సభ్యులు కుడుపూడి పార్వతి, వెంకటరమణ, కుడుపూడి అన్నపూర్ణ, వాసంశెట్టి జ్యోతి, వాసంశెట్టిమౌనిక, గుబ్బల సతీష్, బొక్క విజయలక్ష్మి, శీలం లావణ్య, దూనబోయిన శశి, మామిడి శెట్టివెంకటలక్ష్మి, కుడుపూడి వెంకటరమణ, ఇల్లా సత్య ప్రభవతి, కుడిపూడి సంధ్య, కుడిపూడి దీక్షిత, ఇళ్ళ గణేశ్వరి, ఇళ్ళ సీతామహాలక్ష్మి, గుబ్బల లక్ష్మి శ్రీ వల్లి, దోనబోయిన సింధు,

**వేషధారణలు:** కార్యక్రమంలో భాగంగా బాలబాలికలు శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు కనకదుర్గమ్మ వారి వేషధారణలలో మెరిసి భక్తులను, కళాభిమానులను అలరించారు.

**నృత్య ప్రదర్శన:** గజ్జల పూజ అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కోలాట నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**లక్ష్యం:** భావితరాలకు హిందూ ధర్మాన్ని, సంప్రదాయ కళలను అందించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. తమ పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదర్శనలను ఆస్వాదించారు.

# అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

## అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో వాసంశెట్టి సత్యం - రూ.1.79 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి బాటను మరింత వేగవంతం చేస్తోందని రామచంద్రపురం నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కాజులూరు మండల గ్రామాల్లో పలు రోడ్లకు ఆయన మంగళవారం భూమిపూజలు చేశారు. పల్లెపాలెం గ్రామంలో రూ.84 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు కీలక రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి వాసంశెట్టి సత్యం భూమిపూజ చేశారు. అదే క్రమంలో కాజులూరు మండలం దుగ్గుదూరు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న ఎషి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం సత్యం మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను ఇప్పుడు అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వాసంశెట్టి సత్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జె.రాంబాబు, మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి( డాక్టర్ బాబు) జె ఈ భవాని శంకర్, పల్లిపాలెం సర్పంచ్ వడ్డపాటి భాస్కరరావు, దుగ్గుదూరు సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి జ్యోతి కుమార్ , పిఎసిఎస్ అధ్యక్షులు కాళ నరసింహమూర్తి, డిసీ చైర్మన్ చైతన్య కృష్ణ, బిజెపి ఇన్చార్జ్ దూడల శంకర్నారాయణ, కూటమి పార్టీ నాయకులు, మేడిశెట్టి పెద్ద, కురుపూడి కొండ, దడాల నాగార్జున, రెడ్డి శేషరావు, వెంకటరమణ, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో కల్తీ నూనె తయారీపై పోలీసుల దాడి

## జంతువుల కొవ్వుతో వంట నూనె తయారీ!



ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ధర్మవరం శివారు ప్రాంతంలో జన సంచారానికి దూరంగా కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న కల్తీ వంట నూనె తయారీ కేంద్రం గుట్టును పోలీసులు రట్టు చేసారు. ఈ ప్రాంతంలో గత కొంత కాలంగా జరుగుతున్న అనుమానాస్పద కార్యకలాపాలపై వచ్చిన పక్కా సమాచారంతో ప్రత్తిపాడు పోలీసు స్టేషన్ ఎస్సై లక్ష్మీకాంతం నేతృత్వంలోని పోలీసుల బృందం ఈ నకిలీ నూనె తయారీ దందా కేంద్రంపై సోమవారం మెరుపు దాడి చేసింది. ఈ సోదాల్లో ప్రధాన నిందితుడు, అక్రమ ధనార్జనే ధ్యేయంగా ఈ కల్తీ నూనె తయారీ కేంద్రం దందాకు పాల్పడుతున్న ఫకృద్దీన్ పాలెం గ్రామానికి చెందిన బండారు ఫణిప్రసాదును అదుపులోకి తీసుకోవడంతో పాటు, కల్తీ తైలం తయారీ కేంద్రం నుంచి 15 కల్తీ నూనె డబ్బాలు, 4 క్రూడ్ ఆయిల్ నింపిన డ్రమ్ములు, ఇంధనాన్ని తయారు చేయడానికి ఉపయోగిస్తున్న యంత్ర పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని మరో ఎనిమిది మంది కీలక సభ్యులు పరారీలో ఉన్నారు. ఈ ముఠా దందా గుట్టును పోలీసులు మీడియా ముందు విప్పారు. తమ పోలీసుల దర్యాప్తులోని ఈ కేసు వివరాలను పెద్దాపురం డీఎస్పీ. శ్రీహరిరాజు మంగళవారం మధ్యాహ్నం ప్రత్తిపాడు పోలీసు స్టేషన్లో మీడియాకు వెల్లడించారు. ఈ ముఠా ఆవు, ఎద్దు, బర్రె, గొర్రె వంటి పెంపుడు జంతువుల కొవ్వును సేకరించి, దానికి క్రూడ్ ఆయిలును కలిపి అధిక ఉష్ణోగ్రత వద్ద మరిగించి, దానికి రంగు, వాసన కలిపి స్వచ్ఛమైన వంట నూనెగా ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని వెల్లడించారు. నిందితుడు ఫణి ప్రసాద్ గత నాలుగు నెలలుగా ఈ అక్రమ కేంద్రాన్ని నడుపు తున్నాడని, దీని వెనుక ఒక పెద్ద అంతర్రాష్ట్ర ముఠా హస్తం ఉందని తెలిపారు. ఇచ్ఛాపురానికి చెందిన వెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని సంతోష్ శ్రీనివాస్ దాస్, రాజమండ్రికి చెందిన ఎం.డి. ఇర్ఫాన్ లతో ఒప్పందం కుదుర్చుకుని నాలుగు నెలలుగా ఈ కల్తీ నూనెను ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించా మన్నారు. పరారీలోని మిగతా ఎనిమిది మంది నిందితులను అదుపులోనికి తీసుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను గాలింపు చర్యలకు రంగంలోకి దించామని డీఎస్పీ స్పష్టం చేశారు. పట్టుబడ్డ ప్రధాన నిందితుడు బండారు ఫణిప్రసాదును రిమాండ్ కు తరలిస్తామని, పరారీలోని మిగతా ఎనిమిది మంది నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. సీఐ సూర్య అప్పారావు పర్యవేక్షణలో ఈ కల్తీ కేంద్రాన్ని గుర్తించిన ఎస్సై లక్ష్మీకాంతం, పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు బ్రాండెడ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలని, తక్కువ ధరకు వస్తున్నాయని తెలియని రీతిలో నకిలీ పదార్థాలను కొని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. కల్తీ వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

### ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు

# విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలి



కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా కాకినాడ నగరంలోని జగన్నాథపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ సెంటర్ వద్ద ఆటో డ్రైవర్లు, యాజమానులు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు, కాకినాడ ఎస్డీపీవో దేవరాజ్ మనిష్ పాటిల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణ నష్టం జరుగుతోందని అధికారులు తెలిపారు. పాఠశాల పిల్లలను తీసుకెళ్లే ఆటోల్లో తప్పనిసరిగా 6౦1 మంది మాత్రమే ప్రయాణించాలన్నారు. స్కూల్ ఆటోలకు ఇరువైపులా బ్యాగులు లేదా క్యారెజులు తగిలించి ప్రయాణించకూడదని సూచించారు. పెద్దవారిని తీసుకెళ్లే ఆటోల్లో 3౦1 మందికే పరిమితం కావాలని, అధికంగా ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు. ఆటోలు ఎప్పటికప్పుడు పూర్తిస్థాయి కండిషన్?లో ఉండేలా చూసుకోవాలని, డ్రైవర్లు యూనిఫాం ధరించి ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయరాదని హెచ్చరించారు. ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా, ప్రయాణికులను రోడ్డుకు ఎడమవైపు మాత్రమే దించాలన్నారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, సెల్?ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని తెలిపారు. బయటకు వెళ్లే ప్రతి వాహనదారుడు తమ కుటుంబ సభ్యులు తమ కోసం ఎదురుచూస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్ రమేష్, ట్రాఫిక్-1 ఎస్ఐ సిహెచ్ బోసు బాబు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# దాడి బాధితుడిని పరామర్శించిన బిసివై పార్టీ నేత



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా ప్రతిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడిలో గత నెలలో కొందరు ఉన్నత సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు దాడి చేయగా బాధితుడైన ముత్తిన రామకృష్ణను బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ మంగళవారం పరామర్శించారు. రామకృష్ణ వైద్య ఖర్చుల కోసం రూ. 50,000 లను ఆర్థిక సహాయంగా అందించారు. అనంతరం రామచంద్ర యాదవ్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వానికి బీసీలపై దాడులు తగవని, బీసీల రక్షణ చట్టం తెస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీపై నేటి వరకు సదరు చట్టం చేయక పోవడం వలన ఇటువంటి దాడులు జరుగుతున్నాయని, స్థానిక ప్రజాప్రతినిధులు అగ్రవర్ణాలకు చెందిన వారై ఉండడం వలన నిందితులకు కొమ్ముకాస్తున్నారని ఇటువంటి చర్యలు తగవని, నిందితులపై తక్షణమే 307 సెక్షన్ నమోదు చేయాలని, లేని పక్షంలో ఈ విషయమై బిసివైపార్టీ ఆందోళన చేస్తుందని పేర్కొన్నారు. ఈయన వెంట జిల్లా బిసివై పార్టీ నాయకురాలు అనూషా యాదవ్ ఉన్నారు.

# ఘనంగా ఏఎమ్‌సి చైర్మన్ బచ్చు శేఖర్ జన్మదిన వేడుకలు



కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సమాజసేవకుడు బచ్చు శేఖర్ జన్మదిన వేడుకలు కాకినాడలో అత్యంత ఘనంగా, వైభవోపేతంగా నిర్వహించబడ్డాయి. అభిమానుల అభినందనలు, బంధు మిత్రుల ఆశీర్వాదాలు, రాజకీయ నాయకుల ఆత్మీయ పలకరింపుల మధ్య కోలాహల వాతావరణంలో ఈ వేడుకలు ఉత్సాహంగా సాగాయి.ఈ కార్యక్రమానికి స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండ బాబు హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీకి బాసట గా నిలుస్తూ అధికారం లేని రోజుల్లో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు గా పనిచేసి తెలుగుదేశం పార్టీ విజయానికి ఎనలేని సేవలు అందించిన శేఖర్ అంకితభావ సేవలకు పార్టీ అధికారంలోకి రాగానే మార్కెట్ కమిటీ చైర్మన్ హోదాతో గౌరవించడం జరిగిందని తెలిపారు. సామాన్య కుటుంబాల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మార్కెట్ వ్యవస్థ పటిష్టతే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా బచ్చు శేఖర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రైతులకు న్యాయమైన ధరలు, సౌకర్యాల కల్పన, మార్కెట్ మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే కొండ బాబు ఈ సందర్భంగా కొనియాడారు. అలాగే ఆర్య వైశ్య సమాజ సంక్షేమం కోసం ఆయన చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని, విద్య, ఆర్థిక స్వావలంబన, సామాజిక సేవ రంగాల్లో బచ్చు శేఖర్ నిరంతర శ్రమ జీవిగా నిలుస్తున్నారని నాయకులు ప్రశంసించారు. రాజకీయ జీవితంలో ఉన్నప్పటికీ సేవాభావాన్ని మరవకుండా ప్రజల మధ్య ఉండడం ఆయన ప్రత్యేకతగా పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ బచ్చు శేఖర్‌కు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో సేవ చేసే అవకాశం రావాలని ఆకాంక్షించారు. అభిమానులు కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. జన్మదినాన్ని వ్యక్తిగత సంబరంగా కాకుండా సేవా కార్యక్రమాలకు అంకితం చేయాలనే భావనతో ముందుకు సాగుతున్న బచ్చు శేఖర్, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే తనయుడు మోహన్ వర్మ, టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, భానులింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మళ్ళ చిన్నా, జిజి హెచ్ హెచ్ డి ఎస్ మెంబర్ అమన్ జైన్, ఏ పి స్టేట్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గదుల సాయిబాబా, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ఎనిమి రెడ్డి మాల కొండయ్య, దంగేటి సతీష్, అద్దెపల్లి గంగరాజు,చెక్కారమేష్, పక్కి మణి బాల తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# క్రీడలతో శారీరక-మానసిక వికాసం

## ఎం.ఎస్.ఎన్ చారిటీస్ క్రీడా సంబరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వనమాడి



కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 111వ వర్ధంతిని పురస్కరించుకుని ఎం.ఎస్.ఎన్ చారిటీస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు మరియు సిబ్బందికి వైభవంగా క్రీడా సంబరాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల జీవితంలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. పుస్తక విద్యతో పాటు క్రీడలు కూడా సమానంగా అవసరమన్నారు. గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించడం నేర్పేది క్రీడలేనని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని ప్రేరణాత్మకంగా అన్నారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. చైర్మన్ ఎలెవన్, ఈ.వో ఎలివన్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ ప్రేక్షకులను ఉత్సాహపరిచింది. విద్యార్థులకు పరుగు పందెం, క్రికెట్, షాట్‌పుట్, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు నిర్వహించగా, సిబ్బందికి క్రికెట్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లడి కార్తిక నాయకర్, అసిస్టెంట్ కమిషనర్ మరియు కరస్పాండెంట్ చాగంటి సురేష్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు నులుకుర్తి సత్యసాయి, రాళ్ళపూడి ప్రకాష్, పి. లక్ష్మీప్రసన్న, పి. దుర్గప్రసాద్, పి. రాంజీ, ఎం. దుర్గప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉషా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్. సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ సోమరాజు, ఎన్.టి.వి అవధాని, హోత చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు. ఈ క్రీడా కార్యక్రమాలను వ్యాయామ ఉపాధ్యాయులు వి. గోవింద, ఫిజికల్ డైరెక్టర్ మహాలక్ష్మి సమర్థవంతంగా నిర్వహించారు. క్రీడాస్ఫూర్తితో విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తండేల్ మూవీ సీన్ రిపీట్..

## బంగ్లాదేశ్ జైలు నుంచి 23 మంది భారత మత్స్యకారుల విడుదల..



తండేల్ మూవీ సీన్ మరోసారి రిపీట్ అయింది. బంగ్లాదేశ్ సరిహద్దుల్లోకి వెళ్లి అక్కడి అధికారులకు చిక్కిన 23 మంది భారతీయ మత్స్యకారులు ఎట్టకేలకు రిలీజ్ అయ్యారు. 23మందిలో 9మంది తెలుగువారు ఉండగా.. అధికారుల కృషితో భారత్?కు చేరుకోనున్నారు. ఇంతకీ.. ఈ 23మంది మత్స్యకారుల విషయంలో అసలేం జరిగింది?... పొరపాటున అంతర్జాతీయ సముద్ర జలాల్లోకి ఎంటర్ అయిన మత్స్యకారులను పాకిస్తాన్ నేవీ అదుపులోకి తీసుకుని నిర్బంధించడం.. వారి విడుదల కోసం హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవితోపాటు బాధిత కుటుంబాలు సాగించిన పోరాటమే తండేల్ మూవీ. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఓ యథార్థగాథను నాగచైతన్య హీరోగా తండేల్ సినిమా తీశాడు దర్శకుడు. ఇప్పుడు ఇలాంటి ఘటనే విశాఖ పరిధిలో చోటుచేసుకుంది. సముద్రంలో వేటకు వెళ్లిన 9మంది తెలుగు మత్స్యకారులు.. గతేడాది సెప్టెంబర్ 22న అంతర్జాతీయ జలాలు దాటి బంగ్లాదేశ్ కోస్ట్ గార్డుకు చిక్కారు. ఈ విషయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వెళ్లడంతో మత్స్యకారుల విడుదలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. ప్రధానంగా.. భారత ఈస్ట్ కోస్ట్ మెకానైజ్డ్ ఫిషింగ్ బోటుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసపల్లి జానకీరామ్.. మత్స్యకార ప్రతినిధులు పలుమార్లు బంగ్లాదేశ్? వెళ్లి అక్కడి అధికారులతో చర్చలు జరిపారు. భారత్-బంగ్లాదేశ్ పరస్పర ఒప్పందంలో భాగంగా 23మంది భారత మత్స్యకారుల విడుదలకు అంగీకారం లభించింది. ఈ క్రమంలోనే.. వారంతా బంగ్లాదేశ్‌లోని బాగర్‌హాట్ జైలు నుంచి విడుదల అయ్యారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య బాగర్‌హాట్ జైలు నుంచి మోంగ్లా పోర్టుకు తరలించారు. అయితే.. బంగ్లాదేశ్ నేవీ సీజ్ చేసిన భారత జాలర్ల బోట్స్ రిపేర్ల నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో భారత్‌కు చేరుకుంటారు.

**23 మందిలో 9 మంది తెలుగువారు మత్స్యకారులు**

అటు.. 23 మందిలో 9 మంది తెలుగువారు ఉన్నారు. విడుదలైన వెంటనే కుటుంబ సభ్యులతో మాట్లాడి భావోద్వేగానికి గురయ్యారు. ఇక.. బోర్డర్? గుర్తించకపోవడమో.. ప్రమాదాల వల్లనో.. పొరపాటునో ఇతర దేశాల సముద్ర జలాల్లోకి వెళుంటారు కొందరు మత్స్యకారులు.. ఆయా దేశాల అధికారుల చేతుల్లో బంధీ అవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

# సిడిపిఓ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ సిడిపిఓ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. సిడిపిఓ వై. లక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రెండు వందల సంవత్సరాలు పైగా మన దేశాన్ని ఆంగ్లేయులు పాలించారని స్వాతంత్రానంతరం మన రాజ్యాంగం రచించుకున్నామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం మనది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, పార్థసారథి, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# వైసీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చెయ్యాలి

**- కార్యకర్తలకు మంచి దిశ నిర్దేశం చేసిన పార్టీ జిల్లా అబ్జర్వర్ గురునాధరెడ్డి**
**- మాజీ ఎంపీ భరత్ రామ్ ఆధ్వర్యంలో నగర కార్యకర్తల సమావేశం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక వి.ఎల్ పురం మార్గానీ ఎస్టేట్ నందు రాజమండ్రి సిటీ వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆధ్వర్యంలో నగర వైఎస్ఆర్సీపీ కార్యాలయం లో కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అబ్జర్వర్,మాజీ శాసన సభ్యులు గురునాధరెడ్డి, జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ,రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్,పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సిటీ పరిశీలకులు అద్దంకి ముక్తేశ్వరరావు,ఆంధ్ర ప్రదేశ్ ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ రుడా చైర్మన్, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిల రెడ్డి, మాజీ స్టేట్ గ్రీనింగ్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ సిటీ పరిశీలకులు రావిపాటి రామచంద్రరావు పాల్గొన్నారు. సమావేశంలో ముందు వైఎస్ఆర్సి పార్టీ కొరకు కష్టపడే ప్రతీ కార్యకర్తకు మాజీ ఏం పి మార్గాని భరత్ రామ్ సొంత విధులతో ప్రమాద భీమా 5 లక్షలు తొలి విడతగా పది మందికి భీమా పత్రాలను అందచేసి బీమా సౌకర్యాన్ని భరత్ ప్రారంభించారు. ఈవిస్తృత సమావేశంలో భరత్ రామ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరంలో వైఎస్ఆర్సిపి బలోపేతం చెయ్యాలి అంటే కార్యకర్తలే ముఖ్యం ,వారి కోసం నిరంతరం అందుబాటులో ఉంటాను, సేవ్ రాజమండ్రి కార్యక్రమం ఉధృతం చేస్తా, కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం అవుదాం, వార్డు స్థాయిలో కష్టపడి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్షులు వేణు మాట్లాడుతూ సంస్థాగత బలం ఉండాలి, వ్యవస్థను నడిపించాలి, జగన్ అనే నాయకుడే బలం మనకు అని, రాబోయే కాలంలో మన రాష్ట్రానికి ముఖ్య మంత్రి జగన్ అన్న లక్ష్యంతో పనిచేయాలి. రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ మాట్లాడుతూ కీలకమైన వ్యక్తులు అంటే కార్యకర్తలే, సామాన్య కార్యకర్తలను నాయకులుగా తయారు చేసిన జగన్, చాలా కష్టాలు బాధలు అనుభవిస్తున్నాము, సిటీ లోని 42 వార్డులు 96 సచివాలయాలు, సచివాలయాలకు సీనియర్ కార్యకర్తలను పరిశీలకులుగా, ప్రతీ రెండు వార్డులకు ఒక పరిశీలాకుడిని నియమించుకుని ఒక్క రాజమండ్రి సిటీ కొరకు సుమారు 6000 మంది జగనన్న సైన్యాన్ని తయారు చేయాలని సూచించారు. డాక్టర్ గూడూరు శ్రీనివాస్, మేడపాటి షర్మిల రెడ్డి, చందన నాగేశ్వర్ మాట్లాడుతూ కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ పటిష్టత కోసం అందరూ సమిష్టిగా కృషిచేయాలని, నగర అభివృద్ధి కోసం భరత్ ఎంత కృషి చేశారో ప్రజలలోకి బలంగా తీసుకునివెళ్ళి 2029లో జగన్‌ను ముఖ్యమంత్రిగా సిటీకి ఎమ్మెల్యేగా భరత్‌ని గెలిపించుకోవాలని కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్లమెంట్ అబ్జర్వర్ మాజీ ఎమ్మెల్యే గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలను కాపుడుకుంటే పార్టీ భవిత బాగుంటుంది అని, భరత్ కు జగన్ తో మంచి సానిహిత్యం ఉందని మంచి రాజకీయ భవిత ఉందని అలాంటి వ్యక్తిత్వం ఉన్న మనిషి సిటీ కి ఎమ్మెల్యే గా ఉంటే పార్టీకి, కార్యకర్తలకు మంచి దిశ నిర్దేశం చేస్తారని, త్వరలో కమిటీల నియమించి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు తమ సహాయ సహకారాలు భరత్ కు అందించాలని కోరారు. అలాగే మాజీ రాజమండ్రి సిటీ మాజీ అధ్యక్షులు, సీనియర్ పార్టీ నాయకులు నందెపు శ్రీనివాస్ గారి తండ్రి గారు నందెపు వెంకటరావు అకాల మరణానికి చింతిస్తూ ఒక నిముషం మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, సిటీ వివిధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# బి.సిల భవిష్యత్ జరుగుతున్న కుట్రపై చర్చకు సిద్ధం

**చర్చకు దమ్మున్న పాలక మేధావులకు పిలుపు - ఆర్పీసీ అధినేత మేడా శ్రీనివాస్ సవాల్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనాదిగా దళితులపై జరిగినఒక కుట్ర నేడు బిసిలపై జరుగుతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఓ ప్రకటనలో హెచ్చిరించారు. ఏ ప్రాతిప్రదికన బిసి లకు అట్రాసిటీ చట్టం రూపొందిస్తున్నారో చెప్పే దమ్ము కూటమి సర్కార్‌కు వుందా ! బిసిలకు ముసాయిదా బిల్లు అంటే మరో 100 ఏళ్లు అంటరాని వారిగా ముద్ర వేయటం వంటిది కాదా ! బిసి లు అంటరాని వారు మాకు కుల దూషణ చట్టం కావాలి అని బిసి వర్గాల వారు చంద్రబాబు కూటమిని అడిగారా! కాపులను బిసి కేటగిరిలో కలపండి అని ఎన్నో ఉద్యమాలు చేస్తున్న కాపుల గోడు చంద్రబాబు కూటమికి పట్టటం లేదు . బిసి లు అంటరాని వారు , అస్ప్రస్సులు అని కొన్ని శతాబ్దాలు వెలివేసే కుట్రలో భాగమే నేడు బిసి ముసాయిదా బిల్లు . బిసి లు రాజ్యాలు ఏలిన వారని చంద్రబాబు కూటమి గుర్తుంచుకోవాలి. బి.సి లపై చిత్తశుద్ధి వుంటే రాజకీయ - ఆర్థిక రిజర్వేషన్ కల్పించండి. దళితులు - బిసి లు నిజమైన అగ్రవర్ణ జాతులు కాదని నిరూపించే దమ్ము వుందా! మనుదర్మం ఆధారంగా ఒక అబద్దాన్ని నేటి దళితులపై - బిసిలపై అనాదిగా రుద్దుతూనే వున్నారు. అంబేద్కర్ నిజంగా దళితులు అంటరాని వారని పోరాడారా! హక్కులు కోసం పోరాడారా అనే నిజాన్ని దశబ్దలుగా దాచి పెట్టడం నిజం కాదా! ఆనాడే అంబేద్కర్ కుల రిజర్వేషన్స్ కాకుండా సంపదలో రిజర్వేషన్ అడిగి వుంటే నేడు సంపన్న వర్గాలుగా విర్రవీగుతున్న వారిలో అనేకులు కుల రిజర్వేషన్ కేటగిరిలో వుందురు. కాదంటారా! అంబేద్కర్ చేయని కుల ఉద్యమాన్ని నేడు ఆ మహానేతను అడ్డు పెట్టి మెజార్టీ సంపన్న వర్గాలు దళితులు - బిసిల శ్రమను దోచుకోవటం నిజం కదా! ఒక ప్రక్క కార్పొరేట్ మీడియా - మరో ప్రక్క కార్పొరేట్ రాజకీయ పార్టిలు - కొన్ని వ్యాపార కార్పొరేట్ దిగ్గజాల సుడిగుండంలో నలిగిపోతున్న దళిత, బిసి, మైనారిటీలు మేల్కొవాలి. సంపన్నులుగా అభివృద్ధి చెందాలి. నిజానికి కుల ఉద్యమాలు ప్రస్తుత సంపన్న వర్గాలకు లాభదాయక ముడి సరుకు వంటిది. కుల ఉద్యమాలు ఉన్నంత వరకు చంద్రబాబు - వై ఎస్ ఆర్ కుటుంబాలకు తిరుగులేదు. దళిత - బిసి లది గొప్ప చరిత్ర అయినప్పటికీ కొన్ని తరాలు ఒక అబద్దాన్ని తరాలు కొనసాగిస్తూనే వున్నారు. వారిని ఒక అంటరాని వారిగాను, వెనక బడిన వర్గాలుగాను ఆ వర్గాలు కుత్రిమంగా మానసిక వికలాంగులుగా బ్రతికేయటానికి అలవాటు పడిపోయేలా చేస్తూనే వున్నారు. కుల రిజర్వేషన్ లేకుంటే బ్రతుకుకు లేదేమో అనే అపోహను కార్పొరేట్ రాజకీయ పార్టిలు కార్పొరేట్ మీడియా సంస్థలతో కుత్రిమ ప్రచారం చేయనే వున్నార . నిజానికి రిజర్వేషన్ కులానికి కాదు సంపదకు అని తెలుసుకున్న నాడు ఈ కార్పొరేట్ రాజకీయ, మీడియా వర్గాలకు నేపాల్, శ్రీ లంక పరిస్థితులు తప్పవన్నారు. దళితులు - బిసిల చరిత్ర కోసం చెప్పటానికి ఏ ఒక్క మీడియా లేదు. పురాతన గ్రంథాలాయాల్లో వారి చరిత్రను నేడు కనపడనీయరు. దళితుల్లోను - బిసి ల్లోను క్షత్రియ తెగలు వున్నాయి. ఆ గొప్ప వైభవం మాకు వద్దు, మా బిడ్డలకు వద్దు మాకు కుల రిజర్వేషన్స్ మాత్రమే కావాలి అనే విధంగా ఒక అబద్దాన్ని అనాదిగా నడిపిస్తున్నారు. దళిత - బిసి - మైనార్టీల శ్రమను దోచుకుంటున్నారు. మేధావులు దృష్టి సారిస్తే కుల ఉద్యమాలు, కుల రిజర్వేషన్స్ తో ఇప్పటి వరకు కోల్పోయినది . భవిష్యత్ లో నష్ట పోయేది అర్థమవుతుంది. ప్రస్తుతం బిసిల అట్రాసిటీ చట్టం, ముసాయిదా బిల్లు చాక్లెట్ చేతికి ఇచ్చి మొత్తం భవిష్యత్‌ను దోచుకోవటం వంటిది. బిసిల ముసాయిదా బిల్లు అంతర్గత కుట్రను లోతుగా పరిశీలిస్తే చరిత్ర రహిత సంపన్న కార్పొరేట్ శక్తుల కాలకుట విష పూరిత కుట్ర అర్థం అవుతుంది. ఈ బిసి ముసాయిదా బిల్లు లక్ష్యం నిజాన్ని నమ్మనీయదు. భవిష్యత్ ను కాపాడుకోనీయదు . ఈ బిల్లు బిసి ల భవిష్యత్ ను పెరగనీయదు . అలా అని బ్రతకనీయదు. నిత్యం పేదరికం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తోనే జీవితం ఉంటూనే ఉంటుంది. బ్రతకనీయదు. చావనీయదు. కుమిలిపోతు చరిత్ర లేని పాలకుల దయా దాక్షిణ్యాలపై చేతులు చాచి అర్జీస్తు మన రాజకీయ కట్టప్ప వలే బ్రతకటమే ఈ ముసాయిదా బిల్లు ఆంతర్యాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కుట్ర అంత సులువుగా కొన్ని వర్గాల మేధావులకు అర్థం కాదు. మొత్తం జీవితం చంకనాకి పోయినా అర్థం కాకపోవచ్చును . నమ్మకమైన నాయకత్వమే దళిత, బిసి, మైనార్టీ ల భవిష్యత్ కు బంగారు బాటగా నిలుస్తుంది. ప్రస్తుతం చెప్పుకుంటున్న కుల కేటగిరి ల మూలంగా లబ్ధి పొందింది ఏమైనా వుందా! అని ఆత్మ విమర్శ చేసుకోవాలి. నష్ట పోయింది. నష్ట పోతుంది ఏమిటో ఇప్పటికైనా గమనించగలరా! సంపద, పాలన, గత వైభవ చరిత్ర దళిత, బిసి లదని గుర్తించండి. నేటి పాలక వర్గాలది ఆది ఆంకుర నాటి అంటరాని వారాని, సంపద లేని కటిక పేదలు అనే ఆది అస్పృస్యులనే నిజాన్ని గ్రహించే రోజులు ఆ వర్గాల మదిలోనే వుందని గ్రహించి బిడ్డల భవిష్యత్ కు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. అంటరాని తనం, వెనుకబడిన తనం నేడు సంపద తోనే వుంది. కుల, వంశ చరిత్రతో పని లేదు. మాదిగలు ఆది చరిత్రలో క్షత్రియులు గాను, మాలలు యుద్ధ యోధులు గాను, బిసిల్లో అనేకులు క్షత్రియులు, ప్రకృతి మెచ్చిన వర్ణాలుగాను వారి ఆది చరిత్ర చెబుతుంది. ప్రస్తుత పాలకులకు ఏ గొప్ప చరిత్ర వుందో, వాటి ఆదారాలను చెప్పగలరా ! అబద్దపు చరిత్రకు రంగు పూయటం తప్ప మరొకటి లేదు.. పాలకుల కుట్రలో బిసి లు బలిపశువులుగా మారుతున్నారు. ఇప్పటివరకు బీసీ లు వెంకబడిన వారిగా వున్నారు. అట్రాసిటీ ముసాయిదా బిల్లు కారణంగా ఇక నుండి అంటరాని వారిగా వివక్షలకు గురవుతూనే వుంటారు. ఆ ప్రభావం బిసి వర్గాల బిడ్డలపై పడుతూనే ఉంటంది. నిరంతరం వివక్షకు గురవుతూనే వుంటారు. నాడు దళితుల పై జరిగిన విష పాచిక నేడు బిసి లపై ప్రయోగించే కుట్ర జరుగుతుంది. పాలక వర్గాలు, పాలకుల బిడ్డలు సంపదలో జీవిస్తుంటారు. దళితులు, బిసి, మైనార్టీలు అంటరాని వారిగాను, వెనకబడిన వారిగాను అసంతృప్తి జీవితాలకు బానిసలుగా మారటం తప్ప మరో మార్గం ఉండదు. బిసిలకు ఎవరు అడిగారు. అట్రాసిటీ ముసాయిదా బిల్లును పాస్ చేయమని ఎవరు అడిగారు ఈ కూటమి సర్కార్‌ను బిసిలకు గేలం వేటమే లక్ష్యంగా రాజ్యాంగ చట్ట బద్దత లేని ముసాయిదా బిల్లుతో బిసిల భవిష్యత్‌పై కుట్ర చేస్తున్నారు. బిసిల భవిష్యత్‌పై జరుగుతున్న ఈ కుట్రకు సంబందించి చర్చించగల ఏ పాలక మేధావి తోనైనా నేను చర్చకు సిద్దం.. చర్చకు సిద్దపడే దమ్మున్న పాలక మేధావులకు మేడా శ్రీనివాస్ బహిరంగ సవాల్ చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్లుకు

# భవన నిర్మాణ కార్డు ఉండి దిక్కుతోచని పరిస్థితి

**అయ్యా మంత్రి ..కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ ఎప్పుడూ చేస్తారు...? : బొజ్జా రామకృష్ణ ఆవేదన**
**గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఎలక్ట్రిషన్ డే వేడుకలు - ఎలక్ట్రిషన్ సోదరులు నగరంలో ర్యాలీ**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అయ్యా మంత్రి ..కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ ఎప్పుడూ చేస్తారు..అని బొజ్జా రామకృష్ణ పేర్కొన్నారు.గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఎలక్ట్రిషన్ డే సందర్భంగా స్థానిక విక్రమ హాల్ నుండి మంగళవారం ఉదయం తీన్మార్ దప్పులతో గోకవరం బస్టాండ్, దేవిచౌక్,కంబాల చెరువు మీదుగా రాజా థియేటర్, క్వారీ మార్కెట్ శ్రామిక భవనం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్తును కనిపెట్టినటువంటి మరియు బల్బును కనిపెట్టి ప్రపంచానికి వెలిగినిచ్చిన థామస్ అల్వా ఎడిసన్ వారి చిత్రపటానికి పూలమాలవేసి ఎలక్ట్రికల్ వృత్తిలో లక్షలాది మందికి ఉపాధి కల్పించిన మహానుభావుడు అలాగే ఆంధ్రప్రదేశ్లో ఉన్నటువంటి ఎలక్ట్రికల్ వర్కర్లు భవన నిర్మాణ కార్డు ఉండి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని కాబట్టి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ జనవరి సంక్రాంతి కానుకగా భవన నిర్మాణ కార్మికులందరికీ మూడు బెనిఫిట్స్ విడుదల చేస్తామన్నారు.ఈరోజు వరకు కూడా ఏ విధమైన కార్మికులకు బెనిఫిట్ రాలేదు.

**మా యొక్క డిమాండ్స్:**

క్వారీ మార్కెట్ అన్న క్యాంటీన్ వెనుక ఉన్న శ్రామిక భవనం పనులు ప్రారంభించాలి,సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేయాలి,చెస్ విధానాన్ని కార్మికులకే వర్తింప చేయాలి,కార్మికులకు మ్యారేజ్ స్కీం అమలు చేయాలి,కార్మికుడు భార్యాగాని కూతురు గాని డెలివరీ అయినచో డెలివరీ స్కీమ్ అమలు చేయాలి, కార్మికులకు యాక్సిడెంట్ అయినచో పరిహారం అందజేయాలి, కార్మికుడు సహజ మరణం అయినచో పరిహారం అందజేయాలి, కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి, కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించాలి, కార్మికులకు సంబంధించి 46 వేల క్లయిన్స్ నిలిచిపోయి ఉన్నవి అవి వెంటనే విడుదల చేయాలి, కార్మికులు పేరు చెప్పి ప్రభుత్వం చెస్ విధానాన్ని వసూలు చేస్తున్నటువంటి సొమ్మును కార్మికులకు వర్తింప చేయాలి, కార్మికులకు టూల్ కిట్స్ అందజేయాలి,నగరపాలక సంస్థ ద్వారా కార్మికులకు మెప్మా లోన్లు వెంటనే రిలీజ్ చేయాలి. ప్రభుత్వం మా యొక్క డిమాండ్స్ ను నెరవేర్చని పక్షంలో ఫిబ్రవరి నుండి రోడ్లపైకి వచ్చి మా యొక్క నిరసనను తెలియజేస్తామని ప్రభుత్వానికి విన్నవించుకుంటామని అధ్యక్షులు బొజ్జ రామకృష్ణ తెలియచేశారు. కార్యక్రమంలో పలువురు ఎలక్ట్రిషన్ సోదరులకు శాలువల కప్పి పూలమాలలతో జ్ఞాపకం అందజేసి సత్కారాల అందించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఎలక్ట్రిషన్ సోదరులు, పలు ట్రేడ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో

# కార్మికులందరూ ఆనందంగా ఉన్నాం..

**ది న్యూ రాజమండ్రి ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డే వేడుకలు**
**త్వరలో కార్మిక సంక్షేమ భవనం పూర్తి చేస్తాం : సీనియర్ టిడిపి నాయకులు నక్కా చిట్టిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతిరోజు ఉదయించే సూర్యుడు వెలుతురు ప్రసరింపజేస్తాడని, అలాగే ఎలక్ట్రీషియన్ కూడా మన జీవితంలో ముఖ్యపాత్ర పోషిస్తూ మనకు వెలుతురు ప్రసరింప చేస్తున్నాడని సీనియర్ టిడిపి నాయకులు నక్కా చిట్టిబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక రజక కమ్యూనిటీ హాల్ నందు ది.న్యూ రాజమండ్రి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రీషియన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. థామస్ అల్వా ఎడిసన్ 1879లో విద్యుత్ బల్బును కనుగొన్నారని, ఆరోజున పురస్కరించుకుని ఎలక్ట్రిషన్లు అందరూ ఎలక్ట్రిషియన్ డే జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. 2014 తెలుగుదేశం ప్రభుత్వంలో హయంలో సంక్షేమ బోర్డుకు 1400 కోట్ల రూపాయలు ఉండేదని తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో ఆ నిధులను ఇతరత్రా వాటికి ఖర్చు చేశారని దుయ్యబట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి పని దొరుకుతుందని కార్మికులందరూ ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. త్వరలో కార్మిక భవనాన్ని పూర్తిచేసేందుకు ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రీషియన్ అందరకు శుభాకాంక్షలు తెలియజేశారు. ది.న్యూ రాజమండ్రి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ తాము అసోసియేషన్ ఏర్పాటు చేసి ఏడు సంవత్సరాలవుతుందని ఏడు సంవత్సరాల నుండి నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్లు అందరూ ఐక్యతతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొమండూరి గణేష్ బాబు ప్రధాన కార్యదర్శి పత్తి మహేష్ (శివ), కార్యదర్శి మరడ పరశురాం,కోశాధికారి కొండపల్లి సతీష్ కుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లులు, ట్రూ అప్ చార్జెస్ సమస్యలపై వినతులు స్వీకరణ




**రాజమహేద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఆఖరి రోజైన మంగళ వారం తూర్పుగోదావరి సర్కిల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ బిల్లులు, ట్రూ అప్ చార్జీలకు సంబంధించిన సమస్యలను న్యాయవాది డి.వెంకటేశ్వరరావు తెలియచేయడం జరిగిందని ఏపీఈపి డీసీఎల్ ఎస్ ఈ కే.తిలక్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రూ అప్ చార్జెస్ అంశంలో ముఖ్యంగా అద్దెకు నివసించే వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.గతంలో అదే ఇంటిలో నివసించిన వినియోగదారులు వినియోగించిన అధిక విద్యుత్ వినియోగం కారణంగా ఏర్పడిన ట్రూ అప్ చార్జీలు ప్రస్తుతం అద్దెకు నివసిస్తూ తక్కువ విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులపై భారం పడుతున్నందున అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని వివరించారు.ఈ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని ఆయన ఏపీఈఆర్సీ ను కోరారు. దీనిపై స్పందించిన ఏపీఈఆర్సీ చైర్మన్ ఈ అంశాన్ని సానుకూలంగా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

# చీరకు నిప్పు అంటుకుని మహిళ మృతి

**ఎస్సై శ్రీనివాస్**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ గోనగూడెం గ్రామానికి చెందిన కొయ్య గరటమ్మ(65) ఈనెల 23వ తేదీన తెల్లవారుజామున తన ఇంటి పొయ్యి వద్ద చలిమంట కాగుతుండగా ప్రమాదవశాత్తు చీరకొంగుకు నిప్పు అంటుకుని శరీరమంతా కాలిందని, రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ 26వ తేదీన చనిపోయినట్లు కోరుకొండ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతురాలి భర్త పుష్పరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామన్నారు. 27వ తేదీ మంగళవారం ఉదయం దోసకాయపల్లి గ్రామానికి చెందిన మేక త్రిమూర్తులు(42) పొలంలో పనసకాయలు కోస్తుండగా చెట్టు పైనుండి ప్రమాదవశాత్తు చెట్టు నుంచి జారిపడి చనిపోయాడని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించమన్నారు.

పార్టీలో కష్టపడి పనిచేసినవారే

# నేడు పదవులు దక్కించుకున్నారు

**బిజెపి నియోజకవర్గ నాయకుడు నీరుకొండ**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా 2024లో జరిగిన ఎన్నికల్లో బిజెపి శ్రేణులు కూటమి గెలుపునకు ఎంతో కష్టపడి సహకరించారని రాజానగరం నియోజకవర్గ బిజెపి సీనియర్ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. వెదుళ్ళపల్లి గ్రామంలో ఆయన నివాసం వద్ద పార్టీ కోసం సేవలు అందించిన గూడపాటి జయరాం మరియు పెరుగు శ్రీనివాస్ తూర్పుగోదావరి జిల్లా బిజెపి వర్కింగ్ కమిటీ నెంబర్లుగా నియమించ బడ్డారని,పాలడుగుల శ్రీవిద్య తూర్పుగోదావరి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా,మట్టాడి వెంకటరమణ రాష్ట్ర ఎస్సీ మోర్చా సెక్రటరీగా,దాసరి సుబ్బారావు జిల్లా ఓబీసీ మీడియా సెల్ నాయ కుడిగా,పి ఆషీష్ జిల్లా సోషల్ మీడియా మెంబర్ గా ఉన్నత స్థాయి నాయకుల ఆదేశాల మేరకు నిమతులయ్యారని వీరన్న చౌదరి విలేకరులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే నూతనంగా పదవులు దక్కించుకున్న వారిని సాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీరన్న చౌదరి మాట్లాడుతూ బిజెపి పార్టీ రాష్ట్రంలోనే కాకుండా రాజానగరం నియోజక వర్గంలో బలమైన కేడర్ గా నిలబడిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరొక 15 ఏళ్ల పాటు బిజెపి పార్టీ కేంద్రంలో అగ్రస్థానంలో ఉంటుందని అన్నారు. రాజానగరం నియోజకవర్గ బిజెపి నాయకులకు కార్యకర్తలకు కేంద్ర కమిటీ నాయకులు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ బిజెపి పార్టీ బలోపేతానికి అలుపెరుగని ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని తెలిపారు. సీతానగరం మండలంలో ఉత్సాహంగా పనిచేస్తున్న వారికి రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రత్యేక స్థానం దక్కుతుందని గుర్తు చేశారు. ఇప్పటికే రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా బిజెపి నాయకులు సభ్యత్వాల విషయంలో ఒక అడుగు ముందే ఉన్నారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బిజెపి పార్టీ స్త్రీలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించిందని అన్నారు. గెలుపు కోసం పని చేసిన వారికి కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రతి జిల్లాలో బిజెపి పార్టీకి 10% పదవులు దక్కుతాయని అన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం దేశ ముద్దుబిడ్డ నరేంద్ర మోడీ రేషన్ బియ్యం,గోకులంలో షెడ్లు,జల్ జీవన్ మిషన్ పనికి ఆహార పథకం, పెన్షన్లు, రైతులకు అందించే యూరియాలో రాయితీ వంటి ఇలా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి,మండల జనరల్ సెక్రటరీ నాళం లక్ష్మణరావు,మండల ఉపాధ్యక్షురాలు కోట కృష్ణకుమారి,మహిళా కార్యదర్శి కె లక్ష్మి,సాంబేలపు బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్‌కు మండపేటలో

# రూపుదీద్దుకున్న జాట జులం నాగ సర్పలు

**ప్రముఖ శిల్పి వాస శ్రీనివాస్**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణానికి చెందిన రామకృష్ణ బ్రాస్ & సిల్వర్ వర్క్ అధినేత ప్రముఖ శిల్పి వాస శ్రీనివాస్ వారి బృం దం రూపు దిద్దిన ఈ జటాజులం నాగసర్పాలను ఉత్తరప్రదేశ్‌లో నైమిశారణ్యము క్షేత్రంలో శ్రీ పంచ శివలింగేశ్వర మందిరంలో ప్రతిష్టించనున్నారు. ఈ నాగ సర్పల తయారీకి 2,20,000/- ఖర్చు అయినట్టు శ్రీనివాస్ తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తారీఖున శ్రీ పంచ శివలింగేశ్వర మందిరం మూడో వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా అందజేయినట్టు తెలిపారు. ఏలూరు జిల్లా కైకలూరు వాస్తవ్యులు కొణిజేటి శ్రీనివాసరావు వెంకటా ఆదిలక్ష్మి దంపతులు శ్రీ పంచ శివలింగేశ్వర మందిరంలో ప్రతిష్టించనట్లు తెలిపారు. బ్రాస్ వర్క్‌లో చిన్నతనం నుంచే నైపుణ్యం సంపాదించిన శ్రీనివాస్, రాగి, ఇత్తడి, పంచలోహాలతో అనేక రకాల దేవతా విగ్రహాలను తయారు చేసి విశేష ఖ్యాతి గడించారు. తిరుపతి, విజయవాడ, కాశీ వంటి మహా పుణ్యక్షేత్రాల్లో ఆయన రూపొందించిన విగ్రహాలు కొలువుదీరాయి.

# తాను మరణించి.. ఆరుగురికి ప్రాణదానం చేసిన ఇంజనీరింగ్ విద్యార్థి!



తాడికొండ మండలం నిడు ముక్కల వద్ద గత శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరు చనిపోగా మరో నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. అయితే బైక్ పై ప్రయాణిస్తున్న ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. చలపతి ఇంజనీరింగ్ కాలేజ్ లో బీటెక్ చదువుతున్న అమర్ బాబు కాలేజ్ విద్యార్థులతో బైక్ పై వెళు తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో గాయపడిన తెనాలి మండలం పిన పాడుకు చెందిన అమర్ బాబును ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. దీంతో జీవన్ దాన్ కోఆర్డినేటర్లు అమర్ బాబు కుటుంబ సభ్యులను సంప్రదించారు. అవయవ దానం చేయాలని సూచించారు. అమర్ బాబు అవయవాలతో మరో ఆరు గురికి ప్రాణదానం చేయవచ్చని చెప్పారు. మానవతా ద్రుక్పథంతో ముందుకు రావాలన్నారు. జీవన్ దాన్ కోఆర్డినేటర్లతో పాటు వైద్యులు అమర్ బాబు కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో అవయవ దానం చేసేందుకు ఒప్పుకున్నారు. జీవన్ దాన్ ట్రస్ట్ నిబంధనల ప్రకారం గుండెను తిరుపతి తరలించేందుకు వైద్యులు సిద్ధమయ్యారు. గుంటూరు రమేశ్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స ద్వారా గుండెను తొలగించి గ్రీన్ ఛానల్లో తిరుపతి పంపించారు. రమేశ్ ఆసుపత్రి నుండి గుండెను తరలిస్తున్న సమయంలో అమర్ బాబు బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకొని అమర్ బాబు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ గన్నవరం ఎయిర్ పోర్టుకు తరలించారు. అక్కడ నుండి తిరుపతికి ఫ్లైట్ లో గుండెను పంపించారు. ఇక లివర్, కిడ్నీలను గుంటూరు రమేష్ ఆసుపత్రిలోనే ట్రస్ట్ నిబంధనలు మేరకు ఇతరులకు దానం చేశారు. అవయవదానంతో మరో ఆరుగురు ప్రాణం ఇవ్వచ్చని బ్రెయిన్ డెత్ కేసుల్లో కుటుంబ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఇక తెనాలి ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ పినపాడులోని కుటుంబ సభ్యులను పరామర్శించి మానవతా ద్రుక్పథంతో అవయవ దానం చేసిన వారిని కొనియాడారు. పెద్ద మనస్సుతో అవయవ దానం చేయడంతో కొంతమంది జీవితాల్లో వెలుగులు నింపినట్లైందన్నారు.

# చిన్న వ్యాపారులకు పెద్ద ఆఫర్ ఇస్తున్న అమెజాన్..




చిన్న వ్యాపారులకు అమెజాన్ బిజినెస్ ఆఫర్ అందిస్తోంది. ఇంటి నుంచి పని చేస్తూ తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అమెజాన్ చిన్న వ్యాపారులకు తోడ్పాటును అందిస్తోంది. ఇలాంటి వారి కోసం అమెజాన్ ఒక పెద్ద ఆఫర్ తో.. మీరు సొంతంగా వస్తువులను ఉత్పత్తి చేసుకుని స్థానికంగా ఉన్న వినియోగదారులకు మీ ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతున్నారా? లేదా సొంతంగా ఈ-కామర్స్ విధానంలో వస్తువులు, సేవలను కొనుగోలు చేయటం అమ్మకాలు జరపటం వంటి కార్యకలాపాలు చేస్తుంటారా? ఇలాంటి వారి కోసం అమెజాన్ ఒక పెద్ద ఆఫర్ తో ముందుకు వచ్చింది. ఈ కామర్స్ బిసినెస్ లోని ఇండిపెండెంట్ విక్రేతలకు సరికొత్త అవకాశాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎలాంటి కోడింగ్ పరిజ్ఞానం లేక పోయినా సొంతంగా ఎవరికి వారు స్వంత వెబ్‌సైట్లు ఉచితంగా తయారు చేసుకునే విలు కల్పించింది. ఇందుకోసం 'స్మార్ట్‌బిజ్' అనే టూల్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చింది. దీని ద్వారా వస్తు, సేవల విక్రేతలు తమ తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించుకోవచ్చు. కరోనా తరువాత చాలా మంది ఇంటి నుంచి పని చేయటం ప్రారంభించారు. చేతి వృత్తి కళాకారులు పలు రకాల వస్తువులను తయారు చేస్తున్నారు. పెయింటింగ్స్ నుంచి ఆహారపదార్థాల వరకు చాలా మంది స్థానిక బ్రాండ్స్‌తో పరిమితమైన ప్రాంతానికే తమ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇపుడు ఇలాంటి వారు తమ పరిధిని విస్తరించటానికి ముఖ్యంగా స్టార్ట్ అప్?తో ముందుకు వచ్చే వారికి మేలు జరిగే అవకాసం ఉందని మేకేట్ వర్గాలు భావిస్తున్నాయి. ఏం ఎస్ ఏం ఈ లతో పాటు చిన్న చిన్న వ్యాపారులు డైరెక్ట్-టు-కస్టమర్ మోడల్‌లోకి ప్రవేశించే అవకాశం కలుగుతుంది. ఇది మంచి వెసులు బాటుగా ఉంటుంది. వెబ్‌సైట్ల హోస్టింగ్, పేమెంట్లు, వస్తువుల ఆర్డర్స్ నిర్వహణతో పాటు కీలకమైన లాజిస్టిక్ సపోర్ట్ దొరుకుతుంది.

# భారతదేశం-ఇయు మధ్య స్వేచ్ఛ వాణిజ్యం..

భారతదేశం - యూరప్ మధ్య ధృఢమైన భాగస్వామ్యం ఏర్పడబోతుంది. ఇయు - భారతదేశం మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం ఎంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ ఒప్పందం రెండింటి మధ్య అనేక ప్రయోజనాలు చేకూరుతాయని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల ఏ భారతీయ రంగాలు ప్రయోజనం పొందుతాయి? ముందున్న సవాళ్లు ఏమిటి? తెలుసుకుందాం..

భారతదేశం 77వ గణతంత్ర దినోత్సవానికి యూరోపియన్ యూనియన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయన్, యూరోపియన్ కమిషన్ అధికారులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించింది. ఈ వేడుక తర్వాత వెంటనే భారతదేశం -- ఇయు మధ్య వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయనున్నారు. వాణిజ్య ఒప్పందం ఖరారు అయితే, భారతదేశం దాని అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన యునైటెడ్ స్టేట్స్‌తో సంబంధాలు తగ్గించుకోవచ్చు. యూరోపియన్ దేశాలతో పెద్ద మార్కెట్ కొనసాగించడానికి భారతదేశానికి ఈ ఒప్పందం ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. ఈ మొత్తం పరిణామం మధ్య, భారతదేశం - యూరప్ మధ్య ధృఢమైన భాగస్వామ్యం ఏర్పడబోతుంది. ఇయు - భారతదేశం మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం ఎంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ ఒప్పందం రెండింటి మధ్య అనేక ప్రయోజనాలు చేకూరుతాయని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల ఏ భారతీయ రంగాలు ప్రయోజనం పొందుతాయి? ముందున్న సవాళ్లు ఏమిటి? తెలుసుకుందాం..

**పెట్రోలియం ఉత్పత్తులు:** భారతదేశ ఎగుమతుల్లో అతిపెద్ద విభాగంగా ఉన్నాయి. ఇవి దాదాపు 17% వాటా కలిగి ఉన్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఈ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరిగాయి.

**ఫార్మాస్యూటికల్స్ - రసాయనాలు:** భారతదేశం ఎగుమతుల్లో మందులు (ముఖ్యంగా జనరిక్ మెడిసిన్స్), రసాయనాలు 15% వాటా కలిగి ఉన్నాయి. భారతదేశం ప్రపంచ ఫార్మసీగా పరిగణిస్తారు. యూరోపియన్ యూనియన్?కు ఎగుమతుల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

**ఎలక్ట్రానిక్ వస్తువులు:** ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో దాదాపు 11% వాటా కలిగి ఉంది. ఇటీవలి సంవత్సరాలలో ఈ రంగం గణనీయమైన వృద్ధిని సాధించింది.

**వస్త్రాలు - రెడీమేడ్ దుస్తులు:** దుస్తులు, పాదరక్షలు, తోలు ఉత్పత్తులతో సహా ఎగుమతుల్లో వస్త్ర పరిశ్రమ 10% వాటా కలిగి ఉంది.

**యంత్రాలు -పరికరాలు:** యంత్రాలు, విద్యుత్ పరికరాల ఎగుమతులు కూడా మొత్తం ఎగుమతుల్లో 10% వాటా కలిగి ఉన్నాయి.

**లోహాలు - ఖనిజ ఉత్పత్తులు:** ఇందులో ప్రధానంగా ఇనుము, ఉక్కు, అల్యూమినియం వంటి మూల లోహాలు, ఖనిజ ఉత్పత్తులు ఉన్నాయి.

**ఇతర రంగాలు:** భారతదేశం జుఖకి రత్నాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులను కూడా ఎగుమతి చేస్తుంది.

**సేవల రంగం:** భారతదేశం జుఖకి గణనీయమైన సేవా రంగ ఎగుమతులను కలిగి ఉంది. భారతదేశం సేవా ఎగుమతుల్లో ఎక్కువ భాగం సమాచార సాంకేతికత, డిజిటల్ సేవల నుండి వస్తుంది. ఇంజనీరింగ్, కన్సల్టింగ్, ఇతర నైపుణ్య-ఆధారిత సేవలలో కూడా భారతదేశం ప్రముఖ దేశం.

**ఎలక్ట్రానిక్స్:** ఇది జుఖ నుండి భారతదేశం మొత్తం దిగుమతుల్లో అతిపెద్ద వాటాను కలిగి ఉంది. ఇది దాదాపు 25%. యూరోపియన్ కంపెనీల నుండి హై-ఎండ్ ఎలక్ట్రానిక్స్‌కు భారతదేశంలో బలమైన డిమాండ్ ఉంది.

**యంత్రాలు - పరికరాలు:** ఇది మొత్తం దిగుమతుల్లో దాదాపు 20% ఉంటుంది. ఇందులో పారిశ్రామిక యంత్రాలు, విద్యుత్ పరికరాలు ఉన్నాయి.

**రసాయనాలు - ఔషధాలు:** యూరోపియన్ ఔషధ కంపెనీలు వివిధ ఔషధ సూత్రీకరణల కోసం రసాయనాలు, మందులను భారతదేశానికి ఎగుమతి చేస్తాయి. ఈ రంగం భారతదేశానికి జుఖ మొత్తం ఎగుమతుల్లో దాదాపు 12% వాటాను కలిగి ఉంది.

**రవాణా పరికరాలు, విమానాలు:** ఇయు విమానాలు, వాటి విడిభాగాలను భారతదేశానికి ఎగుమతి చేస్తుంది. ఇది దాదాపు 8% వాటాను కలిగి ఉంది. ఎయిర్?బస్ వంటి విమానయాన సంస్థలు ఈ రంగంలో అత్యంత ముఖ్యమైన ఎగుమతిదారులు.

**ఆటోమొబైల్స్ విడిభాగాలు:** ఇయు ఎగుమతుల్లో ఆటోమొబైల్స్ , ఆటో విడిభాగాలు దాదాపు 4% వాటా కలిగి ఉన్నాయి. మెర్సిడెస్, వోక్స్‌వ్యాగన్ వంటి కంపెనీలు భారతదేశానికి ఎగుమతుల్లో గణనీయమైన పాత్ర పోషిస్తాయి.

**ప్లాస్టిక్స్:** భారతదేశానికి జుఖ ఎగుమతులకు ఇది కూడా ఒక ముఖ్యమైన రంగం. ఈ ఉత్పత్తిపై భారతదేశం సుమారు 10.4% సుంకం విధిస్తుంది. దీని గురించి ఖీూాలో చర్చించవచ్చు.

**వైన్ - స్పిరిట్స్:** ప్రస్తుతం, భారతదేశం ఈ ఉత్పత్తులపై 150-200% అధిక దిగుమతి సుంకం విధిస్తోంది. జుఖ ఈ సుంకాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తోంది.

**పాల ఉత్పత్తులు:** ఇయు కూడా జున్ను, ఇతర పాల ఉత్పత్తులకు రాయితీలు కోరుతోంది. అయితే భారతదేశం వ్యవసాయం, పాల రంగాలను సున్నితంగా పరిగణించి ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నుండి వీటిని మినహాయించింది.

## ఈ ఒప్పందం కుదిరితే ఎవరికి ప్రయోజనం..?



**సేవల ఎగుమతులు:** 2023లో, భారతదేశానికి ఇయు సేవల ఎగుమతులు సుమారు వి30 బిలియన్లు. వీటిలో ప్రధానంగా ఇంజనీరింగ్, కన్సల్టింగ్, టెలికాం, మేధో సంపత్తి ఆధారిత సేవలు ఉన్నాయి. ఇదిలావుంటే, భారతదేశం - యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం 2007లో అధికారికంగా చర్చలను ప్రారంభించాయి. దీనిని తరువాత విస్తృత-ఆధారిత వాణిజ్యం, పెట్టుబడి ఒప్పందంలి అని పిలుస్తారు. ఆరు సంవత్సరాలుగా అనేక రౌండ్ల చర్చలు జరిగాయి. కానీ కార్లు, వైన్‌లపై సుంకాలు, మేధో సంపత్తి హక్కులు, డేటా రక్షణ వంటి అంశాలపై తీవ్ర విభేదాల కారణంగా 2013లో చర్చలు నిలిచిపోయాయి. 2021 మేనెలలో చర్చల పునఃప్రారంభం అయ్యాయి. సమతుల్య, ప్రతిష్టాత్మకమైన, సమగ్ర వాణిజ్య ఒప్పందం కోసం చర్చలను తిరిగి ప్రారంభించడానికి ఇయు - భారతదేశ నాయకులు అంగీకరించారు. 2022 జూన్-జూలైలో అధికారిక చర్చలు ప్రారంభమయ్యాయి. దాదాపు తొమ్మిది సంవత్సరాల విరామం తర్వాత, పునరుద్ధరించిన రాజకీయ నిబద్ధతతో చర్చలు అధికారికంగా తిరిగి ప్రారంభమయ్యాయి. 2023లో వాణిజ్య - సాంకేతిక మండలిని స్థాపించడం జరిగింది. 2023 ఫిబ్రవరిలో, డిజిటల్ పరివర్తన, గ్రీన్ టెక్నాలజీలు, వాణిజ్యంపై సహకారాన్ని పెంపొందించడానికి రెండు వైపులా కొత్త వాణిజ్య, సాంకేతిక మండలిని స్థాపించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ సంయుక్తంగా 2025 చివరి నాటికి చర్చలను ముగించడానికి రెండు వైపులా కృషి చేయాలని అంగీకరించారు. చర్చలు చివరి దశలో ఉన్నాయని, అవి చారిత్రాత్మక ఒప్పందం అంచున ఉన్నాయని ఉర్సులా వాన్ డెర్ లేయన్ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో ప్రకటించారు. ఎఫ్‌టిఎలో అందుబాటులో ఉన్న తాజా సమాచారం ప్రకారం, ఒప్పందంలోని మొత్తం 24 అధ్యాయాలలో 20 నవంబర్-డిసెంబర్‌లో అంగీకరించినట్లు ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలోనే జనవరి 27, 2026 మంగళవారం రోజున 16వ ఇండియా-యూరోపియన్ యూనియన్ సమ్మిట్ సందర్భంగా ఈ ఒప్పందాన్ని అధికారికంగా ప్రకటించి,దా సంతకం చేసే అవకాశం ఉంది. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దాని పరిమాణం, ఆర్థిక ప్రభావం పరంగా అపారమైనదిగా భావిస్తున్నారు. దీనిని భారత వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అన్ని ఒప్పందాలకు మూలంగా అభివర్ణించారు.

భారతదేశం - ఇయు మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సుంకాలను, దిగుమతి సుంకాలు తగ్గించడాకే పరిమితం కాదు. ఈ ఒప్పందం 24 అధ్యాయాలను కలిగి ఉంది. వస్తువులు, సేవలు, పెట్టుబడి రక్షణ, సాంకేతిక బదిలీ, డిజిటల్ నిబంధనలు, నియంత్రణ సహకారం వంటి సంక్లిష్ట అంశాలను కవర్ చేస్తుంది. జుఖ భారతదేశంలో ప్రముఖ విదేశీ పెట్టుబడిదారుగా కూడా ఉంది. దాని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి స్టాక్ 2023లో 140.1 బిలియన్ యూరోలకు చేరుకుంది. ఈ ఒప్పందం క్లీన్ ఎనర్జీ, ఫార్మాస్యూటికల్స్, అధునాతన తయారీ వంటి రంగాలలో పెట్టుబడులను మరింత పెంచుతుందని భావిస్తున్నారు.

భారతదేశం - ఇయు ఏమి పొందుతాయి?

27 యూరోపియన్ దేశాలలో దాదాపు 450 మిలియన్ల అధిక ఆదాయ వినియోగదారులకు భారత ఎగుమతిదారులు చాలా తక్కువ సుంకాలతో ప్రాధాన్యతను పొందుతారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశంలోని శ్రమతో కూడిన రంగాలు, ముఖ్యంగా వస్త్రాలు, ఔషధ పరిశ్రమ, సేవలు, నిపుణులు ప్రయోజనం పొందుతారు. జుఖ ప్రస్తుతం వి125 బిలియన్ల విలువైన వస్త్రాలు, దుస్తులను దిగుమతి చేసుకుంటుంది. ఇందులో భారతదేశం వాటా 5% నుండి 6% మాత్రమే. మరోవైపు, చైనా మార్కెట్ వాటా 30%, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల సంయుక్త మార్కెట్ వాటా 20%. వాస్తవానికి, జుఖ నుండి సున్నా సుంకాల నుండి బంగ్లాదేశ్, పాకిస్తాన్ ప్రయోజనం పొందుతున్నాయి. ఖీూా ఈ సుంకాలను తొలగించి భారతదేశాన్ని వాటితో సమానంగా మార్చే అవకాశముంది. దీని ప్రభావం ఏమిటంటే, ఖూ 50% సుంకం కారణంగా నష్టాలను చవిచూస్తున్న భారతీయ వస్త్ర పరిశ్రమ తన ఉత్పత్తులను విక్రయించడానికి కొత్త మార్కెట్లు తెరుచుకున్నట్లు అవుతుంది. అలాగే, పాదరక్షలు, తోలు వస్తువులు, రత్నాలు, ఆభరణాలు వంటి రంగాలు తక్కువ సుంకాలు, మెరుగైన మార్కెట్ యాక్సెస్ కారణంగా ఎగుమతుల్లో పెద్ద ఊపును పొందుతాయి. భారతీయ ఫార్మాస్యూటికల్ కంపెనీలకు ప్రధాన ప్రయోజనం సుంకాల తగ్గింపులలోనే కాకుండా, నియంత్రణ అడ్డంకులను తగ్గించడం, ప్రమాణాల పరస్పర గుర్తింపులో కూడా ఉంది. ఇది భారతీయ జెనరిక్ మందులు, స్పెషాలిటీ కెమికల్స్ యూరోపియన్ మార్కెట్‌లోకి మరింత సులభంగా ప్రవేశించడానికి వీలు కల్పిస్తుంది. ఇక భారతదేశం తన ఐటి, ఇంజనీరింగ్, వైద్య నిపుణుల కోసం జుఖకి సులభంగా వీసా యాక్సెస్ కోసం ప్రయత్నిస్తోంది. అంగీకరిస్తే, ఇది రక్షణాత్మక ఖూ విధానానికి విరుద్ధంగా భారతదేశానికి కొత్త మార్కెట్లను తెరుస్తుంది. ఇది ఖూపై భారతదేశం ఆధారపడటాన్ని కూడా తగ్గిస్తుంది. ఈ ఒప్పందం భారతదేశానికి యూరోపియన్ పెట్టుబడులను ఆకర్షిస్తుంది, ముఖ్యంగా క్లీన్ ఎనర్జీ, పునరుత్పాదక శక్తి, ఫార్మాస్యూటికల్స్, అధునాతన తయారీ వంటి రంగాలలో గణనీయంగా పెరుగుతాయి. ఇంకా, భారతీయ సంస్థలు యూరోపియన్ సరఫరా గొలుసులలో మరింత లోతుగా విలీనం చేయడం జరుగుతుంది. ప్రపంచ ఉత్పత్తి నెట్‌వర్క్‌లలో భారతదేశం స్థానాన్ని బలోపేతం చేస్తాయి. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడటానికి వ్యవసాయం, పాడి పరిశ్రమ వంటి సున్నితమైన రంగాలను ఒప్పందం పరిధి నుండి మినహాయించి, ఈ ఒప్పందంలో భారతదేశం తన రెడ్ మార్క్‌ను కొనసాగించింది. యూరప్ వేగంగా అభివృద్ధి చెందుతున్న, ప్రతిష్టాత్మకమైన మధ్యతరగతి మార్కెట్?ను పొందుతుంది. వ్యూహాత్మకంగా, జుఖ చైనాపై అధిక ఆధారపడటాన్ని తగ్గించడానికి దాని సరఫరా గొలుసును వైవిధ్యపరచాలని కోరుకుంటుంది. ఈ సందర్భంలో, ఈ ఒప్పందం భారతదేశాన్ని నమ్మకమైన, భౌగోళిక రాజకీయంగా ముఖ్యమైన భాగస్వామిగా మార్చగలదని విశ్లేషకులు భావిస్తున్నారు. జుఖ భారతదేశ ప్రయాణీకుల వాహన మార్కెట్‌కు మెరుగైన ప్రాప్యతను కోరుకుంటుంది. ఇక్కడ దిగుమతి సుంకాలు ప్రస్తుతం 100% నుండి 125% వరకు ఉన్నాయి. ఇక యూరోపియన్ వైన్లు, స్పిరిట్స్ ప్రస్తుతం 150% నుండి 200% వరకు అధిక సుంకాలను ఎదుర్కొంటున్నాయి. ఒప్పందం ప్రకారం, ఇయు ఈ సుంకాలలో తగ్గింపులను, ధృవీకరణ విధానాలలో సడలింపులను కోరవచ్చు. ఇయు తన జున్ను సహా ఇతర పాల ఉత్పత్తులపై, అలాగే రసాయనాలు, యంత్రాలపై తక్కువ సుంకాలను కోరుతోంది. భారతదేశం పాల ఉత్పత్తులపై మినహాయింపులు ఇచ్చే అవకాశం లేనప్పటికీ, రసాయనాలు, యంత్రాలకు ఎక్కువ మార్కెట్ ఓపెనింగ్‌ను అంగీకరించవచ్చు. భారతదేశ ఆర్థిక, చట్టపరమైన, బ్యాంకింగ్, టెలికాం రంగాలకు జుఖ మరింత అవకాశాలను కోరుతోంది. భారతదేశంలో పెట్టుబడులు పెట్టే దాదాపు 6,000 కంపెనీలకు పారదర్శకమైన, బహిరంగమైన, ఊహించదగిన నియంత్రణ వాతావరణాన్ని ఇది కోరుకుంటుంది. వారి పెట్టుబడులు, మేధో సంపత్తి రక్షణను నిర్ధారిస్తుంది. భారతదేశం ఈ విషయంలో కూడా రాయితీలను అందించింది. భారతదేశ ముడి పదార్థాలు, అరుదైన భూమి ఖనిజాలకు ప్రత్యక్ష ప్రాప్యత జుఖ శక్తి పరివర్తన వ్యూహానికి చాలా అవసరం. ఈ ఒప్పందం క్లీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి రంగాలలో యూరోపియన్ పెట్టుబడులను పెంచుతుందని భావిస్తున్నారు. ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా, జుఖ భారతదేశం తన ప్రభుత్వ సేకరణ మార్కెట్‌ను జాతీయ, ప్రాంతీయ స్థాయిలో యూరోపియన్ కంపెనీలకు తెరవాలని కోరుకుంటుంది. ఇది నిర్మాణం, రవాణా, ఐటి వంటి రంగాలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

**చట్టపరమైన పరిశీలన:** ఒప్పందం తుది నిర్ణయం అయిన తర్వాత, ఇరుపక్షాలు దాని చట్టపరమైన సూక్ష్మ నైపుణ్యాలను పరిశీలిస్తాయి. జుఖ ట్రేడ్ కమిషనర్, భారత కౌంటర్ అధికారికంగా వ్యక్తిగత నిబంధనలను ఆమోదిస్తారు. యూరోపియన్ పార్లమెంట్?లో ఓటు, యూరోపియన్ కౌన్సిల్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. అలాగే భారతదేశంలో కూడా ఇదే ప్రక్రియ పునరావృతమవుతుంది. వస్త్రాలు, తోలు, రత్నాలు వంటి శ్రమతో కూడిన రంగాలు ప్రస్తుతం 10-12% సుంకాన్ని ఆకర్షిస్తున్నందున గణనీయంగా ప్రయోజనం పొందుతాయని భావిస్తున్నారు. వృత్తిపరమైన, నైపుణ్యం కలిగిన సిబ్బంది తరలింపు కోసం యూరోపియన్ యూనియన్‌తో చర్చలు జరుపుతున్న ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భారతదేశం ప్రస్తుతం మరిన్ని రాయితీలను కోరుతోంది. జుఖ నుండి వచ్చే ప్లాస్టిక్ ఎగుమతులపై భారతదేశం దాదాపు 10.4% సుంకం విధిస్తుంది. దీని గురించి ఎఫ్‌టిఎలో చర్చించవచ్చు. ఇది భారతదేశంలో యూరోపియన్ ప్లాస్టిక్‌లకు గణనీయమైన మార్కెట్‌ను అందిస్తుంది. వైన్, స్పిరిట్‌లపై సుంకాలను తగ్గించాలని యూరోపియన్ యూనియన్ భారతదేశంను డిమాండ్ చేస్తోంది. ఖీూా ఖరారు అయితే, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ నుండి భారతదేశానికి దిగుమతి చేసుకునే స్పిరిట్?ల ధరలు తగ్గవచ్చు.

## బిజినెస్ వాయిస్

# ఆన్‌లైన్ ద్వారా పతంజలి ఉత్పత్తులను కొనుగోలు చేయొచ్చు..

### భారీ డిస్కౌంట్ కూడా.. ఎలానో తెలుసుకోండి..




దేశంలోని ప్రముఖ ఆయుర్వేద ఉత్పత్తుల తయారీ సంస్థ పతంజలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు స్టోర్ల ద్వారా ఉత్పత్తులను కస్టమర్లకు అందిస్తోంది. అయితే ఇక నుంచి మీరు ఆన్‌లైన్, యాప్ ద్వారా కూడా ఆర్డర్ చేసుకోవచ్చు. మీ మొబైల్ నుంచే ఇంటి వద్ద ఆర్డర్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులకు ఎంత డిమాండ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దేశంలో ఎన్నో కంపెనీల ఆయుర్వేద ఉత్పత్తులు ఉన్నా.. పతంజలి ప్రొడక్ట్స్‌కు మాత్రం ప్రత్యేక పేరు ఉంది. దీంతో పతంజలి ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు అందరూ ఆసక్తి చూపిస్తూ ఉంటారు. దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో ఎక్కడికక్కడ పంతజలి స్టోర్స్ వెలిశాయి. కొంతమంది ఇక్కడికి వెళ్లి కొనుగోలు చేస్తుండగా.. ఇక ఆన్‌లైన్ ద్వారా కూడా పతంజలి ప్రొడక్ట్స్?ను కొనుగోలు చేయవచ్చు. ఇంట్లోనే ఉండి మీరు వెబ్‌సైట్, యాప్ ద్వారా ఆర్డర్ చేస్తే నేరుగా ఇంటికే డెలివరీ వస్తాయి. అంతేకాకుండా ఆన్లైన్ కొనుగోళ్లపై ఆఫర్లు, డిస్కౌంట్స్ కూడా పొందవచ్చు. క్రెడిట్ కార్డులతో చెల్లిస్తే మరిన్ని ఆఫర్లు వస్తాయి.

**యాప్ ద్వారా కూడా ఆర్డర్**

యోగా గురువు బాబా రాందేవ్ ఆధ్వర్యంలో నడుస్తున్న పతంజలి సంస్థ ఆయుర్వేద మందులే కాకుండా సబ్బు, టూత్ పేస్ట్, పిండి, నెయ్యి, మూలికా రసాలు, బిస్కెట్లు, షాంపూ లాంటి ఇంట్లోకి అవసరమయ్యే నిత్యావసర వస్తువులను విక్రయిస్తోంది. ఇక నుంచి పతంజలి షాపులను వెళ్లి కొనాల్సిన అవసరం ఇక లేదు. మీ ఇంటి వద్దనే మొబైల్ ద్వారా పతంజలి వెబ్‌సైట్ లేదా యాప్ ఉపయోగించి ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చు. డిజిటల్ విధానంలో పేమెంట్ చేస్తే నేరుగా మీ ఇంటికే డెలివరీ చేస్తారు. పట్టణాలు, గ్రామాల్లో పతంజలి స్టోర్లు ఎక్కువగా ఉండవు. దీంతో అక్కడి ప్రజలు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసుకోవచ్చు.

**ఆఫర్లు పొందండిలా..**

ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తే 3 శాతం నుంచి 10 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తోంది. ఇక పీఎన్‌బీ పతంజలి, ఆర్‌బీఎల్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో పేమెంట్స్ చేస్తే మరింత క్యాష్ బ్యాక్ పొందవచ్చు. ఇక ఉచిత డోర్ డెలివరీ సౌకర్యం కూడా పొందే అవకాశముంది.

**ఎలా ఆర్డర్ చేయాలంటే..?**

patanjaliayurved.net వెబ్‌సైట్‌ను సందర్శించండి -మీ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అవ్వండి -మీ ప్రొడక్ట్స్‌ను కార్ట్‌కు జోడించండి -ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేయండి -కొన్ని రోజుల్లో మీ ఇంటికే డోర్ డెలివరీ అవుతాయి

# హల్వా వేడుక పూర్తి..!

### ఇక బడ్జెట్ రెడీ చేసిన అధికారులను ఏం చేస్తారో తెలుసా?



కేంద్ర బడ్జెట్ తయారీ ప్రక్రియ ముగింపును సూచిస్తూ సంప్రదాయ హల్వా వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. దీనితో బడ్జెట్ అధికారులకు గోప్యతను కాపాడే లాక్-ఇన్ పీరియడ్ ప్రారంభమైంది. బడ్జెట్ పత్రాలు డిజిటల్‌గా యాప్ ద్వారా అందుబాటులో ఉంటాయి. కేంద్ర బడ్జెట్ తయారీ ప్రక్రియ చివరి దశను సూచించే సాంప్రదాయ హల్వా వేడుక మంగళవారం నార్త్ బ్లాక్‌లోని బడ్జెట్ ప్రెస్?లో జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. హల్వా వేడుకతో కేంద్ర బడ్జెట్‌ను రూపొందించడంలో పాల్గొన్న అధికారులకు లాక్-ఇన్ పీరియడ్ ప్రారంభమైంది. గోప్యతను కాపాడుకోవడంలో భాగంగా, పార్లమెంటులో బడ్జెట్‌ను సమర్పించే వరకు వారందరూ నార్తర్న్ బ్లాక్‌లోనే ఉంటారు. బయటి ప్రపంచంతో వారు కలవరు. ఫోన్, ఇంటర్నెట్ కూడా వాడకుండా ఉంచుతారు. ఒకరకంగా బడ్జెట్ ప్రవేశపెట్టే వరకు వారిని బంధించినట్లే లెక్క. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని వివిధ విభాగాల నుండి ఎంపిక చేసిన ఈ అధికారులు బడ్జెట్ సమర్పణ వరకు బాహ్య ప్రపంచం నుండి దూరంగా ఉంటారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ఆదివారం కేంద్ర బడ్జెట్?ను ప్రవేశపెడతారు. ఆ తర్వాత వీరిని విడుదల చేస్తారు. కాగా హల్వా కార్యక్రమంలో ఆర్థిక మంత్రితో పాటు ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని అన్ని విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీలో పాల్గొన్న సీనియర్ అధికారులు ఉన్నారు. సీతారామన్ బడ్జెట్ ప్రెస్?ను కూడా సందర్శించి, ముద్రణ, లాజిస్టికల్ ఏర్పాట్లను సమీక్షించి, మొత్తం బడ్జెట్ బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. బడ్జెట్ సంబంధిత పనుల ముగింపుకు ప్రతీకగా అధికారులకు వడ్డించే సాంప్రదాయ భారతీయ తీపి నుండి హల్వా వేడుకకు దాని పేరు వచ్చింది.

**బడ్జెట్ పత్రాలు డిజిటల్‌గా..**

మునుపటి సంవత్సరాల మాదిరిగానే వార్షిక ఆర్థిక నివేదిక, గ్రాంట్ల డిమాండ్, ఆర్థిక బిల్లుతో సహా అన్ని కేంద్ర బడ్జెట్ పత్రాలు కేంద్ర బడ్జెట్ మొబైల్ యాప్ ద్వారా అందుబాటులో ఉంచనున్నారు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషలలో యాక్సెస్‌ను అందిస్తుంది. ఆండ్రాయిడ్, ఐూఎస్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంటుంది. వినియోగదారులు అధికారిక కేంద్ర బడ్జెట్ పోర్టల్, indiabudget.gov.in ద్వారా కూడా పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం పూర్తయిన వెంటనే బడ్జెట్ పత్రాలు యాప్, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి.

# చీపురు అని చీప్‌గా చూడొద్దు..

### ఈ బిజినెస్‌తో ఓ ఊరి రాత మారిపోయింది..



ఛత్తీస్‌గఢ్‌లోని బలరాంపూర్ జిల్లాలో పీఎం జన్మన్ యోజన పహాడీ కోర్వా తెగ జీవితాలను మారుస్తోంది. ఈ పథకం ద్వారా గిరిజనులకు ఇళ్లతో పాటు, స్వయం సహాయక బృందాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్‌లో పాల్గొంటూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బలరాంపూర్ జిల్లాలో దట్టమైన అడవుల మధ్య నివసించే పహాడీ కోర్వా తెగ ప్రజల జీవితాల్లో పీఎం జన్మన్ యోజన ద్వారా గణనీయమైన మార్పులు వస్తున్నాయి. ఎన్నో తరాలుగా కనీస సౌకర్యాలు లేని, పూరి గుడిసెల్లో జీవనం సాగించిన ఈ గిరిజన కుటుంబాలకు ఇప్పుడు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పీఎం జన్మన్ యోజన కేవలం సురక్షితమైన ఇళ్లను నిర్మించడమే కాకుండా, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు కీలకమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఈ సమగ్ర విధానం గిరిజనుల జీవన నాణ్యతను పెంచుతూ, వారికి ఆత్మవిశ్వాసాన్ని అందిస్తోంది. ఈ పథకం కింద పహాడీ కోర్వా మహిళలు ఇప్పుడు కేవలం గృహిణులుగా కాకుండా, స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి సమాజంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, వాటి ప్రాసెసింగ్‌లో పాల్గొనడం ద్వారా వారు తమ కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. ఈ ప్రక్రియ వారి కుటుంబాల్లో ఆర్థిక భరోసాతో పాటు కొత్త ఆశలను చిగురింపజేస్తోంది. అటవీ ఉత్పత్తుల ఆధారిత చిన్న తరహా పరిశ్రమలు, ముఖ్యంగా చీపుర్ల తయారీ వంటివి వారికి స్థిరమైన ఆదాయ వనరుగా మారాయి. బలరాంపూర్ జిల్లా అటవీ శాఖ అధికారి అలోక్ కుమార్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, అట్టడుగున ఉన్న గిరిజన తెగలను అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అటవీ శాఖ ద్వారా వారికి ప్రత్యేకంగా వన్‌ధన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ సేకరించిన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను కల్పిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ చర్య గిరిజనులకు తమ శ్రమకు తగిన ప్రతిఫలం లభించేలా చూస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న ఈ చేయూతతో స్థానికంగా ఉన్న గిరిజన మహిళల తలరాతలు మారుతున్నాయి. ఉపాధి అవకాశాలు లభించడంతో తాము ఆర్థికంగా స్వతంత్రంగా మారామని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు తమ పిల్లల భవిష్యత్తుపై తీవ్రమైన ఆందోళన ఉండేదని, కానీ ఇప్పుడు పక్కా ఇల్లు, స్థిరమైన ఆదాయం లభించడంతో తమ కష్టాలు తీరాయని వారు పేర్కొంటున్నారు. అనేక మంది మహిళలు భారత ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. అడవుల్లో లభించే ఉత్పత్తులతో చీపుర్లను తయారు చేసి, వాటిని ప్రభుత్వానికే అందిస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. ఈ స్వయం ఉపాధి మార్గం ద్వారా వారు లాభాలను గడిస్తున్నారు. జంగల్ విభాగ్ ద్వారా తమకు చాలా పని లభించిందని, తాము నిబద్ధతతో పని చేస్తున్నామని గిరిజన మహిళలు చెబుతున్నారు. పని చేయడం వల్ల లాభాలు వస్తున్నాయని, ఆ లాభాలతో తమ పిల్లలను బాగా చూసుకోవడానికి, వారిని అభివృద్ధి పథంలో నడిపించడానికి తాము ప్రయత్నిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఇంతకు ముందు పని లేక కష్టంగా గడిపామని, ఇప్పుడు ధాన్యం నూర్పిడి వంటి పనులు కూడా సులభంగా జరుగుతున్నాయని వారు వివరించారు. సంకల్పం ఉంటే మార్పు సాధ్యమని నిరూపిస్తూ, బలరాంపూర్ గిరిజన నారీమణులు ఇప్పుడు ఇతర వెనుకబడిన ప్రాంతాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# బంగారం ధరలపై కేంద్రం సంచలన నిర్ణయం..?

### బడ్జెట్‌లో కీలక ప్రకటన..! దిగిరానున్న ధరలు..?



బడ్జెట్‌లో బంగారంపై కేంద్రం దిగుమతి సుంకం, జీఎస్టీ తగ్గించనుందా..? దీంతో బడ్జెట్ తర్వాత బంగారం ధరలు తగ్గనున్నాయా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. పెరిగిన బంగారం ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. ఫంక్షన్లు, పెళ్లిళ్ల సమయంలో గోల్డ్ కొనాలంటేనే భయపడుతున్నారు. దీంతో ప్రభుత్వం ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకుంటుందని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రస్తుతం బంగారం ధరలు రెచ్చిపోతున్నాయి. జెడ్ స్పీడ్‌లో దూకుడు ప్రదర్శిస్తున్నాయి. దీంతో సామాన్యుడికి అందనంత దూరంలోకి చేరుకున్నాయి. ప్రస్తుతం మంగళవారం నాటికి తులం బంగారం రూ.1.61 లక్షలకు చేరుకుంది. ఇక కేజీ వెండి అయితే ఒకేసారి రూ.12 వేలు పెరిగి రూ.3.87 లక్షలకు చేరుకుంది. త్వరలో కేజీ వెండి 4 లక్షల మార్క్‌కు చేరుకునేందుకు రెడీగా ఉంది. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు, జీఎస్టీ రేట్లను తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశముంది. అలాగే గోల్డ్ బాండ్ స్కీమ్‌ను కూడా తిరిగి ప్రారంభించాలని చూస్తోంది. దీంతో బడ్జెట్ తర్వాత బంగారం ధరలు తగ్గే అవకాశముందని మార్కెట్ వర్గాలు, సామాన్య ప్రజలు ఆశిస్తున్నారు.

**బంగారంపై దిగుమతి సుంకం తగ్గింపు..?**

భారత్ విదేశాల నుంచి బంగారాన్ని ఎక్కువగా దేశంలోని దిగుమతి చేసుకుంటుంది. దీంతో బంగారంపై విధించే దిగుమతి సుంకాల ప్రభావం కూడా ధరలపై ఉంటుంది. కొద్ది రోజుల్లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్?లో బంగారంపై విధించే దిగుమతి సుంకాన్ని తగ్గించాలని మార్కెట్ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. సుంకాలను తగ్గిస్తే బంగారం ధరలు కాస్త తగ్గనున్నాయి. దీంతో సుంకాలు తగ్గిస్తే రిటైల్ మార్కెట్ పెరగడమే కాకుండా తయారీ రంగం కూడా అభివృద్ధి చెందుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సుంకాలు, పన్నుల్లో మార్పుల వల్ల గోల్డ్ రేట్లు ఇండియాలో హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. దీంతో పెట్టుబడిదారులకు షాక్ తగులుతోంది. ఇండియాలో గోల్డ్‌ను ఒక లోహంగానే కాకుండా భద్రత, సంప్రాదాయంగా భావిస్తున్నారు. ప్రస్తుతం ధరలు పెరగడంతో కొనుగోలు చేయలేకపోతున్నారు. దీంతో పెళ్లిళ్లు, ఫంక్షన్లకు షాపింగ్‌ను సులభతరం చేసేలా బడ్జెట్?లో ప్రకటనలు ఉంటాయని చెబుతున్నారు.

**బంగారంపై జీఎస్టీ తగ్గింపు..?**

బంగారాన్ని ఒక పెట్టుబడిగా కూడా భావిస్తారు. దీంతో సావరిన్ గోల్డ్ బాండ్ పథకాన్ని తిరిగి తీసుకురావాలని నిపుణులు ప్రభుత్వాన్ని బలంగా కోరుతున్నారు. ఈ పథకం పెట్టుబడిదారులు ఉపయోగకరంగా మారనుంది. 2.5 శాతం వడ్డీ రేటు అందించడంతో పాటు ప్రభుత్వం నుంచి పన్ను ప్రయోజనాలను అందిస్తోంది. 2024లో ఈ పథకం నిలిపివేయగా.. ఇప్పుడు దానిని తిరిగి పునరుద్ధరించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఇక బంగారం కొనుగోలు చేసేటప్పుడు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం బంగారం అభరణాలపై 3 శాతం జీఎస్టీ ఉంది. దీనిని 1.25 లేదా 1.5 శాతం తగ్గించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే బంగారం రేట్లు ఇండియాలో తగ్గుతాయి. దీని వల్ల ప్రజలతో పాటు సేల్స్ పెరగడం వల్ల వ్యాపారులు లబ్ది పొందుతారని బిజినెస్ అనలిస్టులు చెబుతున్నారు. దీంతో బడ్జెట్ తర్వాత బంగారం ధరల్లో ఎలాంటి మార్పులు ఉంటాయో చూడాలి.

# బంగారంలాంటి లాభాలు ఇచ్చే హోమ్ బిజినెస్ ప్లాన్..


### ఇంట్లో నుంచే నెలనెలా భారీ ఆదాయం!




మీరు మంచి వ్యాపారాన్ని ప్రారంభించాలనుకుంటే, ఇదిగో ఒక మంచి ఆలోచన మీ కోసమే.. ఇందులో మీరు ప్రతి నెలా మంచి లాభం పొందవచ్చు. అది మరేంటో కాదు.. అరుదైన చేపలపెంపకం. దీంతో మీ చేతులకు మురికి లేకుండా ఇంట్లోనే ఉంటూ డబ్బు సంపాదించడానికి సులువైన మార్గం ఇది.. అదేలాగో ఇక్కడ చూద్దాం... ప్రతి ఒక్కరూ ఏదో ఒక వ్యాపారం ప్రారంభించి, తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బు సంపాదించాలని కోరుకుంటారు. కానీ, ఏం వ్యాపారం చేయాలి..? ఎలా మొదలు పెట్టాలో వారికి తెలియదు. వేసవి సమీపిస్తున్న కొద్దీ, కొన్ని వ్యాపారాలు నష్టాలను మిగులుస్తాయి. అటువంటి సమయంలో మీరు మంచి వ్యాపారాన్ని ప్రారంభించాలనుకుంటే, ఇదిగో ఒక మంచి ఆలోచన మీ కోసమే.. ఇందులో మీరు ప్రతి నెలా మంచి లాభం పొందవచ్చు. అది మరేంటో కాదు.. అరుదైన చేపలపెంపకం. దీంతో మీ చేతులకు మురికి లేకుండా ఇంట్లోనే ఉంటూ డబ్బు సంపాదించడానికి సులువైన మార్గం ఇది.. అదేలాగో ఇక్కడ చూద్దాం... ఇంట్లో అక్వేరియంలను పెట్టుకోవాలని, వాటిని అందంగా అలంకరించడం అందరికీ ఇష్టమే. అలాంటి వారికి మరింత ప్రియమైనవి గోల్డ్ ఫిష్. అక్వేరియంలలో గోల్డ్ ఫిష్‌లను ఉంచడం వల్ల మీ ఇంటికి మరింత అందాన్ని తెస్తాయి. ఈ గోల్డ్ ఫిష్‌ల నుండి డబ్బు సంపాదించడం చాలా ఈజీ. భారతదేశంలో ఇప్పటికే చాలా మంది ఈ వ్యాపారాన్ని ప్రారంభించారు. ఎందుకంటే గోల్డ్ ఫిష్‌తో సహా మార్కెట్లో అమ్మే చేపల ధర ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో చేపల పెంపకం ద్వారా డబ్బు సంపాదించాలనుకునే ఎవరికైనా లక్ష నుంచి 2.50 లక్షల రూపాయలు అవసరం అవుతుంది. ఈ డబ్బులో 50 వేల రూపాయలు 100 అడుగుల అక్వేరియం కొనడానికి ఖర్చు చేస్తారు. మరో 50 వేల రూపాయలు చేపల పెంపకానికి అవసరమైన సామాగ్రిని కొనడానికి ఖర్చు చేస్తారు. ఇవన్నీ కొన్న తర్వాత, ఆడ, మగ చేపల మధ్య 4:1 నిష్పత్తిలో కొనండి. అంటే, మీరు నాలుగు ఆడ చేపలు కొంటే, ఒక మగ చేప ఉండాలి. ఈ విధంగా కొనుగోలు చేసిన చేపలను అక్వేరియంలో ఉంచితే, అవి 4 నుండి 6 నెలల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంటాయి. దేశంలో చాలా మంది ఈ నమూనాను అనుసరిస్తున్నారు. సంవత్సరానికి లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. గోల్డ్ ఫిష్‌లకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంది. కాబట్టి, మీరు మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంది. గోల్డ్ ఫిష్ పరిమాణం, ఆకారం, నాణ్యత ఆధారంగా ధర నిర్ణయించబడుతుంది. ప్రతి గోల్డ్ ఫిష్‌ను రూ. 100 నుండి రూ. 1,000 వరకు అమ్మవచ్చు. మీరు నెలకు నాలుగు లేదా ఐదు సార్లు ఒకేసారి 50 నుండి 100 చేపలను అమ్మితే, మీరు ఖచ్చితంగా లాభం పొందుతారు.

# ఏపీలో మరో కొత్త ఎయిర్‌పోర్ట్..

## త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి.. ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్





ఏపీలో మరో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి రానుంది. అదే భోగాపురం ఎయిర్‌పోర్ట్. జనవరి 1వ తేదీన తొలి విమానం ల్యాండ్ అయింది. దీంతో ట్రయల్ రన్ పూర్తి అయినట్లయింది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్ పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఎప్పుడంటే..? ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్. ఏపీలో ఇప్పటికే చాలా ఎయిర్?పోర్టులు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప, కర్నూలు, రాజమండ్రి వంటి జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో మరో కొత్త ఎయిర్‌పోర్ట్ ఏపీ ప్రజలకు అందుబాటులోకి రానుంది. దీని వల్ల ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రజలకు భారీ లబ్ధి చేకూరనుంది. ప్రయాణ సౌకర్యంతో పాటు ఎయిర్‌పోర్ట్ వల్ల రవాణా సౌకర్యాలు పెరగడం వల్ల కొత్త కంపెనీలు రానున్నాయి. దీంతో హోటళ్లు, లాజిస్టిక్ వ్యాపారం పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే ఈ ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తవ్వగా.. ఏప్రిల్‌లో ప్రారంభించనున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్స్ పూర్తయ్యాయి.

**జూన్ 26న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం**

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఎప్పుడు ప్రారంభం అవుతుందనే దానిపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్లారిటీ ఇచ్చారు. జూన్ 26న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జనవరి 1వ తేదీన ట్రయల్ రన్ కింద తొలి విమానం ల్యాండ్ అయినట్లు తెలిపారు. ఈ ట్రయల్ రన్‌లో భాగంగా ఢిల్లీ నుంచి ఇండిగో విమానం భోగాపురంకు చేరుకుంది. ఈ విమానంలో రామ్మోహన్ నాయుడితో పాటు ఎంపీలు, విమానయాన సంస్థ ఉన్నతాధికారులు ప్రయాణించారు. ఈ ఎయిర్‌పోర్ట్ పనులు దాదాపు అన్నీ పూర్తయ్యాయని, ప్రారంభించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని తాజాగా రామ్మోహన్ నాయుడు అన్నారు. అటు భారత్‌లో విమానాల తయారీకి బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఏపీ, గుజరాత్‌లో తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ఈ క్రమంలో భోగాపురంలో చేత యూనిట్‌ను ఎంబ్రాయ్ సంస్థ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భూమి కేటాయించడంతో పాటు మౌలిక సదుపాయాల కోసం వసతులు కల్పిస్తామని ప్రభుత్వం ఆఫర్ ఇచ్చింది.

**భోగాపురంలో క్లస్టర్ యూనిట్**

ఎంబ్రాయర్ సంస్థ చిన్న, మధ్యస్థ, సైనిక, ట్రాన్స్‌పోర్ట్ విమానాలను తయారు చేయనుంది. దీంతో భోగాపురంలో మెయింటనెన్స్ రిపేర్ అండ్ ఓవర్ హాల్, ఏరోస్పేస్ కస్టర్లు ఏర్పాటు చేసేలా ఏపీ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. భోగాపురంలో ఇది ఏర్పాటు చేస్తే మరింత ప్రయోజనం జరగనుంది. భారత్‌లో ఎంబ్రాయర్ సంస్థ విమాన తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుండంపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమని తెలిపారు. భారత్ విమానయాన రంగంలో ఇదొక కీలక మైలురాయిగా పేర్కొన్నారు.

# నిరుద్యోగులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్..

## ఆర్టీసీలో 7673 పోస్టుల భర్తీ.. అతిత్వరలోనే..




ఏపీఎస్‌ఆర్టీసీలో కొలువుల జాతరకు తెరలేవనుంది. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న రెగ్యులర్ ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏకంగా 7,673 పోస్టుల భర్తీకి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అసలు ఏ ఏ విభాగాల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయి? నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చే అవకాశం ఉంది? తెలుసుకుందాం.. ఉద్యోగాల కోసం తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు వెయ్యి కళ్లతో ఎదరుచూస్తున్నారు. ప్రభుత్వాలు ఎప్పుడు నోటిఫికేషన్లు ఇస్తాయా అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఏపీలో మెగా డీఎస్సీతో పాటు పలు ఉద్యోగ నోటిఫికేషన్లను రిలీజ్ చేశారు. ఈ క్రమంలో ఏపీ సర్కార్ నిరుద్యోగులకు మరో గుడ్ న్యూస్ తెలిపింది. అవును..ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిరుద్యోగులకు, సంస్థలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందికి శుభవార్త అందించింది. స్త్రీ శక్తి పథకం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సంస్థను మరింత బలోపేతం చేసేందుకు భారీ స్థాయిలో రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది.

**ఖాళీగా ఉన్న 7,673 పోస్టుల భర్తీ**

ఆర్టీసీలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతించాలని కోరుతూ ఆర్టీసీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. డ్రైవర్లు 3,673 పోస్టులు, కండక్టర్లు 1,813 పోస్టులతో పాటు డిపోల్లో ఖాళీగా ఉన్న మెకానిక్‌లు, శ్రామిక్‌లు, ఇతర సాంకేతిక పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వం నుండి అనుమతి లభించిన వెంటనే ఈ నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. దీనివల్ల సంస్థలో పనిభారం తగ్గడమే కాకుండా, రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని బోర్డు భావిస్తోంది.

**ఆన్‌కాల్ డ్రైవర్లు, కండక్టర్లకు వేతనాల పెంపు**

ఉద్యోగాల భర్తీతో పాటు ప్రస్తుతం సేవలందిస్తున్న సిబ్బంది సంక్షేమం కోసం పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆన్‌కాల్ డ్రైవర్లకు రోజువారీ వేతనాన్ని రూ.800 నుండి రూ.1000 కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అదనపు విధులు నిర్వహించే కండక్టర్లకు ఇచ్చే మొత్తాన్ని రూ. 900కు పెంచారు.

**స్త్రీ శక్తి పథకానికి ఊతం**

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని ఆర్టీసీ స్పష్టం చేసింది. బస్సుల సంఖ్య పెంచడం, సిబ్బంది కొరత తీర్చడం ద్వారా మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనేదే సంస్థ ప్రధాన లక్ష్యం.

# రైలు ఆలస్యం కారణంగా పరీక్ష మిస్?..

## విద్యార్థికి రూ.9 లక్షల పరిహారం.. కోర్టు సంచలన తీర్పు!




రైళ్ల ఆలస్యం అనేది సర్వసాధారణం. ప్రతి రైలు కూడా సమయానికి వచ్చింది ఉండదు. కొన్ని రైళ్లు నిమిషాల పాటు ఆలస్యమైతే.. మరి కొన్ని రైలు గంటల తరబడి ఆలస్యమవుతుంటాయి. అయితే రైలు ఆలస్యంగా నడిచినందుకు ఓ విద్యార్థినికి రూ.9 లక్షల పరిహారం ఇవ్వాలని రైల్వేకు కోర్టు ఆదేశించింది.. భారత రైల్వేలో ఏ ఒక్క రైలు కూడా సమయానికి వచ్చింది ఉండదు. అది సూపర్ ఫాస్ట్ అయినా ఇంకేదైనా కొన్ని నిమిషాల పాటు ఆలస్యంగా నడుస్తుంటాయి. కొన్ని రైళ్లు మాత్రం గంటకుపైగానే ఆలస్యంగా వస్తుంటాయి. అయితే ప్రస్తుతం రైళ్లు ఆలస్యంగా నడవడం సర్వసాధారణంగా మారిపోయింది. కానీ ఓ రైలు ఆలస్యంగా వచ్చినందుకు ఓ విద్యార్థిని పరీక్ష మిస్ అయ్యింది. రైలు ఆలస్యంగా కారణంగా తాను పరీక్ష రాయడం మిస్ అయ్యానని ఆ సదరు విద్యార్థిని పోరాటం కొనసాగించింది. ఎట్టకేలకు పోరాటంతో గెలిచింది. ఆమె కోర్టు ద్వారా దావా వేసి భారీ జరిమానా విధించాలని డిమాండ్ చేసింది. చివరికి విద్యార్థిని విజయం సాధించారు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. రైలు ఆలస్యం కారణంగా ఒక విద్యార్థి పరీక్ష రాయలేకపోయింది. రైలు మిస్ కావడం వల్ల ఆమె మొత్తం సంవత్సరం వృధా అయింది. బాధిత విద్యార్థిని తన న్యాయవాది ద్వారా రైల్వేలకు గుణపాఠం చెప్పడానికి జరిమానా విధించాలని కోరింది. చాలా సంవత్సరాలుగా సాగిన కేసు తర్వాత వినియోగదారు ఫోరం కోర్టు విద్యార్థి ఆరోపణలు నిజమని నిర్ధారించి రైల్వేలకు గణనీయమైన జరిమానా విధించింది. నిజానికి కొత్వాలి పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని పికోరా బక్ష్ మొహల్లా నివాసి అయిన సమృద్ధి అనే విద్యార్థిని బయోటెక్‌లో బీఎస్సీ కోసం సిద్ధమవుతోంది. ఆమె పరీక్షా కేంద్రం లక్నోలోని జయనారాయణ్ పీజీ కళాశాలకు కేటాయించారు. పరీక్ష రాయడానికి విద్యార్థిని బస్తీ నుండి ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ రైలు బుక్ చేసుకుంది. రైలు ఉదయం 11 గంటలకు లక్నోకు చేరుకోవాల్సి ఉంది. కానీ ఆలస్యం కారణంగా రైలు షెడ్యూల్ కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. అయినప్పటికీ ఆమె పరీక్ష కేంద్రానికి మధ్యాహ్నం 12:30 గంటలకు చేరుకుంది. ఫలితంగా ఆమె పరీక్షకు దూరమైంది. బాధిత విద్యార్థి ఈ విషయాన్ని వినియోగదారుల కమిషన్‌కు తీసుకెళ్లింది. రైల్వేలు దాని పరిణామాలను అనుభవించాల్సి వచ్చింది. జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్/న్యాయమూర్తి అమర్‌జీత్ వర్మ, సభ్యులు అజయ్ ప్రకాష్ సింగ్ రైల్వేలకు జరిమానా విధించి, విద్యార్థికి 910,000 రూపాయల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. రైల్వేలు పరిహారం చెల్లించడంలో ఆలస్యం చేస్తే చెల్లింపులో 12 శాతం వడ్డీగా చెల్లించాల్సి ఉంటుందని కూడా కోర్టు పేర్కొంది. సమృద్ధి న్యాయవాది ప్రభాకర్ మిశ్రా మాట్లాడుతూ.. ఆమె మే 7, 2018న తన బీఎస్సీ బయోటెక్ పరీక్ష రాయడానికి లక్నో వెళ్లిందని వివరించారు. అయితే రైలు ఆలస్యం కారణంగా ఆమె పరీక్షకు హాజరు కాకపోవడంతో ఆమె మొత్తం సంవత్సరం వృధా అయింది. ఆమె జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్?లో దావా వేసింది. రైల్వే మంత్రిత్వ శాఖ, జనరల్ మేనేజర్, స్టేషన్ సూపరింటెండెంట్?లకు నోటీసులు పంపినట్లు చెప్పారు. కానీ ఎటువంటి స్పందన రాకపోవడంతో సెప్టెంబర్ 11, 2018న కోర్టులో దావా వేసినట్లు చెప్పారు. ఈ కేసు ఏడు సంవత్సరాలకు పైగా కొనసాగింది. కమిషన్ రెండు పక్షాల వాదనలు విన్నది. రైల్వేలు రైలు ఆలస్యానికి కారణమని అంగీకరించాయి. కానీ ఆలస్యానికి కారణాన్ని వివరించలేదు. కోర్టు జరిమానా విధించి, రైల్వేలను 45 రోజుల్లోపు 9 లక్షల 10 వేల రూపాయలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని నిర్ణీత సమయంలోపు వినియోగదారునికి చెల్లించకపోతే వినియోగదారుకు మొత్తం మొత్తానికి 12 శాతం వడ్డీని చెల్లించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

### లిఫ్ట్ ఎక్కిన మహిళ..

# సడెన్‌గా ఎంటరైన ముసుగు వ్యక్తి..

## చివరకు ఊహించని ఘటనతో అంతా షాక్..



భోపాల్ ఎయిమ్స్‌లో సెక్యూరిటీ వైఫల్యం బట్టబయలైంది. లిఫ్ట్‌లో ఒంటరిగా వెళ్తున్న మహిళా ఉద్యోగిని లక్ష్యంగా చేసుకుని ముసుగు ధరించిన దొంగ దాడికి పాల్పడ్డాడు. మాటలతో నమ్మించి, గొలుసు లాక్కొని పరారయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎలా జరిగిందంటే..? ఆసుపత్రులు అంటే ప్రాణాలు కాపాడే చోటు. కానీ భోపాల్‌లోని ప్రఖ్యాత ఎయిమ్స్ ఆసుపత్రిలో ఒక మహిళా ఉద్యోగికి భయంకరమైన అనుభవం ఎదురైంది. నిత్యం రద్దీగా ఉండే లిఫ్ట్ లోనే ఒక దొంగ ఆమెపై దాడి చేసి మెడలోని గొలుసును లాక్కెళ్ళాడు. ఆదివారం నాడు ఎయిమ్స్ లోని గైనకాలజీ విభాగంలో పనిచేసే వర్ష సోని అనే ఉద్యోగిని తన పని ముగించుకుని బ్లడ్ బ్యాంక్ వెనుక ఉన్న లిఫ్ట్ ఎక్కారు. ఆ సమయంలో ముసుగు ధరించిన ఒక యువకుడు కూడా లిఫ్ట్ లోకి ప్రవేశించాడు. ఆమెను నమ్మించడానికి కంటి విభాగం ఏ అంతస్తులో ఉంది” అని అడిగాడు. లిఫ్ట్ మూడవ అంతస్తుకు రాగానే ఆ యువకుడు బయటకు వెళ్తున్నట్లు నటించి ఒక్కసారిగా వెనక్కి తిరిగి వర్షపై పడ్డాడు. ఆమె మెడలోని బంగారు గొలుసు, మంగళసూత్రాన్ని బలంగా లాగాడు. వర్ష గట్టిగా ప్రతిఘటించినా, అతను ఆమెను పక్కకు తోసేసి మంగళసూత్రంతో మెట్ల మార్గంలో పారిపోయాడు. ఈ తోపులాటలో ఆమె ముత్యాల హారం విరిగి కింద పడిపోయింది. నిత్యం రద్దీగా ఉండే లిఫ్ట్ ప్రాంతంలో కనీసం ఒక్క సెక్యూరిటీ గార్డు కూడా లేకపోవడం గమనార్హం. ఆదివారం కావడంతో భద్రత సడలించినట్లు తెలుస్తోంది. దీనిని ఆసరాగా చేసుకున్న నిందితుడు ఐపీడీ గేటు ద్వారా సులభంగా తప్పించుకున్నాడు. దాడికి సంబంధించిన వీడియో సీసీటీవీలో రికార్డు అయ్యింది. అయితే నిందితుడు ముసుగు ధరించడం వల్ల అతన్ని గుర్తించడం పోలీసులకు సవాలుగా మారింది. బాధితురాలు వర్ష సోని ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాగ్సెవానియా పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే ఇంతవరకు ఎఫ్?ఐఆర్ నమోదు కాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రి వంటి సురక్షిత ప్రాంతాల్లోనే ఇలాంటి ఘటనలు జరిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**చట్టంలోని మార్పులే నేరగాళ్లకు వరమా?**

ఈ తరహా ఘటనలు భోపాల్‌లో గత ఏడాది కాలంలో నాలుగు రెట్లు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ప్రధాన కారణం కొత్త క్రిమినల్ ఫ్రేమ్‌వర్క్‌లో జరిగిన మార్పులని నిపుణులు భావిస్తున్నారు. గతంలో దోపిడీ కిందకు వచ్చే ఇటువంటి నేరాలకు 10 నుండి 14 ఏళ్ల శిక్ష ఉండేది. ప్రస్తుతం వీటిని స్నాచింగ్ కిందకు మార్చడంతో గరిష్ఠ శిక్ష కేవలం 3 ఏళ్లకు పరిమితమైంది. కొత్త నిబంధనల ప్రకారం అరెస్టు తప్పనిసరి కాదు, నోటీసులతోనే నిందితులు బయటపడే అవకాశం ఉంది. భోపాల్ పోలీసు రికార్డుల ప్రకారం.. 2024లో కేవలం 39 స్నాచింగ్ కేసులు నమోదు కాగా 2025 నాటికి ఆ సంఖ్య ఏకంగా 165కు చేరింది.



# యముడికే మస్కా కొట్టాడు.. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కూలిన స్థంభం..

చావుని చూసొచ్చాడు. గండాన్ని తప్పించుకున్నాడు. చచ్చి బతికాడు.. ఇలా కొన్ని సందర్భాల్లో ఏవో మాటలు వింటూ ఉంటాం. కానీ అలాంటి ఘటనే ఇప్పుడు కర్నూలు జిల్లాలో వెలుగు చూసింది. క్షణంలో వందోవంతు ఆలస్యమై ఉన్నా ఇక్కడ ఓ కుర్రాడు మాడి మసైపోయేవాడు. ఇందులో ఏ మాత్రం డౌట్ అవసరం లేదు. వెంట్రుకవాసిలో మరణాన్ని తప్పించుకున్నాడు. అందుకే ఇతను మృత్యుంజయుడయ్యారు. భూమిపై నూకలు ఉన్నాయంటే ఇదేనేమో.. రెప్పపాటులో పెను ప్రమాదం నుంచి ఓ బాలుడు తప్పించుకున్నాడు. బాలుడు రోళ్లపై నడుచుకుంటూ వెళ్తుండగా.. సడెన్‌గా ఓ విద్యుత్ స్థంభం కూలి బాలుడిపై పడబోయింది. గమనించిన బాలుడు తృటిలో ఈ ప్రమాదం నుంచి తప్పించుకొని బయటపడ్డాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ దృశ్యాలు చూసిన స్థానికులందరూ ఆ బాలుడికి నిండు నూరేళ్లు ఉన్నాయని చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కర్నూలు నగరంలోని అశోక్ నగర్ లో ఈ ప్రమాదం వెలుగు చూసింది. కాలనీలో కాలువలు మరమ్మత్తులు చేస్తున్నారు కార్మికులు. అదే సమయంలో అటుగా ఓ విద్యార్థి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో సడెన్‌గా రోడ్డు పక్కన ఉన్న ఓ స్థంభం కూలిపోయింది. అది గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో అలర్ట్ అయిన బాలుడు రెప్పపాటులో ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ తతంగం అంతా అక్కడే ఉన్న సీసీ కెమెరాలో రికార్డ్ అవ్వడంతో ఇవి కాస్తా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీడియో చూసిన నెటిజన్లు అంతా భూమిపై నూకలు ఉన్నాయంటే ఇదేనేమో అనే కామెంట్స్ చేస్తున్నారు.

క్రీడా వాయిస్

# 5 రోజుల్లో 16 మ్యాచ్‌లు..

## రంగంలోకి రెండు భారత జట్లు.. పూర్తి షెడ్యూల్ ఇదిగో..!



2026 టీ20 ప్రపంచ కప్‌కి ముందు, అన్ని జట్లకు వార్మప్ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో రెండు భారత జట్లు మైదానంలోకి దిగనున్నాయి. ఒకటి టీం ఇండియా ఏ కాగా, మరొకటి టీమిండియా ప్రధాన జట్టు. వార్మప్ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను ఓసారి చూద్దాం.. 2026 టీ20 ప్రపంచ కప్ ఫిబ్రవరి 7న ప్రారంభం కావాల్సి ఉంది. అయితే టోర్నమెంట్‌కు నాలుగు రోజుల ముందు 16 టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి. షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే, ఐసీసీ వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. ఇందులో రెండు భారత జట్లు పాల్గొంటాయి. ఇండియా ఏతోపాటు ప్రధాన భారత జట్టు వార్మప్ మ్యాచ్‌లలో పాల్గొంటాయి. షెడ్యూల్ ప్రకారం, ఇండియా ఏ రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. రెండూ నవీ ముంబైలో జరుగుతాయి. ఫిబ్రవరి 4న టీమిండియా నవీ ముంబైలో దక్షిణాఫ్రికాతో కూడా ఆడనుంది.టీ20 ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్ షెడ్యూల్.. టీ20 ప్రపంచ కప్ వార్మప్ మ్యాచ్‌లు ఐదు రోజుల పాటు జరుగుతాయి. అవి ఫిబ్రవరి 2న ప్రారంభమవుతాయి. ఇక్కడ ఆరు జట్లు ఒకదానితో ఒకటి తలపడతాయి. ఆ తర్వాత ఫిబ్రవరి 3న మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. ఫిబ్రవరి 4న భారత్ వర్సెస్ పాకిస్తాన్ తమ తమ మ్యాచ్‌లను ఆడతాయి. పాకిస్తాన్ కొలంబోలో ఐర్లాండ్‌తో వార్మప్ మ్యాచ్ ఆడుతుంది.

**ఇది షెడ్యూల్..**

ఫిబ్రవరి 2 - ఆఫ్ఘనిస్తాన్ vs స్కాట్లాండ్, బెంగళూరు, యూఎస్ఏ vs ఇండియా ఏ, నవీ ముంబై కెనడా vs ఇటలీ, చెన్నై, ఫిబ్రవరి 3 - ఒమన్ vs శ్రీలంక ఏ, కొలంబో, నెదర్లాండ్స్ vs జింబాబ్వే, కొలంబో, నేపాల్ vs అమెరికా, చెన్నై, ఫిబ్రవరి 4 - స్కాట్లాండ్ vs నమీబియా, బెంగళూరు, ఆఫ్ఘనిస్తాన్ vs వెస్టిండీస్, బెంగళూరు, పాకిస్తాన్ vs ఐర్లాండ్, కొలంబో, ఇండియా vs దక్షిణాఫ్రికా, నవీ ముంబై. ఫిబ్రవరి 5 - జింబాబ్వే vs ఒమన్, కొలంబో, నేపాల్ vs కెనడా, చెన్నై, ఆస్ట్రేలియా vs నెదర్లాండ్స్, కొలంబో, న్యూజిలాండ్ vs అమెరికా, నవీ ముంబై. ఫిబ్రవరి 6 - ఇటలీ vs యుఎఇ, చెన్నై, నమీబియా vs ఇండియా ఏ, బెంగళూరు.

**టీ20 ప్రపంచ కప్ గురించి కీలక విషయాలు..**

టీ20 ప్రపంచ కప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరుగుతుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి. భారతదేశంతోపాటు శ్రీలంక ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. భారతదేశంలో, అహ్మదాబాద్, ముంబై, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీలోని స్టేడియాలలో మ్యాచ్‌లు జరుగుతాయి. శ్రీలంకలో మూడు వేదికలు ఉపయోగించనున్నారు.

మార్చి 8న నరేంద్ర మోడీ స్టేడియంలో ఫైనల్ జరుగుతుంది.

ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ జరుగుతుంది.

టీ20 ప్రపంచ కప్‌లో 20 జట్లు పాల్గొంటున్నాయి. 5 జట్ల చొప్పున 4 గ్రూపులు ఏర్పాటు చేశారు.

గ్రూప్ ఏలో భారత్, పాకిస్తాన్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా ఉన్నాయి.

గ్రూప్ బీలో ఆస్ట్రేలియా, శ్రీలంక, ఐర్లాండ్, జింబాబ్వే, ఒమన్ ఉన్నాయి.

గ్రూప్ సీలో ఇంగ్లాండ్, వెస్టిండీస్, స్కాట్లాండ్, నేపాల్, ఇటలీ ఉన్నాయి.

గ్రూప్ డీలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, కెనడా, యుఎఇ ఉన్నాయి.

# కోహ్లీ రికార్డుకు దరిదాపుల్లో ఎవరూ లేరు..

## టీ20 వరల్డ్ కప్ హిస్టరీలో మోస్ట్ వాంటెడ్ ప్లేయర్స్ వీళ్లే..




టీ20 క్రికెట్‌లో ఒక్క ఓవర్, ఒక్క వికెట్ లేదా ఒకే ఒక మెరుపు ఇన్నింగ్స్ మ్యాచ్ ఫలితాన్ని తలకిందులు చేస్తుంది. ఇలాంటి ఉత్కంఠ సమయాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి, జట్టును గెలిపించే ఆటగాళ్లకు దక్కే అత్యున్నత పురస్కారమే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్. ఇప్పటి వరకు జరిగిన 9 టీ20 ప్రపంచకప్‌ల చరిత్రను ఒకసారి తిరగేస్తే, ఎందరో దిగ్గజాలు ఈ అవార్డులను అందుకున్నారు. అయితే అందరికంటే అత్యధిక సార్లు ఈ ఘనత సాధించి పొట్టి ప్రపంచకప్ రారాజుగా నిలిచాడు విరాట్ కోహ్లీ. ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలుగా టీ20 ప్రపంచకప్ 2026 సందడి మొదలుకానుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమిండియా.. తన సొంత గడ్డపై మూడోసారి ట్రోఫీని గెలిచి చరిత్ర సృష్టించాలని పట్టుదలగా ఉంది. క్రికెట్ టోర్నీ ఏదైనా సరే, మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు ఇచ్చే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ప్రత్యేక గౌరవం ఉంటుంది. ఇప్పటి వరకు జరిగిన 9 పొట్టి ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో అత్యధిక సార్లు ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మన కింగ్ కోహ్లీ అందరికంటే ముందున్నాడు.

**నెంబర్ వన్ స్థానంలో విరాట్ కోహ్లీ**

టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధికంగా 8 సార్లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను గెలుచుకుని విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. 2012 నుంచి 2024 వరకు మొత్తం 7 ప్రపంచకప్‌లలో పాల్గొన్న కోహ్లీ, 35 మ్యాచ్‌ల్లోనే ఈ అద్భుతమైన ఘనతను సాధించాడు. క్లిష్ట పరిస్థితుల్లో జట్టును ఆదుకోవడంలో కోహ్లీకి సాటిరెవరూ లేరని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో కోహ్లీ ప్రదర్శన మరచిపోలేము.

**రెండో స్థానంలో నలుగురు దిగ్గజాలు**

జాబితాలో రెండో స్థానం కోసం నలుగురు ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ ఉంది. వెస్టిండీస్ విధ్వంసకర వీరుడు క్రిస్ గేల్, శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్, స్పిన్నర్ ఆడమ్ జంపా తలో 5 సార్లు ఈ అవార్డును అందుకున్నారు. ఇందులో ఆడమ్ జంపా కేవలం 21 మ్యాచ్‌ల్లోనే 5 సార్లు అవార్డు గెలుచుకోవడం విశేషం. జయవర్ధనే 31 మ్యాచ్‌ల్లో, గేల్ 33 మ్యాచ్‌ల్లో, వాట్సన్ 24 మ్యాచ్‌ల్లో ఈ ఫీట్ సాధించారు.

**మూడు, నాలుగో స్థానాల్లో ఎవరంటే?**

మూడో స్థానంలో దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్, శ్రీలంక మాజీ ఓపెనర్ తిలకరత్నే దిల్షాన్, పాక్ స్టార్ షాహిద్ అఫ్రిది, బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ ఉన్నారు. వీరు నలుగురు తలో 4 సార్లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లుగా నిలిచారు. ఇక నాలుగో స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ (భారత్), జోస్ బట్లర్ (ఇంగ్లాండ్), సనత్ జయసూర్య (శ్రీలంక), కెవిన్ పీటర్సన్ (ఇంగ్లాండ్) వంటి ఆరుగురు ఆటగాళు 3 సార్లు చొప్పున ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ గణాంకాలను పరిశీలిస్తే శ్రీలంక ఆటగాళ్లు టీ20 ప్రపంచకప్‌లో అత్యంత ప్రభావం చూపినట్లు అర్థమవుతోంది. అయితే, రాబోయే 2026 ప్రపంచకప్‌లో ఈ జాబితాలో మరిన్ని మార్పులు వచ్చే అవకాశం ఉంది. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా వంటి ప్రస్తుత తరం ఆటగాళ్లు కోహ్లీ రికార్డు దిశగా అడుగులు వేస్తారేమో చూడాలి.

# ఫ్యాన్స్‌కు షాకింగ్ న్యూస్.. టీ20 ప్రపంచకప్ నుంచి తోపు ప్లేయర్ ఔట్..



టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానుంది. భారతదేశంతోపాటు శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత జట్టు ఇప్పటికే 15 మంది సభ్యులతో కూడిన బలమైన జట్టును ఏర్పాటు చేసింది. ఈ జట్టు నుంచి ఒక ఆటగాడిని తొలగించే అవకాశం ఉంది. టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభానికి ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న క్రికెట్ మెగా టోర్నీ కోసం అన్ని జట్లు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. ఈ సన్నాహాల మధ్య, టీమిండియా ఆటగాళ్లలో ఒకరు టోర్నమెంట్ నుంచి తప్పుకునే అవకాశం ఉందని వార్తలు వెలువడ్డాయి. భారత ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ టీ20 ప్రపంచ కప్ కు ఎంపికయ్యాడు. కానీ, న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ సమయంలో గాయపడ్డాడు. ఎడమ స్నాయువు గాయం కారణంగా న్యూజిలాండ్ తో జరిగిన టీ20 సిరీస్ కు అతను దూరమయ్యాడు. టీ20 ప్రపంచ కప్ కు ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే, వాషింగ్టన్ సుందర్ పూర్తిగా ఫిట్ గా ఉన్నాడని ఎటువంటి నివేదిక లేదు. అందువల్ల, అతను రాబోయే టీ20 ప్రపంచ కప్ కు దూరంగా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఇదిలా ఉంటే, వాషింగ్టన్ సుందర్‌ను పక్కన పెడితే ఎవరికి అవకాశం లభిస్తుందనే ప్రశ్న తలెత్తింది. ఈ ప్రశ్నకు ప్రస్తుత సమాధానం రియాన్ పరాగ్ లేదా రవి బిష్ణోయ్. సుందర్?కు బదులుగా స్పిన్నర్‌ను ఎంచుకుంటే, రవి బిష్ణోయ్‌కు అవకాశం లభిస్తుంది. ఆల్ రౌండర్‌ను ఎంచుకుంటే, రియాన్ పరాగ్‌కు అవకాశం లభించే అవకాశం ఉంది.

**టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు:** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, సంజు శాంసన్ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, కిల్‌దీప్ కీపర్ సింగ్, వాషింగ్టన్ సుందర్ (అనుమానం).

# 11 ఫోర్లు, 9 సిక్సర్లు.. 57 బంతుల్లో తుఫాన్ సెంచరీ..

## టీ20 ప్రపంచకప్‌నకు ముందే హెచ్చరించిన ఇంగ్లాండ్ కెప్టెన్




32వ ఓవర్లో బ్యాటింగ్‌కు వచ్చి, కేవలం 49 ఓవర్లో సెంచరీ చెలరేగిన ఇంగ్లండ్ కెప్టెన్.. టీ20 ప్రపంచకప్ 2026కు ముందే ప్రత్యర్థి జట్లకు హెచ్చరికలు జారీ చేశాడు. 11 ఫోర్లు, 9 సిక్సర్లతో కేవలం 57 బంతుల్లో సెంచరీ చేసి షాకిచ్చాడు. వన్డే ప్రపంచ కప్ ఇంకా చాలా దూరంలోనే ఉంది. కానీ, దానికి ముందు టీ20 ప్రపంచ కప్ సందడి మొదలుకానుంది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ ప్రత్యర్థి జట్లకు హెచ్చరికలు జారీ చేశాడు. టీ20 ప్రపంచ కప్ ప్రారంభానికి కేవలం 10 రోజుల ముందు, బ్రూక్ శ్రీలంక పర్యటనలో తుఫాన్ బ్యాటింగ్?తో ఊచకోత కోశాడు. తుఫాన్ సెంచరీతో రచ్చలేపాడు. ఇంగ్లాండ్ వర్సెస్ శ్రీలంక మధ్య జరిగిన వన్డే సిరీస్‌లోని మూడవ, చివరి మ్యాచ్‌లో, ఇంగ్లీష్ కెప్టెన్ బ్రూక్ కేవలం 57 బంతుల్లో సెంచరీ సాధించి సంచలనం సృష్టించాడు. బ్రూక్ సెంచరీ ఒక ప్రధాన హెచ్చరికగా మారింది. ఎందుకంటే, టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు వచ్చే నెలలో శ్రీలంకలోనూ జగనున్న సంగతి తెలిసిందే.

**బ్రూక్ డేంజరస్ ఇన్నింగ్స్..**

కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో విజయం సాధించినప్పటికీ పిచ్‌ను ప్రశ్నించిన ఇంగ్లాండ్ కెప్టెన్ బ్రూక్, అదే మైదానంలో జరిగిన మూడో వన్డేలో సంచలనం సృష్టించాడు. ఈసారి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. బ్రూక్ శ్రీలంక బౌలర్లను చిత్తు చేసి తన మూడో వన్డే సెంచరీని సాధించాడు. బ్రూక్ కేవలం 66 బంతుల్లో 20 బౌండరీలు (11 ఫోర్లు, 9 సిక్సర్లు) సహా 136 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. ఇది మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టుకు 357 పరుగులు చేయడానికి సహాయపడింది. వరుసగా మూడో మ్యాచ్‌లో, ఓపెనర్ల వైఫల్యం తర్వాత జో రూట్, జాకబ్ బెథెల్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. బెథెల్ అవుట్ అయిన తర్వాత, ఇంగ్లీష్ కెప్టెన్ బ్రూక్ క్రీజులోకి వచ్చాడు. ఆ తర్వాత అతను శ్రీలంక బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలో మోత మోగించాడు. బ్రూక్ 49వ ఓవర్ మొదటి బంతికి ఒక పరుగు సాధించడం ద్వారా తన మూడవ వన్డే సెంచరీని పూర్తి చేసుకున్నాడు. తన సెంచరీని చేరుకున్న తర్వాత, బ్రూక్ తొమ్మిది బంతులు ఎదుర్కొని, మూడు సిక్సర్లు, మూడు ఫోర్లు కొట్టి మొత్తం 36 పరుగులు సాధించాడు.

**జోరూట్ కూడా..**

బ్రూక్ తుఫాన్ బ్యాటింగ్‌తో 32వ ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి 49వ ఓవర్‌లో సెంచరీ సాధించి షాకిచ్చాడు. ఈ సమయంలో, అతను చాలా ముందుగానే క్రీజులోకి వచ్చిన లెజెండరీ బ్యాట్స్‌మన్ జో రూట్ కంటే ఎక్కువ పరుగులు చేశాడు. రూట్ కూడా సెంచరీ సాధించాడు. బ్రూక్‌తో కలిసి కేవలం 113 బంతుల్లో 191 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకున్నాడు. అదే సమయంలో రూట్ తన 20వ వన్డే సెంచరీని సాధించాడు. అలా చేసిన మొదటి ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ అయ్యాడు. అతను 111 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

# టీ20 ప్రపంచకప్‌ను బహిష్కరిస్తే జరిగేది ఇదే..

## పిరికి పాకిస్తాన్‌కు అంత సీనుందా.?




పాకిస్థాన్ టీ20 వరల్డ్ కప్ 2026ను బహిష్కరించే వకాశం ఉందా లేదా అనే విషయం తెలియాలంటే సోమవారం వరకు ఆగాల్సిందే. అయితే, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల ప్రకారం అది ఆ దేశ క్రికెట్ బోర్డుకి ఒక "ఆత్మహత్య" లాంటి నిర్ణయమే అవుతుందని నిపుణులు అంటున్నారు. అసలు పాక్ బహిష్కరిస్తే వచ్చే పరిణామాలు ఏంటో ఓసారి చూద్దాం.. బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకోవడంతో మింగుడుపడని పాకిస్తాన్ టీం రోజుకో న్యూస్ తో వివాదాలను సృష్టించాలని కోరుకుంటోంది. ఇటు బీసీసీఐను, అటు ఐసీసీని కొత్త తలనొప్పులను తీసుకొచ్చేలా ప్రవర్తిస్తోంది. ఈ క్రమంలో తాజాగా భారత జట్టుతో మ్యాచ్ నుంచి తప్పుకుంటామని, బహిష్కరిస్తామంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చెప్పుకొస్తోంది. అంతేకాక అసలు టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకుంటామని హెచ్చరిస్తోంది. ఈ క్రమంలో సోమవారం పాకిస్తాన్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై పాక్ జట్టు భవిష్యత్తు ఆధారపడి ఉంది. దీంతో పాక్ జట్టు ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకుంటే, లేదా భారత జట్టుతో మ్యాచ్ ను బహిష్కరిస్తే ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..టోర్నమెంట్ కు కొన్ని నెలల ముందే ఐసీసీ షెడ్యూల్, టీంలను డిసైడ్ చేస్తుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయింది. తాజాగా బంగ్లాదేశ్ ఐసీసీ నిర్ణయాన్ని వ్యతిరేకించడంతో, టోర్నమెంట్ నుంచి తప్పుకుంది. ఈ క్రమంలో లాస్ట్ మినిట్ లో టోర్నమెంట్ నుంచి పాకిస్తాన్ జట్టు తప్పుకోవాలని ప్రయత్నిస్తే ఐసీసీ టీపీఏను ఉల్లంఘించడమే అవుతుంది. మరి ఇలాంటి ధైర్యం పాక్ జట్టు చేయగలదా అనేది చూడాలి. టోర్నమెంట్ నుంచి పాక్ జట్టు తప్పుకోవాలని డిసైడ్ చేసుకుంటే, బోర్డ్ ఆదాయంపై భారీగా ఎఫెక్ట్ పడనుంది. దాదాపు రూ.316 కోట్లు నిలిపేస్తామంటూ ఐసీసీ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ (పీసీబీ) ఆర్థికంగా చాలా వెనుకంజలో ఉంది. ఐసీసీ అందించే ఆదాయాన్ని కూడా కోల్పోతే, ఏరికోరి ఇబ్బందుల్లో పడినట్లే అవుతోంది. ఇక పాక్ ప్రభుత్వం నిర్ణయంతో టోర్నీ నుంచి తప్పుకుంటే పీసీబీ సభ్యత్వాన్ని ఐసీసీ సస్పెండ్ చేయాల్సి రావొచ్చు. గతంలోనూ ఇలాంటి సంఘటనలే జరిగాయి. జింబాబ్వే, శ్రీలంక బోర్డులపైనా ఐసీసీ నిషేధం విధించింది. ఈ ఎఫెక్ట్ ఆసియా కప్ వరకు పాకొచ్చని తెలుస్తోంది. అలాగే, మహిళల టీ20 ప్రపంచ కప్ 2028 ఆతిథ్య హక్కులను కూడా రద్దు చేసే ఛాన్స్ ఉంది. అలాగే, పీసీబీ నిర్వహించే పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్‌పైనా ఐసీసీ ఆంక్షలు విధించే ఛాన్స్ ఉంది. ఇతర దేశాల ఆటగాళ్లను పీఎస్ ఎల్ ఆడకుండా నిషేధించే ఛాన్స్ ఉంది. ఇదే జరిగితే, పాకిస్తాన్ కు కోలుకోలేని దెబ్బ తగులుంది. ఇలా ఎన్నో సమస్యలు పీసీబీ ఎదుర్కోనుంది. పాకిస్తాన్ ఇలాంటి ఆర్భాటాలు చేసి హడావుడి చేస్తుందని, చివరకు టోర్నీలో అన్ని మ్యాచ్ లు ఆడుతుందని నిపుణులు చెబుతున్నారు.

సినీ వాయిస్ CINEMA

# ఈ టాలీవుడ్ హీరోయిన్‌ను గుర్తు పట్టారా?

## ఒకప్పుడు చేతినిండా సినిమాలు.. ఇప్పుడు ఇండస్ట్రీకి దూరంగా..



కెరీర్ ప్రారంభంలోనే తన క్యూట్ యాక్టింగ్ తో అందరి దృష్టిని ఆకర్షించిందీ అందాల తార. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ భాష సినిమాల్లోనూ హీరోయిన్‌గా యాక్ట్ చేసింది. అయితే ఒకప్పుడు హీరోయిన్ గా బిజీ బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు మాత్రం.. పై ఫొటోలో ఉన్న టాలీవుడ్ హీరోయిన్ ను గుర్తు పట్టారా ఢిల్లీలో పుట్టి పెరిగిన ఈ బ్యూటీ మొన్నటివరకు తెలుగులో క్రేజీ హీరోయిన్. యంగ్ హీరోలతో కలిసి సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. ఎక్కువగా యంగ్ హీరోలతోనే నటించి మెప్పించింది. చాలా తక్కువ కాలంలోనే తన క్యూట్ యాక్టింగ్ తో చాలా మందికి ఫేవరెట్ యాక్ట్రెస్ గా మారిపోయింది. కేవలం తెలుగులోనే కాదు తమిళం, కన్నడ భాషా సినిమాల్లోనూ యాక్ట్ చేసిందీ అందాల తార. అయితే ఇదంతా గతం. ఒకప్పుడు చేతి నిండా సినిమాలతో బిజీ బిజీగా గడిపిన హీరోయిన్ ఇప్పుడు మాత్రం సినిమా ఇండస్ట్రీకి పూర్తిగా దూరంగా ఉంటోంది. ఈ బ్యూటీ తెలుగు సినిమాల్లో కనిపించి దాదాపు ఐదేళ్లవుతోంది. చివరిగా ఈ బ్యూటీ 2023లో ఓ తమిళ సినిమాలో నటించింది. ఆ తర్వాత కేవలం సోషల్ మీడియాలో మాత్రమే కనిపిస్తోంది. తన గ్లామరస్ అండ్ ఫ్యాషనబుల్ ఫొటోలను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేస్తుంటుంది.అలా తాజాగా ఆమె షేర్ చేసిన కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. మరి ఇందులో ఉన్నదెవరో గుర్తు పట్టారా? 'ఇవన్ వేరే మాదిరి' అనే తమిళ చిత్రంతో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది సురభి. తెలుగులో సందీప్ కిషన్ హీరోగా నటించిన బీరువా సినిమాతో పరిచయమైంది. ఈ సినిమా పెద్దగా ఆడకపోయినా, శర్వానంద్ హీరోగా వచ్చిన 'ఎక్స్ ప్రెస్ రాజా' మూవీ తో మంచి హిట్ అందుకుందీ అందాల తార. దీని తర్వాత సురభికి ఆఫర్లు క్యూ కట్టాయి. 'ఎటాక్' 'జెంటిల్ మేన్' 'ఒక్క క్షణం' 'ఓటర్', 'శశి' తదితర చిత్రాల్లో హీరోయిన్ గా చేసింది. అయితే వీటిలో జెంటిల్ మెన్ మాత్రమే సూపర్ హిట్ గా నిలిచింది. మిగతావన్నీ సోసో గా ఆడాయి. తమిళం, కన్నడ భాషల్లోనూ నటించిన ఈ ముద్దుగుమ్మకు సాలిడ్ హిట్ మాత్రం పడలేదు. అయితే ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తోన్న విశ్వంభర సినిమాలో సురభి ఓ కీలక పాత్రలో నటించనుంది. బింబిసార డైరెక్టర్ వశిష్ట తెరకెక్కిస్తోన్న ఈ మూవీ షూటింగ్ చాలా రోజులుగా జరుగుతోంది. అయతే ఈ జులైలో ఈ సినిమా విడుదల కావొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతానికి సురభి ఆశలన్నీ విశ్వంభరపైనే ఉన్నాయని తెలుస్తోంది.




# 'స్పిరిట్' మూవీపై కొత్త బజ్..

## నెక్స్ట్ షెడ్యూల్ మొదలయ్యేది అప్పుడేనా..?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుసబెట్టి సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు. ఇటీవల 'ది రాజా సాబ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ప్రభాస్, ప్రస్తుతం డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'లో నటిస్తున్నాడు. 'యానిమల్' వంటి సంచలన విజయం తర్వాత సందీప్ వంగా రూపొందిస్తున్న సినిమా కావడంతో, ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమాకు సంబంధించిన కొత్త షూటింగ్ షెడ్యూల్ 2026 జనవరి 31న ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఉత్తరాఖండ్?లోని అందమైన పర్యాటక ప్రాంతమైన ముస్సోరీలో ఈ కీలక షెడ్యూల్?ను ప్లాన్ చేశారట. అయితే, ఈ షెడ్యూల్?లో ప్రభాస్ పాల్గొనడం లేదని తెలుస్తోంది. కేవలం ఇతర ప్రధాన తారాగణానికి సంబంధించిన సన్నివేశాలను మాత్రమే అక్కడ చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తోంది. వివేక్ ఒబెరాయ్, ప్రకాష్ రాజ్, కాంచన వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టీ-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

### బాక్సాఫీస్ దగ్గర

# 'బోర్డర్ 2' ఊచకోత..

## మరో సీక్వెల్‌ను ప్రకటించిన మేకర్స్..!

బాలీవుడ్‌లో రూపొందిన దేశభక్తి చిత్రం 'బోర్డర్-2' బాక్సాఫీస్ దగ్గర సందడి చేస్తోంది. ముప్పై ఏళ్ల క్రితం వచ్చిన 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమాపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ యాక్షన్ కింగ్ సన్నీ డియోల్ మరోసారి తనదైన పర్ఫార్మెన్స్‌తో గర్జిస్తున్నారు. అనురాగ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఈ చిత్రం కొద్ది రోజుల్లోనే రూ.200 కోట్ల నెట్ మార్కును దాటేసి, రికార్డుల దిశగా దూసుకుపోతోంది. ఈ సినిమాలో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్ మరియు అహాన్ శెట్టి కీలక పాత్రల్లో నటించారు. ఇక ఈ చిత్రం థియేటర్ల వద్ద భారీ వసూళ్లతో అదరగొడుతుండటంతో, చిత్ర నిర్మాతలు ప్రేక్షకులకు ఒక అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చారు. 'బోర్డర్ 2' విజయోత్సాహంలో ఉండగానే, ఈ ఫ్రాంచైజీలో మూడవ భాగం 'బోర్డర్ 3' రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ వార్త సినీ ప్రియులను మరియు సాధారణ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా, మూడవ భాగం కథ ఏమై ఉంటుందనే చర్చకు దారితీసింది. టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్ మరియు జేపీ ఫిల్మ్స్ నుండి నిధి దత్తా కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళుతున్నారు. 'బోర్డర్ 3'కి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు మరియు ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.






# ఆమె నా ఇన్‌స్పిరేషన్..

## ఇద్దరిలో ఒకటే కామన్ అంటూ సంచలన కామెంట్ చేసిన మృణాళ్ ఠాకూర్

ఆమె 'సీతారామం' సినిమాలో సీతగా కనిపించి తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయిన ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్. అయితే ఇంతటి క్రేజ్ సంపాదించుకున్న ఈ నటికి కూడా ఒక రోల్ మోడల్ ఉంది. తనకు కష్టకాలం ఎదురైనప్పుడల్లా ఆ స్టార్ హీరోయిన్ మాటలే ధైర్యాన్ని ఇస్తాయని ఆమె చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆ గ్లోబల్ స్టార్ ప్రయాణం తనకెంతో స్ఫూర్తినిస్తుందని, ఆమె ఇంటర్వ్యూలను ఒక్కటి కూడా వదలకుండా చూస్తానని ఈ 'సీత' బయటపెట్టింది. అసలు ఆ ఇద్దరు స్టార్ హీరోయిన్ల మధ్య ఉన్న కామన్ పాయింట్ ఏంటి? రాజమౌళి సినిమాలో ఆ గ్లోబల్ స్టార్ చేయబోతున్న ఆసక్తికర పాత్ర విశేషాలేంటో తెలుసుకుందాం. ఆ హీరోయిన్ మరెవరో కాదు.. మృణాళ్ ఠాకూర్.

### ప్రియాంక చోప్రా నా స్ఫూర్తి..

టాలీవుడ్, బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న మృణాళ్ ఠాకూర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో ప్రియాంక చోప్రాపై ప్రశంసలు కురిపించింది. "ప్రియాంక చోప్రా లైఫ్ జర్నీ నాకు పెద్ద ఇన్‌స్పిరేషన్. ఆమె ఇంటర్వ్యూలను నేను ఎప్పుడూ మిస్ అవ్వను. ప్రతి విషయాన్ని ఫాలో అవుతుంటాను. ప్రియాంక ప్రయాణం, నా ప్రయాణం వేరు కావొచ్చు.. కానీ మా ఇద్దరిలో ఒకే ఒక కామన్ పాయింట్ ఉంది. మేమిద్దరం కష్టకాలంలో ఎక్కడా వెనకడుగు వేయకుండా, ఎంతో కృషి, పట్టుదలతో ముందడుగు వేశాం" అని మృణాళ్ వెల్లడించింది. ప్రియాంక చోప్రా మాట్లాడే విధానం, యువతకు ఆమె ఇచ్చే సూచనలు తనకు చాలా బాగా నచ్చుతాయని మృణాళ్ తెలిపింది. "ప్రియాంక చోప్రా లాంటి మహిళలు సినిమా ఇండస్ట్రీకి రావడం చాలా అవసరం. ఇలాంటి మహిళలు ఇంకా చాలామంది రావాలి" అంటూ తన అభిమానాన్ని చాటుకుంది. ఎలాంటి సినీ బ్యాగ్రౌండ్ లేకపోయినా, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నేడు గ్లోబల్ రేంజ్‌లో గుర్తింపు పొందిన ప్రియాంకను చూసి మృణాళ్ గర్వపడుతోంది. చాలా కాలంగా ఇండియన్ సినిమాలకు దూరంగా ఉంటున్న ప్రియాంక చోప్రా, ఇప్పుడు నేరుగా దర్శకధీరుడు రాజమౌళి ప్రాజెక్ట్‌తో గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. మహేష్ బాబు హీరోగా రాబోతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి'లో ప్రియాంక ఒక కీలక పాత్రలో కనిపించబోతోంది. ఈ సినిమాలో ఆమె 'మందాకిని' అనే పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. గ్లోబల్ స్టార్ ప్రియాంక, సూపర్ స్టార్ మహేష్ బాబు కలయికలో సినిమా వస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇక మృణాళ్ ఠాకూర్ విషయానికి వస్తే, తెలుగులో ఆమె 'డెకాయిట్' అనే సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమాతో పాటు పలు బాలీవుడ్ ప్రాజెక్టులలోనూ నటిస్తోంది. తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెడుతూ తన కెరీర్‌ను విభిన్నంగా ప్లాన్ చేసుకుంటోంది. ప్రియాంక చోప్రాను స్ఫూర్తిగా తీసుకుని, మృణాళ్ కూడా గ్లోబల్ లెవల్‌లో రాణించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఒక నటి మరో నటిని ఇంతగా మెచ్చుకోవడం నిజంగా అభినందనీయం. కష్టపడి పైకి వచ్చిన ప్రియాంక చోప్రా బాటలోనే తాను కూడా పయనిస్తానని మృణాళ్ నిరూపిస్తోంది.

సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL